www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 6-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 321 | విజయవాడ సిటీ**

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి తె. 4.15 తదుపరి ద్వాదశి; నక్షత్రం: పూర్వాషాఢ మ. 2.53 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: రా. 10.16-11.45; దుర్ముహూర్తం: మ. 12.03-12.51; అమృతఘడియలు: ఉ. 10.18-11.50; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.34; సూర్యాస్తమయం: 6.20

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సాత్విక్ జోడీ శుభారంభం

పారిస్: తెలుగు షట్లర్లు సాత్విక్ సాయిరాజ్, గాయత్రి గోపీచంద్ జోడీలు ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశాయి. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో వరల్డ్ నెంబర్ వన్ ద్వయం సాత్విక్-చిరాగ్ షెట్టి 21-13, 24-22తో ఓంగ్ యూ -టియో (మలేసియా) జోడీపై నెగ్గి, రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ 16-21, 21-19, 21-17తో సహచర షట్లర్లు అశ్విని పొన్నప్ప-తనీషా క్యాస్ట్రో ద్వయంపై గెలిచింది. లక్ష్యసేన్ 15-21, 21-15, 21-3తో సునేయమ (జపాన్)పై నెగ్గి ముందంజ వేయగా, ప్రియాన్షు రజావత్ 8-21, 15-21తో డెన్మార్క్ దిగ్గజం విక్టర్ ఆక్సెల్‌సెన్ చేతిలో ఓడిలో టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఇక, బుధవారం జరగనున్న సింగిల్స్ తొలి రౌండ్‌లో పీవీ సింధు బరిలోకి దిగనుంది.

అర్జున్‌కు డ్రా

న్యూఢిల్లీ: షెంగ్జెన్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్ ఐదో రౌండ్‌ను తెలుగు జీఎం ఇరిగేసి అర్జున్ డ్రాగా ముగించాడు. చైనాలో జరుగుతున్న ఈ టోర్నీలో అర్జున్‌కు ఇది తొలి డ్రా. మంగళవారం చైనా జీఎం యు యాంగితో ముగిసిన ఐదో రౌండ్‌లో నల్ల పావులతో బరిలోకి దిగిన అర్జున్ గత గేమ్‌లతో పోలిస్తే ఒకింత రక్షణాత్మకంగా ఆడాడు. ఆట 25వ ఎత్తు వద్ద ఇరువురు జీఎంలు డ్రాకు అంగీకరించడంతో చెరో అర పాయింట్ లభించింది. ఇక, చెక్ రిపబ్లిక్‌లో జరుగుతున్న ప్రాగ్ ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్‌లో ప్రజ్ఞానంద మూడో విజయం సాధించాడు. ఆరో రౌండ్‌లో ఉజ్బెకిస్థాన్‌తో జీఎం అబ్దుసత్తోరోవ్ నోడిర్బెక్‌పై ప్రజ్ఞానంద గెలిచాడు.

ఢిల్లీ అలవోకగా..

- జెమీమా, లానింగ్ హాఫ్ సెంచరీలు
- 29 పరుగులతో ముంబై చిత్తు



సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 20 ఓవర్లలో 192/4 (జెమీమా 69 నాటౌట్, లానింగ్ 53; షబ్నిం 1/46, పూజ 1/20).
ముంబై: 20 ఓవర్లలో 163/8 (అమన్‌జోత్ 42; జొనాసెన్ 3/21, కాప్ 2/37).

డబ్ల్యూపీఎల్‌లో అత్యంత వేగవంతమైన బంతిని విసిరిన బౌలర్‌గా షబ్నిం రికార్డులకెక్కింది. ఢిల్లీ బ్యాటింగ్‌లో మూడో ఓవర్ రెండో బంతిని ఆమె గంటకు 132.1 కిమీ వేగంతో విసిరింది. ఈ బంతిని లానింగ్ ఆడలేక పోయింది.

నేటి మ్యాచ్
గుజరాత్ x బెంగళూరు
రాత్రి 7.30 గం. నుంచి

న్యూఢిల్లీ: డబ్ల్యూపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జెమీమా రోడ్రిగ్స్ (33 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 69 నాటౌట్), లానింగ్ (38 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53) అర్ధ శతకాలతో.. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 29 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసింది. ఆరంభ మ్యాచ్‌లో ఎదురైన పరాజయానికి ఢిల్లీ అంచెలో క్యాపిటల్స్ బదులు తీర్చుకొంది. తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 4 వికెట్లకు 192 పరుగులు చేసింది. షబ్నిం పూజ, హేలీ, ఇషాక్ తలో వికెట్ పడగొట్టారు. లక్ష్య ఛేదనలో ఓవర్లన్నీ ఆడిన ముంబై 163/8 స్కోరుకే పరిమితమైంది. పేసర్ మరిజానె కాప్ (2/37) దెబ్బకు ముంబై ఘోరంగా తడబడింది. ఓపెనర్ యాస్తిక (6)తోపాటు హర్మన్‌ప్రీత్ (6)ను కాప్ అవుట్ చేయగా.. బ్రంట్ (5)ను శిఖ వెనక్కిపంపింది. ఈ దశలో మాథ్యూస్, అమెలియా కెర్ (17) నాలుగో వికెట్‌కు 25 పరుగులతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, హేలీని జొనాసెన్ (3/21) క్యాచవుట్ చేయడంతో హర్మన్‌సేన మ్యాచ్‌పై ఆశలు వదిలేసుకొంది. అమన్‌జోత్ (42), సజన (24 నాటౌట్) కొంతసేపు పోరాడినా.. ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగారు.

బాదేసిన జెమీమా

డెత్ ఓవర్లలో జెమీమా ఎడాపెడా షాట్లతో విరుచుకుపడడంతో.. ఢిల్లీ భారీ స్కోరు చేసింది. జొనాసెన్ (4 నాటౌట్)తో కలసి ఐదో వికెట్‌కు 16 బంతుల్లో అభేద్యంగా 41 పరుగులు జోడించిన రోడ్రిగ్స్.. టీమ్ స్కోరును 190 మార్క్ దాటించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన క్యాపిటల్స్‌ను లానింగ్ ముందుండి నడిపించింది. షఫాలీ (28)తో కలసి తొలి వికెట్‌కు 48 పరుగులు జోడించిన లానింగ్.. క్యాప్సీ (19), జెమీమాలతో రెండో, మూడు వికెట్లకు 31, 35 పరుగుల భాగస్వామ్యాలు నెలకొల్పింది. బౌండ్రీతో ఫిఫ్టీ పూర్తి చేసిన లానింగ్‌ను పూజ క్యాచవుట్ చేసింది. అయితే, చివరి 5 ఓవర్లలో జెమీమా సూపర్ షోతో.. ముంబై 69 పరుగులు సమర్పించుకొంది.

సెలెక్షన్ డైలమా



కుల్దీప్ వర్సెస్ ఆకాశ్
ఇంగ్లండ్‌తో ఆఖరి టెస్టు

ధర్మశాల: ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను దక్కించుకున్న జోష్‌లో ఉన్న టీమిండియా ఆఖరి మ్యాచ్ కోసం సన్నద్ధమవుతోంది. అలాగే ఈ టెస్టుకు స్టార్ పేసర్ బుమ్రా జట్టులోకి రానున్నాడు. కానీ మిడిలార్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఫిట్‌నెస్ నిరూపించుకోకపోవడంతో ధర్మశాల టెస్టుకూ దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి జరిగే ఈ ముగింపు టెస్టు కోసం భారత తుది జట్టు ఎలా ఉండబోతుందన్న ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది. బ్యాటింగ్ విభాగంలో రజత్ పటీదార్‌కు మరో అవకాశం దక్కవచ్చని భావిస్తున్నారు. సర్ఫరాజ్, జురెల్ తమ అరంగేట్రాలను చిరస్మరణీయం చేసుకున్నా.. పటీదార్ మాత్రం ఆడిన మూడు మ్యాచ్‌ల్లో 63 పరుగులే చేసి నిరాశపరిచాడు. సిరీస్‌లో మిగిలింది ఒకే మ్యాచ్ కావడంతో ఈ దశలో దేవ్‌దత్ పడిక్కల్‌కు చాన్స్ ఇవ్వడం కన్నా.. రజత్‌నే కొనసాగిస్తే బావుంటుందని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఒక రకంగా అతడికిది ఆఖరి అవకాశంగా భావించవచ్చు.

ఆకాశ్ కష్టమే!

బౌలింగ్ విభాగంలో మాత్రం కోచ్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ మల్లగుల్లాలు పడుతున్నారు. సిరీస్‌లో ఇప్పటిదాకా పేసర్లు, స్పిన్నర్లు విశేషంగా రాణించారు. దీంతో బుమ్రా రాకతో ఎవరిని ఉంచాలో? ఎవరిని తప్పించాలో? అర్థంకాని పరిస్థితి నెలకొంది. అశ్విన్ కెరీర్‌లో వందో టెస్టు ఆడబోతుండడంతో తనకు తుది జట్టులో చోటు ఖాయమే. జడేజా సంగతి సరేసరి. ఇక ఇప్పటివరకు జరిగిన నాలుగు టెస్టుల్లో జట్టు ఇద్దరు పేసర్లతోనే ఆడింది. కాబట్టి బుమ్రాకు జతగా సిరాజ్‌నే కొనసాగించనున్నారు. దీంతో కుల్దీప్ యాదవ్ లేక ఆకాశ్ దీప్‌లలో ఒకరిపై వేటు పడనుంది. ధర్మశాలలో టర్నింగ్ వికెట్‌ను ఏర్పాటు చేయనున్నారని కథనాలు వినిపిస్తున్నాయి. అలాంటప్పుడు జట్టులో కుల్దీప్‌నే కొనసాగిస్తారని ఎవరైనా అంచనా వేయగలరు. అంతేకాకుండా నాలుగో టెస్టులో అతడి బ్యాటింగ్ నైపుణ్యం కూడా జట్టును ఆదుకుంది. అయితే అరంగేట్రంలోనే ఆకాశ్ దీప్ మూడు వికెట్లతో అందరి దృష్టిని ఆకర్షించాడు.

ధర్మశాలకు రింకూ సింగ్

టీ20 బ్యాటర్ రింకూ సింగ్‌ను ఫొటో షూట్ కోసంభారత జట్టు యాజమాన్యం ధర్మశాలకు పిలిపించడం ఆసక్తిగా మారింది. బహుశా అతడికి టీ20 వరల్డ్‌కప్‌లో చోటు దక్కవచ్చన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మెగా టోర్నీకి ముందు ఇంగ్లండ్‌తో టెస్టు సిరీసే భారత్‌కు చివరిది. అనంతరం ఈనెల్లోనే ఆటగాళ్లంతా ఐపీఎల్ ఆడనున్నారు. కాబట్టి ఐపీఎల్ మధ్యలోనే వరల్డ్‌కప్ జట్టును ప్రకటించాల్సి ఉంటుంది. అందుకే ముందస్తుగా రింకూను పిలిపించారని సమాచారం. ఇక ధర్మశాలలో రింకూ ఇంగ్లండ్ కోచ్ మెకల్లమ్‌ను కలిసిన ఫొటోను ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు.

హెలికాప్టర్‌లో రోహిత్ ఎంట్రీ



భారత కెప్టెన్ రోహిత్ శర్మ హెలికాప్టర్‌లో ధర్మశాల చేరుకున్నాడు. కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ బిలాస్‌పూర్‌లోని లుహ్నూ మైదానంలో నిర్వహించిన సన్సద్ ఖేల్ మహాకుంబ్ 3.0 కార్యక్రమంలో పాల్గొనేందుకు రోహిత్ ధర్మశాల నుంచి హెలికాప్టర్‌లో వెళ్లాడు. ల్యాండ్ అయిన వెంటనే హెచ్‌పీసీఏ అధికారులు, ఈవెంట్ నిర్వాహకులు అతడికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రోహిత్‌తో పాటు కోచ్ ద్రవిడ్ కూడా పాల్గొనగా వేదికపై అభిమానులతో వీరు సరదాగా క్రికెట్ ఆడారు.

అంతర్జాతీయ క్రికెట్‌కు షాబాజ్ నదీమ్ గుడ్‌బై



న్యూఢిల్లీ: టీమిండియా ఆటగాడు, జార్ఖండ్ లెఫ్టార్మ్ స్పిన్నర్ షాబాజ్ నదీమ్ అంతర్జాతీయ స్థాయితో పాటు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కూ గుడ్‌బై చెప్పేశాడు. జాతీయ జట్టుకు ఆడేందుకు తనకు అన్ని దారులు మూసుకుపోయాయని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు 34 ఏళ్ల నదీమ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ప్రపంచవ్యాప్తంగా జరిగే టీ20 లీగ్‌లలో ఆడేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్టు తెలిపాడు. 2019-2021 మధ్య టీమిండియా తరఫున రెండు టెస్టులు ఆడిన నదీమ్.. 8 వికెట్లు పడగొట్టాడు. రెండు దశాబ్దాల తన కెరీర్‌లో 140 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడి 542 వికెట్లు తీశాడు.

ఢిల్లీ తుఫాన్స్ గెలుపు

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో ఢిల్లీ తుఫాన్స్ జట్టు అద్భుత విజయం సాధించింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 3-2తో కొచ్చి బ్లూ స్పైకర్స్‌పై నెగ్గింది. ఈ విజయంతో ఢిల్లీ పాయింట్ల పట్టికలో తిరిగి రెండో స్థానానికి చేరుకోగా, అహ్మదాబాద్ డిఫెండర్స్‌లో టాప్‌లోనే కొనసాగుతోంది.

మాకూ గుర్తింపునివ్వండి!
అంధుల క్రికెట్ జట్టు

న్యూఢిల్లీ: పురుషుల, మహిళల క్రికెట్‌లాగే తమను కూడా గుర్తించాలని అంధ క్రికెటర్లు బీసీసీఐకి విజ్ఞప్తి చేస్తున్నారు. వారిలాగే తమకూ సెంట్రల్ కాంట్రాక్ట్ ఇస్తే బాగుంటుందని అన్నారు. 'అంధుల క్రికెట్‌కు మరింత ఆదరణ దక్కాలంటే బీసీసీఐ గుర్తింపు తప్పనిసరి. అలా అయితేనే మేం ఉన్నత స్థాయికి ఎదగగలం. పాక్ అంధ క్రికెటర్లకు సెంట్రల్ కాంట్రాక్ట్ ఉంది కాబట్టే వారు అద్భుతంగా రాణిస్తున్నారు' అని భారత అంధుల క్రికెట్ జట్టు కోచ్ మహ్మద్ ఇబ్రహీం తెలిపాడు.

రసపట్టులో..

విదర్భ x ఎంపీ రంజీ సెమీస్

నాగ్‌పూర్: రంజీ ట్రోఫీ రెండో సెమీఫైనల్ రసకందాయంగా మారింది. విదర్భ గెలుపునకు నాలుగు వికెట్లు అవసరంకాగా, విజయానికి మధ్యప్రదేశ్ (ఎంపీ) 93 పరుగుల దూరంలో ఉంది. ఓవర్‌నైట్ స్కోరు 343/6తో ఆటకు నాలుగో రోజైన మంగళవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 402 పరుగులకు ఆలౌటైంది. యశ్ రాథోడ్ శతకం (141), కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ హాఫ్ సెంచరీ (77)తో రాణించారు. మధ్యప్రదేశ్ బౌలర్ అనుభవ్ అగర్వాల్ ఐదు (5/92) వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మధ్యప్రదేశ్ ఆట ముగిసేసరికి 6 వికెట్లకు 228 పరుగులు చేసింది. ప్రధాన బ్యాటర్లందరూ పెవిలియన్‌కు చేరడంతో ప్రస్తుతం క్రీజులో టెయిలెండర్లు సారాంశ్ జైన్ (16), కార్తికేయ (0) ఉన్నారు. విదర్భ బౌలింగ్ దళాన్ని ఎదుర్కొని మధ్యప్రదేశ్ టెయిలెండర్లు విజయాన్ని సాధించడం కష్టమేనని విశ్లేషకుల అంచనా వేస్తున్నారు. ఇక, తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 170కి, మధ్యప్రదేశ్ 252 పరుగులకు ఆలౌటవడం తెలిసిందే.

చోరీ చేసి పారిపోయిన పాక్ బాక్సర్



కరాచీ: ఒలింపిక్ క్వాలిఫికేషన్‌లో పాల్గొనడానికి ఇటలీ వచ్చిన పాకిస్థాన్ బాక్సర్ జొహైబ్ రషీద్ కనిపించకుండా పోయాడు. సహచరి బ్యాగు నుంచి డబ్బు దొంగిలించిన అతడి ఆచూకీ తెలియడంలేదని పాకిస్థాన్ బాక్సింగ్ సమాఖ్య తెలిపింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొంది. ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో రషీద్ కాంస్యం సాధించాడు. మహిళా బాక్సర్ లారా ఇక్రమ్ ప్రాక్టీస్‌కు వెళ్లినప్పుడు.. ఆమె గదిలోకి చొరబడి పర్సులోని విదేశీ కరెన్సీని దొంగిలించి పారిపోయాడట. విదేశాల్లో మెరుగైన జీవితం కోసం పాక్ అథ్లెట్లు ఇలా కనిపించకుండా పోవడం తరచూ జరుగుతోంది. ఇటీవల ఆదేశ ఎయిర్ హోస్టెస్‌లు కూడా ఇలా ఆచూకీ లేకుండా మాయమయ్యారనే వార్తలు కూడా వచ్చాయి.

పీసీఐపై సస్పెన్షన్ ఎత్తివేత

న్యూఢిల్లీ: భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ)పై విధించిన సస్పెన్షన్‌ను కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ ఎత్తివేసింది. కొన్నిరోజులుగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవడంలో ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారంటూ పీసీఐపై వేటు వేస్తూ గతనెల 2న క్రీడాశాఖ నిర్ణయం తీసుకుంది. అయితే, కొత్త కార్యవర్గం కోసం ఈనెల 9న ఎన్నికలు నిర్వహించేలా కమిటీ ప్రతిపాదించడంతో తాజాగా పీసీఐపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు.

బ్యాంక్ ఖాతాలకు మరోసారి కేవైసీ!?

పారదర్శకత పెంచడంతోపాటు ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేసేందుకే..



న్యూఢిల్లీ: బ్యాంక్ ఖాతాదారులూ.. మీ అకౌంట్ కేవైసీని (కస్టమరు వ్యక్తిగత వివరాల ధ్రువీకరణ ప్రక్రియ) మరోసారి అప్‌డేట్ చేయాల్సి రావచ్చు. ఎందుకంటే, బ్యాంకింగ్ వ్యవస్థలో పారదర్శకత పెంచడంతోపాటు మోసపూరిత కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు అదనపు తనిఖీల ద్వారా కేవైసీ ప్రక్రియను మరింత బలోపేతం చేయాలని బ్యాంక్‌లు ఆలోచిస్తున్నాయి. ఈ విషయమై ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వంతోనూ చర్చిస్తున్నాయి. ఈ ప్రణాళికలో భాగంగా ప్రస్తుత బ్యాంక్ ఖాతాలన్నింటికీ, ముఖ్యంగా ఒకే ఫోన్ నంబరుతో అనుసంధానితమైన పలు ఖాతాలు లేదా జాయింట్ అకౌంట్లకు బ్యాంక్‌లు అదనపు కేవైసీని కోరనున్నాయి. భిన్న పత్రాలతో వేర్వేరు ఖాతాలు తెరిచిన వ్యక్తుల నుంచి కూడా బ్యాంక్‌లు అదనపు సమాచారాన్ని కోరనున్నాయి. దేశీయ ఆర్థిక సేవల రంగంలో కేవైసీ నిబంధనలు ప్రామాణీకరించడంతో పాటు ఆయా విభాగాల మధ్య సమన్వయాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక కార్యదర్శి టీవీ సోమనాథన్ అధ్యక్షతన ఓ కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసింది. జాయింట్ అకౌంట్లకు బహుళ స్థాయి కేవైసీలో భాగంగా మరో (సెకండరీ) గుర్తింపుగా పాన్, ఆధార్, సరికొత్త మొబైల్ నంబరును కోరాలని భావిస్తున్నట్టు సీనియర్ బ్యాంక్ అధికారి ఒకరు తెలిపారు. ఈ సెకండరీ గుర్తింపు వివరాలు ఒకే వ్యక్తి భిన్న పత్రాల ద్వారా తెరిచిన వేర్వేరు ఖాతాలను (అనుసంధానితం కాని) గుర్తించేందుకు దోహదపడుతుందన్నారు. తద్వారా అకౌంట్ అగ్రిగేటర్ల (ఏఏ) నెట్‌వర్క్‌కు జాయింట్ అకౌంట్ల సమాచారం సైతం అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం ఏఏ నెట్‌వర్క్ సింగిల్ ఆపరేటెడ్ వ్యక్తిగత ఖాతాల సమాచారాన్ని మాత్రమే కలిగి ఉంది. అకౌంట్ అగ్రిగేటర్లు కస్టమర్ల ఆర్థిక ఆస్తులు, అప్పుల వివరాలను ఆ సమాచారాన్ని కలిగి ఉన్న బ్యాంక్‌లు లేదా ఆర్థిక సేవల సంస్థల నుంచి సేకరించి క్రెడిట్ రేటింగ్ బ్యూరోలు తదితర కంపెనీలకు అందిస్తాయి. అయితే, కొన్ని ఫిన్‌టెక్ కంపెనీలు కేవైసీ నిబంధనలను సరిగా పాటించడం లేదని, ఇవి ఖాతాదారుల సమాచారాన్ని క్రెడిట్ రేటింగ్ బ్యూరోలకు రిపోర్టు కూడా చేయడం లేదని గత ఏడాది ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ (ఐబీఏ) ఆర్‌బీఐ వద్ద ఆందోళన వ్యక్తపరిచింది. దాంతో రుణాల మంజూరు సమయంలో క్రెడిట్ బ్యూరోల డేటాపై పూర్తిగా ఆధారపడలేని పరిస్థితి నెలకొందని ఓ బ్యాంకర్ అన్నారు. ఈ నేపథ్యంలోనే కేవైసీ ప్రక్రియను మరింత పటిష్ఠం చేయాలని బ్యాంక్‌లు భావిసున్నాయి. ప్రస్తుతం పాస్‌పోర్ట్, ఆధార్, ఓటరు కార్డు, ఉపాధి హామీ పథకం కార్డు, పాన్ కార్డు లేదా డ్రైవింగ్ లైసెన్సు పత్రాన్ని సమర్పించి బ్యాంక్ ఖాతా తెరిచేందుకు వీలుంది. గతనెలలో ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి మండలి (ఎఫ్ఎస్‌డీసీ) ఉమ్మడి కేవైసీ నియమావళి, కేవైసీ రికార్డుల వినియోగంలో ఆర్థిక సేవల రంగంలోని ఆయా విభాగాల మధ్య సమన్వయం, కేవైసీ ప్రక్రియ

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	64,850 ▲	59,450 ▲	78,200 ▲
ముంబై	64,600 ▲	59,170 ▲	72,240 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

5వ తేదీ		విజయవాడ	463
హైదరాబాద్	469	విశాఖపట్నం	500
6వ తేదీ		వరంగల్	471
చిత్తూరు	523		
గోదావరి	463	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	116	గోదావరి	124
వరంగల్	116	విజయవాడ	124
కరీంనగర్	116	గుంటూరు	124
మహబూబ్‌నగర్	116	ఒంగోలు	124
కర్నూలు	116	చిత్తూరు	120
విశాఖపట్నం	121		

బంగారం 65000



ఒక్క రోజులోనే రూ.800 అప్
వెండిదీ అదే దారి

న్యూఢిల్లీ: పసిడి ధర చుక్కలంటుతోంది. ఢిల్లీ మార్కెట్‌లో మంగళవారం 10 గ్రాముల మేలిమి బంగారం (24 కేరట్స్) రికార్డు స్థాయిలో రూ.65,000 పలికింది. సోమవారంతో పోలిస్తే ఇది రూ.800 ఎక్కువ. కిలో వెండి ధర కూడా మంగళవారం రూ.900 పెరిగి రూ.74,900కు చేరింది. ఎంసీఎక్స్‌లో కూడా 10 గ్రాముల పసిడి ధర గత మూడు రోజుల్లోనే రూ.2,400 పెరిగింది. ఏప్రిల్‌లో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి పసిడి ధర, మంగళవారం ఎంసీఎక్స్‌లో రూ.80 పెరిగి రూ.65,542ల రికార్డు స్థాయికి చేరింది.

హైదరాబాద్ మార్కెట్: హైదరాబాద్ మార్కెట్‌లోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది. సోమవారంతో పోలిస్తే 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.770 పెరిగి రూ.64,850కి చేరింది. కిలో వెండి ధర అయితే మంగళవారం ఒక్క రోజే రూ.1,100 పెరిగి రూ.78,200 పలుకుతోంది. ఢిల్లీ, ముంబై కంటే హైదరాబాద్‌లోనే వెండి ధర ఎక్కువగా ఉంది.

కారణాలివే

- అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా ప్రస్తుతం బంగారం, వెండి ధరలు చుక్కలంటాయి. ఔన్స్ (36.19 గ్రాములు) పసిడి ధర 2,152.3 డాలర్లకు చేరింది. ఈ ప్రభావం భారత మార్కెట్‌పైనా కనిపిస్తోంది.
- జూన్ నుంచి అమెరికా కేంద్ర బ్యాంకు 'ఫెడ్ రిజర్వ్' వడ్డీరేట్లు తగ్గిస్తుందనే వార్తలు బులియన్ మార్కెట్‌కు కలిసి వస్తున్నాయి. అదే జరిగితే ఆర్‌బీఐ కూడా వడ్డీరేట్లు తగ్గించే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో మదుపరులు రుణ పత్రాలకు బదులు, పసిడి కొనుగోళ్లకు మొగ్గు చూపుతున్నారు.
- అమెరికా, జపాన్, భారత్‌లో స్టాక్ మార్కెట్లు ఇప్పటికే చుక్కలంటాయి. కొన్ని కంపెనీల షేర్ల ధరలు ఫండమెంటల్స్‌తో పోలిస్తే అత్యధిక ధరల వద్ద కోట్ అవుతున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్‌మార్కెట్లు తీవ్ర దిద్దుబాటుకు లోనయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఈ ప్రమాదాన్ని ముందే పసిగట్టిన కొందరు ఇన్వెస్టర్లు పెట్టుబడులకు పెద్దగా ఢోకా లేని పసిడి మార్కెట్ వైపు మొగ్గుచూపుతున్నారు.
- అంతర్జాతీయ ఉద్రిక్తతలు: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇంకా ఒక కొలిక్కి రాలేదు. మరోవైపు ఎర్ర సముద్రంలో ప్రయాణించే నౌకలపై హైతీల దాడులు, ఇజ్రాయిల్-హమాస్ పోరాటం ఈక్విటీ మార్కెట్లను భయపెడుతున్నాయి. దీంతో సురక్షిత పెట్టుబడిగా భావించే పసిడికి డిమాండ్ పెరిగింది.

ఐసీఐజీ చేతికి వసంత్ కెమికల్స్

హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన స్పెషాలిటీ కెమికల్స్, ఫార్మా ఇంటర్మీడియేటరీల తయారీ కంపెనీ వసంత్ కెమికల్స్‌లో మెజారిటీ వాటాను జర్మనీకి చెందిన ఇంటర్నేషనల్ కెమికల్ ఇన్వెస్టర్స్ గ్రూప్ (ఐసీఐజీ) కొనుగోలు చేసింది. వసంత్ కెమికల్స్ ప్రమోటర్ జీకేబీ చౌదరి నుంచి మెజారిటీ వాటాలు కొనుగోలు చేసినట్టు ఐసీఐజీ గ్రూప్ ప్రకటించింది. ఈ లావాదేవీ అనంతరం చౌదరి మైనారిటీ వాటాదారుగా ఉండిపోతారు. అయితే డీల్ విలువ ఎంత అన్నది వెల్లడించలేదు. ఈ కొనుగోలు లావాదేవీ పూర్తయిన అనంతరం వసంత్ కెమికల్స్‌ను ఐసిఐజీ అనుబంధ ఫైన్ రసాయనాల విభాగం వెలికెమ్ గ్రూప్‌లో విలీనం చేయనున్నట్టు ఐసీఐజీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రపంచ స్పెషాలిటీ రసాయనాల మార్కెట్లన్నింటికీ విస్తరించాలన్న తమ వ్యూహానికి ఈ కొనుగోలు మరింత సహాయకారి అవుతుందని పేర్కొంది. అలాగే వసంత్ కెమికల్స్ కూడా ప్రపంచ మార్కెట్లకు విస్తరించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా కస్టమర్ బేస్‌ను పెంచుకోగలుగుతుందంటున్నారు. 40 సంవత్సరాల చరిత్ర గల వసంత్ కెమికల్స్‌కు హైదరాబాద్‌లోని జీడిమెట్ల, విశాఖపట్టణంలోని అచ్యుతాపురంలలో తయారీ యూనిట్లున్నాయి.

పుణెలో కిమ్స్ ఆస్పత్రి

హైదరాబాద్: పుణె నగరంలో ఆస్పత్రి ఏర్పాటు కోసం 99 సంవత్సరాల కాలానికి స్థలం లీజు, భవనం కొనుగోలు ఒప్పందంపై సంతకాలు చేయనున్నట్టు కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) ప్రకటించింది. 2.59 ఎకరాల విస్తీర్ణంలో, 2.72 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం గల నిర్మిత ప్రాంతంలో అత్యాధునిక సదుపాయాలతో ఈ ఆస్పత్రి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. ఈ ఆస్పత్రి 300 పడకల సామర్థ్యం కలిగి ఉంటుందని, ఈ ప్రాజెక్టుపై రూ.500 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నామని ప్రకటించింది. ముంబై-ఠాణే ప్రాంతంలో ఇదే తొలి ఆస్పత్రి అని, మహారాష్ట్రలో మూడో ఆస్పత్రి అని కిమ్స్ ఆ ప్రకటనలో తెలియచేసింది. నాసిక్‌లో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి నూతన ఆస్పత్రి వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ప్రారంభం కానున్నట్టు కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ బీ భాస్కరరావు తెలిపారు.

సెన్సెక్స్ ర్యాలీకి బ్రేక్

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం లాభాల స్వీకారంతో నష్టాల బారిన పడ్డాయి. సెన్సెక్స్ 195.16 పాయింట్ల నష్టంతో 73,677.13 వద్ద ముగియగా నిఫ్టీ 49.30 పాయింట్ల నష్టంతో 22,356.30 వద్ద క్లోజయింది. దీంతో వరుసగా నాలుగు సెషన్స్ ర్యాలీకి బ్రేక్ పడింది.

ఐపీఓ బాటలో బిగ్ బాస్కెట్

టాటా గ్రూప్ నుంచి మరో కంపెనీ ఐపీఓకు రానుంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే బహుశా వచ్చే ఏడాది ఈ ఐపీఓ ఉంటుందని బిగ్ బాస్కెట్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ హరి మీనన్ చెప్పారు. అయితే దీనిపై తుది నిర్ణయం టాటాలదేనని తెలిపారు. వచ్చే ఆరు లేదా ఎనిమిది నెలల్లో బిగ్ బాస్కెట్ లాభాల బాట పడుతుందన్నారు. ఇటీవల ప్రారంభించిన 'బీబీ వెర్టికల్' లాభాల్లోనే ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం టర్నోవర్ రూ.12,000 కోట్లకు చేరే అవకాశం ఉందని చెప్పారు.

ఆల్‌టైం గరిష్ఠానికి బిట్‌కాయిన్

బిట్‌కాయిన్ సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి చేరుకుంది. కాయిన్ మార్కెట్ క్యాప్ ప్రకారం.. మంగళవారం ప్రారంభ ట్రేడింగ్‌లో ఈ వర్చువల్ కరెన్సీ విలువ తొలిసారిగా 69,000 డాలర్ల మైలురాయికి ఎగువకు చేరుకుంది. అంతేకాదు, రెండేళ్లకు పైగా కాలంలో (2021 నవంబరు) ఈ కరెన్సీ కొత్త ఆల్‌టైం రికార్డును నమోదు చేయడం కూడా ఇదే మొదటిసారి.

భారత మీడియా, వినోద రంగం 2026లో రూ.3 లక్షల కోట్లకు..

ఫిక్కీ-ఈవై సంయుక్త నివేదిక



న్యూఢిల్లీ: గత ఏడాది భారత మీడియా, వినోద రంగం 8.1 శాతం వృద్ధితో రూ.2.32 లక్షల కోట్ల స్థాయికి చేరుకుందని మంగళవారం విడుదలైన ఫిక్కీ-ఈవై సంయుక్త నివేదిక వెల్లడించింది. ఈ ఏడాదిలో ఇండస్ట్రీ 10.2 శాతం వృద్ధితో రూ.2.55 లక్షల కోట్లకు.. 2026లో రూ.3.08 లక్షల కోట్లకు చేరుకోవచ్చని అంచనా వేసింది. అంతేకాదు, ఈ ఏడాదిలో డిజిటల్ మీడియా విభాగం టెలివిజన్ సెగ్మెంట్‌ను అధిగమించి రూ.75,100 కోట్ల స్థాయికి పెరగవచ్చని కూడా నివేదిక పేర్కొంది. మరిన్ని విషయాలు..

- గత ఏడాదిలో రూ.69,600 కోట్ల మార్కెట్ సైజుతో టీవీ అతిపెద్ద విభాగంగా కొనసాగింది. 2024లో టీవీ మార్కెట్ రూ.71,800 కోట్లకు పెరగవచ్చని అంచనా.
- 2023లో రూ.65,400 కోట్ల స్థాయికి చేరుకున్న డిజిటల్ మీడియా విభాగం.. ఈ ఏడాదిలో రూ.75,100 కోట్ల స్థాయికి చేరుకోవచ్చు. అంటే, ఇప్పటివరకు దేశీయ మీడియా, వినోద రంగంలో అతిపెద్ద విభాగంగా కొనసాగుతున్న టెలివిజన్ మార్కెట్ సైజును విఎంచిపోనుంది.
- 2026 నాటికి డిజిటల్ మీడియా విభాగం రూ.95,500 కోట్లకు చేరుకోవచ్చని, 2023-26 మధ్యకాలంలో ఈ విభాగం 13.5 శాతం సీఏజీఆర్‌తో దూసుకెళ్లనుందని అంచనా. కాగా, టీవీ మీడియా 2026లో రూ.76,600 కోట్ల స్థాయికి చేరుకోవచ్చునంటున్నారు. డిజిటల్ మీడియా కంటే ఇది 20 శాతం తక్కువ.
- వచ్చే రెండేళ్లలో డిజిటల్ ప్రకటనల విభాగం 13.5 శాతం సీఏజీఆర్‌తో రూ.84,200 కోట్ల స్థాయికి చేరనుంది. ఇంటర్నెట్ సేవల వ్యాప్తి శరవేగంగా సాగుతున్న నేపథ్యంలో స్మార్ట్ టీవీల విభాగం 50 శాతం వృద్ధి చెందింది.
- బ్రాడ్‌బాండ్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతోంది. ఈ సేవల వినియోగదారులు 90.4 కోట్లకు చేరుకున్నారు. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు అనూహ్యంగా పెరిగిన ఫలితంగా ఇంటర్నెట్ సేవల వినియోగ సగటు కూడా పెరుగుతోంది.
- భారత మీడియా, వినోద రంగం మొత్తం ఆదాయంలో టెలివిజన్, ప్రింట్, సినిమాలు, లైవ్ ఈవెంట్లు, అవుట్ ఆఫ్ హోమ్ (ఓఓహెచ్), మ్యూజిక్, రేడియో వంటి సంప్రదాయ మీడియా వాటా తగ్గుతూ వస్తోంది. 2019లో ఇది 76 శాతంగా ఉండగా.. 2023లో 57 శాతానికి తగ్గింది.
- గేమింగ్, డీ2సీ బ్రాండ్లు ప్రచార ఖర్చులు తగ్గించుకోవడంతో గత ఏడాది టీవీ యాడ్ రెవెన్యూ 6.5 శాతం తగ్గింది.
- భారత ప్రింట్ మీడియా మాత్రం అంతర్జాతీయ ట్రెండ్‌కు భిన్నంగా మెరుగైన పనితీరును కనబరిచింది. గత ఏడాది ప్రింట్ మీడియా యాడ్ రెవెన్యూ 4 శాతం పెరిగింది. సబ్‌స్క్రిప్షన్ ఆదాయంలో 3 శాతం వృద్ధి నమోదైంది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 6-3-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

ప్రొఫెసర్ సాయిబాబా నిర్దోషి

ఆరోపణలను ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయింది

దిగువ కోర్టు తీర్పు న్యాయసూత్రాల మేరకు లేదు

కాబట్టే కొట్టివేస్తున్నాం, యావజ్జీవ శిక్షను రద్దు చేస్తున్నాం

ఈ కేసులో మరో ఐదుగురూ నిర్దోషులే: బాంబే హైకోర్టు

సుప్రీంకోర్టులో సవాల్ చేసిన మహారాష్ట్ర ప్రభుత్వం



10

ఇదీ బీసీల డిక్లరేషన్

1 50 ఏళ్లకే పెన్షన్

బీసీలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ 50 ఏళ్లకే పెన్షన్లు మంజూరు చేస్తాం. అంతే కాదు.. ఆ పెన్షన్ మొత్తం కూడా రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతాం. గతంలో ఎస్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇచ్చాం. ఇప్పుడు దానిని బీసీలకూ వర్తింపజేస్తాం.

2 ప్రత్యేక రక్షణ చట్టం..

సమాజంలో బీసీలకు ఉన్నతమైన గౌరవం దక్కడానికి.. వారిపై సామాజికంగా దాడులు జరగకుండా నివారించేందుకు.. ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తాం. ఎస్సీ, ఎస్టీలపైనేగాక బీసీల్లోని కొన్ని కులాలపైనా దాడులు పెరిగాయి. జగన్ పాలనలో సుమారు 350 మందికి పైగా బీసీలను దారుణంగా హత్య చేశారు. దౌర్జన్యాల నుంచి వారికి సామాజికంగా రక్షణ కల్పించేందుకు ప్రత్యేకంగా పదునైన చట్టం తీసుకొస్తాం. ఇందుకోసం సామాజిక న్యాయ పరిశీలన కమిటీ ఏర్పాటు చేసి వారి హక్కులను కాపాడతాం.

3 సబ్‌ప్లాన్‌కు ఐదేళ్లలో లక్షన్నర కోట్లు..

వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.75 వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించింది. టీడీపీ-జనసేన వచ్చిన తర్వాత ఏడాదికి రూ.30 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.1.50 లక్షల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులు బీసీల కోసమే వినియోగించేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

4 స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్లు..

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను జగన్ ప్రభుత్వం 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించింది. వారికి 16,800 పదవులు దూరం చేసింది. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వచ్చాక మునుపటి 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తాం. అలాగే చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ల కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తాం. అన్ని సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్ అమలు చేస్తాం. తక్కువ జనాభా ఉండి ఎన్నికల్లో పోటీ చేయలేని వర్గాలకు కోఆప్షన్ సభ్యులుగా అవకాశమిస్తాం.





నాగార్జున యూనివర్సిటీ వద్ద మంగళవారం జరిగిన జయహో బీసీ సదస్సుకు హాజరైన జనం.. చంద్రబాబు, పవన్, అచ్చెన్న, పితాని, కొల్లు అభివాదం

- బీసీలను పల్లకీ మోసే బోయీలుగా మాత్రమే కొందరు పరిగణిస్తున్నారు. తాము పల్లకీలో కూర్చుని వారితో మోయిస్తున్నారు. ఈ పరిస్థితిని మేం మారుస్తాం.
- బీసీల కోసం మేం పెట్టిన ప్రతి పథకాన్నీ జగన్ నీరుగార్చారు. ఆయన ఐదేళ్ల పాలనలో రాష్ట్రం ఎంతో నష్టపోయింది. ప్రతి వర్గమూ దెబ్బతింది.

\- చంద్రబాబు

బీసీలే బలం

వారి డీఎన్ఏలోనే టీడీపీ ఉంది: చంద్రబాబు

'జయహో బీసీ' సభకు భారీగా జనం.. 10 అంశాలతో బీసీ డిక్లరేషన్

40 ఏళ్లుగా అక్కున చేర్చుకున్నారు

రుణం తీర్చుకోవడానికే ప్రత్యేక డిక్లరేషన్

బీసీలు లేకపోతే నాగరికత లేదు

చిన్నా పెద్దా అన్ని కులాలకూ నిధులిస్తాం

రాజకీయంగా, ఆర్థికంగా పైకి తెస్తాం

'జయహో బీసీ' సభలో టీడీపీ అధినేత

జగన్ బీసీ నేతల గొంతు కోశారు

కొందరికి టికెట్లు ఎగ్గొట్టారు

మరి మంత్రి పెద్దిరెడ్డి జోలికి వెళ్లరేం?

రాష్ట్రాన్ని నలుగురికి పంచి.. సామాజిక న్యాయమంటూ కబుర్లు

ఈ ఐదేళ్లలో బీసీలకు తీవ్ర నష్టం: బాబు

అమరావతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ వర్గాల డీఎన్ఏలోనే టీడీపీ ఉందని ఆ పార్టీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. '40 ఏళ్లుగా బీసీలు ఈ పార్టీని ఆదరించారు. అక్కున చేర్చుకున్నారు. తమ ఇంటి పార్టీగా భావించారు. జ్యోతిరావు పూలే ఆదర్శాలను టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ అక్షరాలా ఆచరించి చూపించారు. మా ప్రతి అడుగులోనూ బీసీ వర్గాల వారు ఉన్నారు. వారి కోసమే మేమున్నాం' అని పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గం పరిధిలో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఎదురు మైదానంలో మంగళవారం సాయంత్రం భారీ స్థాయిలో

మిగతా 11వ పేజీలో...

బీసీలది శాసించే స్థాయి

వైసీపీ పాలనలో వారి పొట్టగొట్టారు.. బడ్జెట్ కేటాయింపుల్లోనూ మోసం

పథకాల్లో లబ్ధిదారులకు కోత విధింపు.. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తగ్గింపు

శాశ్వత బీసీ కమిషన్ హామీ ఊసేలేదు.. పేరుకే కార్పొరేషన్లు.. నిధుల్లేక నిర్వీర్యం

బీసీ డిక్లరేషన్‌కు మా మద్దతు.. జయహో బీసీ సభలో పవన్ కల్యాణ్

బీసీలకు జగన్ వెన్నుపోటు

టీడీపీ ఆర్థికంగా ఆదుకుంటే వైసీపీ అన్నింటా అణగదొక్కింది

350 మంది బీసీ నేతల హత్య.. 26 వేల మందిపై కేసులు

జయహో బీసీ సభలో నారా లోకేశ్

11



5 ఆర్థికాభివృద్ధి, ఉపాధికి ప్రోత్సాహకాల పునరుద్ధరణ

జనాభా ప్రాతిపదికన బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తాం. దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తాం. స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తాం. ఆదరణ లాంటి పథకాలను జగన్ రద్దు చేశారు. రూ.5 వేల కోట్లతో ఆదరణ పరికరాలు అందిస్తాం. మండల/నియోజకవర్గ కేంద్రాల్లో కామన్ వర్క్ షెడ్స్ ఫెసిలిటేషన్ సెంటర్స్ ఏర్పాటు చేస్తాం. జగన్ రద్దు చేసిన పారిశ్రామిక ప్రోత్సాహకాలు పునరుద్ధరిస్తాం.

6

చట్టబద్ధంగా కులగణన

8

శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తాం

7

రూ.10 లక్షలతో చంద్రన్న బీమా పునరుద్ధరణ. పెళ్లి కానుక రూ.లక్షకు పెంపు

9 విద్యా పథకాల పునరుద్ధరణ

టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వస్తే విద్యా పథకాలన్నీ మళ్లీ అమలు చేస్తాం. నియోజకవర్గాల్లోని రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తాం. షరతులు లేకుండా విదేశీ విద్య అమలు చేస్తాం. పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరిస్తాం. స్టడీ సర్కిల్, విద్యోన్నతి పథకాలు పునఃప్రారంభిస్తాం.

10

బీసీలకు ప్రత్యేక భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను ఏడాదిలో పూర్తి చేస్తాం

విశాఖకు 'ఫినిషింగ్' టచ్!

ఎన్నికల ముందు జగన్ 'విజన్' డ్రామా

పారిశ్రామికవేత్తలకూ చెవిలో పూలు

ఐకానిక్ నిర్మాణాలంటూ కొత్త పాట

'విశాఖలో కాపురం' మళ్లీ వాయిదా

అమరావతిలో విపక్షాల భూములున్నాయట

మరి విశాఖలో వైసీపీ నేతల దందా మాటేమిటో!



విశాఖలో ఐకానిక్ నిర్మాణాల గ్రాఫిక్

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

జనం చెవిలో ఎల్లకాలం పూలు పెడుతూనే ఉండొచ్చని... ఉత్తరాంధ్ర ప్రజలను మరింత ఈజీగా మభ్యపెట్టవచ్చని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బలంగా నమ్ముతున్నట్లుంది! 'విశాఖ' చుట్టూ ఆయన అల్లిబిల్లి కథలు అల్లుతూనే ఉన్నారు. మరో వారం పదిరోజుల్లో ఎన్నికల షెడ్యూలు వస్తున్న సమయంలో... 'విజన్ విశాఖ' అంటూ కనికట్టు చేశారు. 'ఇక్కడ అన్నీ ఉన్నాయి. ఫినిషింగ్ టచ్ ఇస్తే చాలు' అంటూ ముద్దుముద్దుగా చెప్పారు. భూములు కొల్లగొట్టి, రుషికొండకు గుండు కొట్టి, పరిశ్రమలను వెళ్లగొట్టి, పెట్టుబడిదారులను బెదరగొట్టిన ఆయన ఎప్పుడో విశాఖను 'ఫినిష్' చేశారు. ఇప్పుడు ఎన్నికల ముందు మళ్లీ 'టచ్' చేస్తున్నారు. మంగళవారం విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో

మిగతా 12వ పేజీలో...

పరీక్షలున్నాయి.. బయటికి రావొద్దు మామా!

12

సీఎం పర్యటనలతో ఇంటర్ విద్యార్థులకు చుక్కలు

సీఎం కోసం ట్రాఫిక్ జామ్‌లు

సమయానికి చేరుకోలేక విద్యార్థుల పాట్లు

నేడు ప్రకాశం, 7న ఇడుపులపాయ



మంగళవారం అనంతపురం జిల్లా రాయదుర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గ్రామ వలంటీర్లు

వలంటీర్లకు జగన్ మరో బిస్కెట్

రేషన్ వాహనాల పక్కన నిలబడినందుకు నెలకు 500 నజరానా

ఎన్నికల్లో వారిని వాడుకునేందుకు అడ్డదారులు

పీకల్లోతు అప్పుల్లో పౌరసరఫరాల కార్పొరేషన్

దానిపై ఇప్పుడు 12 కోట్లకుపైగా భారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2.55 లక్షలమంది గ్రామ, వార్డు వలంటీర్లే నాకున్న బలమైన సైన్యం. మిమ్మల్ని హీరోలను చేసే బాధ్యత నాది. ఎన్నికల్లో వైసీపీకి మద్దతుగా పనిచేయండి' అంటూ బహిరంగంగానే పిలుపునిస్తున్న ముఖ్యమంత్రి జగన్.. ఆ వలంటీర్లకు మరో బిస్కెట్ విసిరారు. రేషన్ సరుకులను ఇంటింటికీ

మిగతా 12వ పేజీలో...

తప్పతాగి.. కొంగుపట్టి లాగి..

దళిత మహిళపై దాడి

12

ఆదోనిలో వైసీపీ నాయకుడి వీరంగం

రాడ్‌తో కొట్టడంతో తలకు బలమైన గాయం

అడ్డొచ్చిన ఆమె కుమారుడిపైనా దౌర్జన్యం



కడప ఎంపీ సీటుకు వివేకా సతీమణి!

సౌభాగ్యమ్మ పేరును పరిశీలిస్తున్న టీడీపీ అధిష్ఠానం?

11

ఎన్నికల అంశంగా మారనున్న వివేకా దారుణ హత్య

ప్రజాకోర్టులోనైనా నిందితులకు శిక్ష పడాలని సునీత ఆకాంక్ష

ఈసారి ఎన్నికల్లో జగన్‌కు ఓటు వేయొద్దని ఇప్పటికే విజ్ఞప్తి



గొడ్డలి నా చేతిలో కాదు..

జగన్, అవినాశ్ చేతుల్లో పెట్టాలి

మధ్యలో భారతి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి ఫొటోలు పెట్టాలి

జగన్ మీడియాలో అవాస్తవాలతో తప్పుడు కథనం రాశారు

ఎంపీ టికెట్ కోసమే వివేకా హత్య జరిగింది

8

చేసిన తప్పునకు ప్రాయశ్చిత్తంగా అప్రూవర్‌గా మారా

జైలులో ఉన్నప్పుడు చైతన్యరెడ్డి బెదిరించారు.. ప్రలోభపెట్టారు

అక్కడి సీసీ ఫుటేజీ బయటకు వచ్చేవరకూ పోరాడతా: దస్తగిరి


టీడీపీలోకి గుమ్మనూరు

'జయహో బీసీ' సభలో చంద్రబాబు సమక్షంలో చేరిక

అంతకుముందే మంత్రి పదవికి, వైసీపీకీ రాజీనామా

ఆమోదించకుండా బర్తరఫ్ వేటు వేసిన జగన్

8



చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకొన్న గుమ్మనూరు జయరాం

'కొల్లే' గొట్టేస్తున్నాడు

నియోజకవర్గంలో ఎందుకూ పనికిరాని చెరువు భూములు తక్కువకు కొని జగనన్న కాలనీల కోసం రెట్టింపు రేటుకు ప్రభుత్వానికి అంటగట్టారు. అక్కడితో అయిపోలేదు. ఆ చెరువు భూములను పూడ్చడానికి అవసరమైన మట్టి పనులూ సదరు నేతే తన చేతుల్లోకి తీసుకున్నారు. పూడిక పనుల కోసం ప్రభుత్వం రూ.40 లక్షలు కేటాయించింది. బుసకను (మట్టి) తోలే కాంట్రాక్టును వైసీపీకి చెందిన ఒక నాయకుడికి రూ.10 లక్షలకు ఎమ్మెల్యే కుమారుడు అప్పగించగా, మరో బుసక తోలకందారుడికి రూ.7 లక్షలకు అతడు సబ్ కాంట్రాక్టుకు ఇచ్చినట్టు సమాచారం. రోజుకు 200 టిప్పర్ల బుసకను తరలించారు. ఒక్కో ట్రిప్పునకు రూ.2 వేల చొప్పున తండ్రీకొడుకు దండుకున్నారు.

కొల్లేరు భూముల్లో కొబ్బరికాయ కొట్టి మరీ అక్రమ తవ్వకాలు ప్రారంభించిన ఘనుడు

ఏలూరు జిల్లాలోని ఆ అడ్డాలో ప్రతి పనికీ కప్పం

రైతులవి అక్కడ నయా బానిస బతుకులు

తమ చెరువుల్లో మట్టి తీసుకోడానికి లేదు

జగనన్న కాలనీలకోసం వాటినుంచే మట్టి

చెరువు భూములను కాలనీ కోసం కొనిపించారు

చౌకగా వాటిని కొని రెట్టింపు ధరకు విక్రయం

అక్కడ పూడిక పనుల్లో భారీగా హస్త లాఘవం

ఎడా పెడా రూ.200 కోట్లకు పైగా అక్రమార్జన!

చట్టాలు, కోర్టుల కంట్లో 'దూలం' పెట్టి సొంత జాగీరులా నియోజకవర్గం



అమ్మో ఎమ్మెల్యే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

అభివృద్ధి మాటున అక్రమాస్త్రులు పోగుపడుతున్నాయి. జగనన్న కాలనీల్లో ధరల మతలబులు, పూడిక పనుల్లో పైసా వసూళ్లు, కొల్లేరు తవ్వకాల్లో తిలా పాపం తలా పిడికెడు అన్న చందాన అడుగడుగునా అవినీతి తాండవమాడుతోంది. ఎవరు చేస్తున్నారు. ఎక్కడ, ఏమిటా కథ అంటారా? అలా అయితే ఏలూరు జిల్లాలోని ఆ అధికార పార్టీ ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని సందర్శించాల్సిందే. ఆయన నియోజకవర్గంలో రైతులకు తమ చేపల చెరువులోని బుసకను విక్రయించుకునే స్వేచ్ఛ కూడా లేదు. కొల్లేరు భూముల్లో సాగును ప్రభుత్వం రద్దు చేసిందని తెలిసినా, కొబ్బరికాయ

మిగతా 12వ పేజీలో...



వర్షాలకు కొట్టుకుపోయిన ఫీడర్ కాలువ (ఫైల్)

వెలిగొండ కాదు..

ఖాళీ కుండ

నీళ్లు లేవు.. ప్రాజెక్టు పనులూ పూర్తి కాలేదు

అయినా ప్రారంభోత్సవానికి సిద్ధమైన జగన్

నేడు పౌరంగాలు జాతికి అంకితం పేరిట కార్యక్రమం

ఎన్నికల లబ్ధే లక్ష్యం.. కదలిక లేని పునరావాసం

గత ఐదేళ్లలో జగన్ ఖర్చు చేసింది 978 కోట్లే

రూ.1,450 కోట్ల పనులు చేసిన టీడీపీ సర్కారు

ప్రాజెక్టు పూర్తికి మరో నాలుగు వేల కోట్లు

7

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బ్యాంకు విప్పని గుట్టు

రాజకీయ పార్టీలకు ఎన్నికల బాండ్ల రూపంలో గుప్తనిధులను సమకూర్చిపెట్టే విధానానికి ఏకైక వ్యవహర్తగా, కర్తగా ఉన్న స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సోమవారం సుప్రీంకోర్టుకు పెద్ద షాక్ ఇచ్చింది. ఎన్నికల బాండ్లు రాజ్యాంగవ్యతిరేకం అంటూ ఫిబ్రవరి 14న ఆ విధానాన్ని కొట్టివేసి, వాటి అమ్మకాలను నిలిపివేసిన సుప్రీంకోర్టు, గత నాలుగేళ్ళలో అమ్మినబాండ్లు, వాటిని కొన్నవారి సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి మార్చి 6వ తేదీలోగా బ్యాంక్ అందించాలనీ, ఈసీ ఆ వివరాలను మార్చి 13లోగా బహిర్గతపరచాలనీ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ తీర్పు వెలువడిన మూడు వారాలకు, గడువుకు కేవలం రెండు రోజుల ముందు, ఈ ప్రక్రియ అత్యంత సంక్లిష్టమైనదనీ జూన్ 30 వరకూ గడువు పెంచాలనీ సుప్రీంకోర్టుకు ఎస్‌బీఐ విన్నవించుకుంది. సార్వత్రిక ఎన్నికల్లోగా ఈ బాండ్ల సంగతి తేల్చి, గోప్యతను ఛేదించి, సమస్త వివరాలను ప్రజలకు అందించాలని సుప్రీంకోర్టు సంకల్పిస్తే, ఎస్‌బీఐ ఇప్పుడు ఆ సదాశయాన్ని వమ్ముచేయడానికి ప్రయత్నిస్తున్నది. కోర్టు ఆదేశాలకు కట్టుబడి ఉన్నానని అంటూనే ఎన్నికలు ముగిసేవరకూ రహస్యాన్ని దాచాలనుకుంటోంది.

సుప్రీం తీర్పును వమ్ముచేయకండి, అడ్డదారులు తొక్కకండి అని విపక్షపార్టీ నేతలతో సహా న్యాయకోవిదులు, మేధావులు అప్పట్లోనే ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. మోదీ ప్రభుత్వం ఆర్డినెన్సుతో తీర్పును వమ్ముచేయవచ్చునని కొందరు అనుమానించారు. ఇప్పుడు బ్యాంకును అడ్డుపెట్టుకొని మోదీ ప్రభుత్వం కొత్త కుట్రలకు తెరదీసిందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. రోజూ లక్షలాది లావాదేవీలు నిర్వహించే భారతదేశపు అతిపెద్ద బ్యాంకుకు 22వేల ఎన్నికల బాండ్ల వివరాలను కోర్టుకు ఇవ్వడానికి నిజంగానే నాలుగున్నర నెలలు అవసరమా? దేశాన్ని డిజిటల్ ఇండియాగా మార్చేసిన తరువాత కూడా ఈ కాస్తంత సమాచారానికే నెలలకొద్దీ సమయం అడుగుతూ ఎస్‌బీఐ డైరెక్టర్లు ప్రధానిని అవమానిస్తున్నారని, వారిని శిక్షించాలని శివసేన నాయకుడు సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలో కాస్తంత వెటకారం ఉన్నా, సరైనదే. ఎన్నికల బాండ్ల విధానంలోనే తీవ్రమైన సంక్లిష్టత, గోప్యత, దాతలు వివరాలు దాచడం అంతర్లీనమైన విలువలు కనుక, బ్యాంకు తదనుగుణంగానే వాటిని కంప్యూటర్‌లో దాచకుండా, పాలకులకు ప్రీతిపాత్రమైన సీల్డ్ కవర్ మార్గాన్నే అనుసరించింది. బాండు కొన్నవారి వివరాలు ఒక సీల్డు కవరులో, రాజకీయపార్టీలు నగదుగా మార్చుకుంటున్న సందర్భంలో ఆ వ్యవహారం వివరాలు మరో సీల్డుకవర్‌లో వేర్వేరుగా ఉంచి, వాటిని ఒకదానితో ఒకటి సరిపోల్చి అతుకువేయడానికి తనకు మరింత సమయం కావాలని అడుగుతోంది. బాండ్ల సంఖ్య వంటి అతికొన్ని వివరాలు డిజిటల్ రూపంలో, కొనుగోలుదారు పేరు, కెవైసీ ఇత్యాది కీలకమైన వివరాలు ఫిజికల్‌గా రికార్డు అయివున్నందున పనిచక్కబెట్టడం సులభం కాదని అంటోంది. దశాబ్దాల క్రితమే బ్యాంకులు రాతకోతలు వదిలేసి, కంప్యూటర్ల వాడకం ఆరంభిస్తే, డిజిటల్ లావాదేవీల్లో అగ్రస్థానంలో ఉన్న ఓ అతిపెద్ద బ్యాంకు ఎన్నికల బాండ్ల లావాదేవీలకు మాత్రం కాగితాలనే వాడటం ఆశ్చర్యం. దేశంలో ఒకచోట ఒక కార్పొరేట్ కంపెనీ ఈ బాండ్లు కొంటే, రాజకీయ పార్టీలు వేరొకచోట నగదుగా మార్చుకుంటే, వాటిని అమ్మిన, స్వీకరించిన బ్రాంచ్‌లన్నీ ఆ వివరాలన్నీ కాగితాలమీద రాయడం, సీల్డు కవర్లలో దాచడం విచిత్రమైన విన్యాసం. తద్వారా, ఒక దాత పదికోట్ల రూపాయల బాండ్లు కొంటే, అతడి చేతికి కోటి విలువైన బాండ్లు పది ఇస్తే పది కవర్లు తయారవుతాయి. వాటిని వేర్వేరు బ్రాంచ్‌లలో వేర్వేరు పార్టీలు నగదుగా మార్చుకున్నప్పుడు మరిన్ని సీల్డు కవర్లు తయారవుతాయి. నాలుగేళ్ళలో అమ్మిన బాండ్ల సంఖ్య 22వేలు కావచ్చుకానీ, కంప్యూటర్‌లను వాడకుండా, సీల్డు కవర్లను మాత్రం అధికంగా తయారుచేసి బ్యాంకు పాలకుల ఆశయాన్ని చక్కగా నెరవేర్చింది.

ఇక, దేశవ్యాప్తంగా 29 బ్రాంచ్‌లలో బాండ్ల లావాదేవీలు ఎన్ని జరిగినా, సీల్డు కవర్లన్నీ ముంబైలోని ప్రధాన కార్యాలయానికే చేరినందున వాటిని సరిపోల్చడానికీ, జతచేయడానికీ నిజంగానే అన్ని నెలలు పడుతుందా? దాతల, స్వీకర్తల వివరాలను గుదిగుచ్చి, రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూండమని 2019లోనే సుప్రీంకోర్టు చెప్పిన నేపథ్యంలో, బ్యాంకు ఆ ఆదేశాలను ఉల్లంఘించి అయినా ఉండాలి, ఇప్పుడు కోర్టుకు అబద్ధమైనా చెప్పివుండాలి. బ్యాంకు అభ్యర్థన వెనుక రాజకీయ పెద్దల ప్రమేయం ఉన్నదా లేదా అన్నది అనవసరం. కానీ, తన ఆదేశాన్ని బేఖాతరుచేసి, సదాశయాన్ని వమ్ము చేయడానికి ప్రయత్నిస్తున్న బ్యాంకును ఓ నాలుగు చీవాట్లు పెట్టి, చివరకు దాని ఒత్తిడికే లొంగిపోవడం కాక, సుప్రీంకోర్టు తీవ్రంగా, భిన్నంగా వ్యవహరించడం అవసరం.

సుప్రీం తీర్పుతో వ్యవస్థలు మారేనా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ఈ దేశంలో వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కలిగించడం గురించి ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడడం చెప్పుకోదగ్గ విషయమే. చట్టసభల్లో ఓటు వేసేందుకు, ప్రసంగించేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు ముడుపులు తీసుకుంటే వారిపై అవినీతి నిరోధక చట్టం క్రింద చర్యలు తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు సోమవారం వెలువరించిన తీర్పు వెలువడిన క్షణాల్లోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం ప్రకటించారు. ఈ తీర్పు రాజకీయాలను అవినీతి నుంచి ప్రక్షాళనం చేసేందుకు, వ్యవస్థలపై ప్రజలకు ప్రగాఢమైన నమ్మకాన్ని కలుగచేసేందుకు దారితీస్తుందని మోదీ అన్నారు.

చట్టసభల్లో ఓటింగ్ చేసేందుకు సభ్యులు ముడుపులు తీసుకునే విషయంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వెనుక మూడు దశాబ్దాల చరిత్ర ఉన్నది. 1993 జూలైలో పీవీ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు వామపక్షాలకు బీజేపీ కూడా మద్దతు నిచ్చింది. తమ మధ్య సైద్ధాంతిక విభేదాలు వారి లక్ష్యానికి అడ్డు రాలేదు. ప్రధానమంత్రి కావాలన్న ఆకాంక్షతో ఉన్న కాంగ్రెస్ నేత అర్జున్ సింగ్‌తో పాటు పలువురు పీవీ ప్రభుత్వం పడిపోయేందుకు తెరవెనుక తమ వంతు ప్రయత్నాలు చేశారు. అంతర్గత, బహిర్గత ప్రత్యర్థుల మధ్య చివరకు అవిశ్వాస తీర్మానం వీగిపోయి పీవీ ప్రభుత్వం 14 ఓట్లతో గట్టెక్కింది. జనతాదళ్ నుంచి రాంలఖన్ యాదవ్ నేతృత్వంలో విడిపోయిన ఏడుగురు సభ్యులతో పాటు నలుగురు జేఎంఎం సభ్యులు మద్దతు నిచ్చారు. ములాయం వర్గానికి చెందిన ముగ్గురు ఎంపీలు, బిఎస్‌పికి చెందిన ముగ్గురు ఎంపీలు గైరుహాజరయ్యారు. జనతాదళ్ (ఏ) నేత అజిత్‌సింగ్ ఓటింగ్‌లో పాల్గొనలేదు. అజిత్‌సింగ్‌కు ఆ తర్వాత మంత్రిపదవి దక్కింది. నిజానికి జేఎంఎం సభ్యులు ఓటు వేయకపోయినా పీవీ ప్రభుత్వం గట్టెక్కేది. ఎందుకంటే, ములాయంసింగ్ యాదవ్, లాలూప్రసాద్ యాదవ్‌లతో పాటు కాన్షీరామ్ కూడా పీవీకి మద్దతు నిచ్చారు. ఈ అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చకు పీవీ జవాబిస్తూ జార్ఖండ్ ప్రాంతానికి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పిస్తామని హామీ ఇవ్వడంతో జేఎంఎం సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించారు. పీవీ హామీతోనే వారు సరిపెట్టుకుంటే బాగుండేది కాని ప్రభుత్వాన్ని కాపాడాలనుకున్న పి.వి. శ్రేయోభిలాషుల నుంచి ముడుపులను కూడా రాబట్టినట్లు ప్రచారం జరిగింది. 'వారికి ఒక్క పైసా కూడా ఇవ్వకండి అని ప్రధానమంత్రి చెప్పినప్పటికీ మా భయం మాది' అని పీవీ శ్రేయోభిలాషి ఒకరు వెల్లడించారు. పీవీ మూడు అవిశ్వాస తీర్మానాల నుంచి గట్టెక్కారు కాని ఏ సందర్భంలోనూ ఎంపీలను ప్రలోభపెట్టినట్లు ఆరోపణలు రాలేదు.

జేఎంఎం ఎంపీలు పీవీ సర్కార్‌కు మద్దతు ప్రకటించిన తర్వాత దాదాపు మూడేళ్ల పాటు ఈ విషయాన్ని పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నికలు సమీపిస్తుండగా, రాష్ట్రీయ ముక్తి మోర్చా అనే సంస్థకు చెందిన రవీంద్రకుమార్ పిటిషన్ దాఖలు చేయడం, పీవీ 1996 మే 24న గద్దె దిగగానే జేఎంఎం కేసులో ఎఫ్ఐఆర్ దాఖలు చేయమని సీబీఐని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశించిన అయిదు నెలల్లోనే సీబీఐ ఛార్జిషీటు దాఖలు చేసి పీవీని ఏ–వన్ నిందితుడుగా చేర్చడం, బీజేపీలో చేరిన జేఎంఎం సభ్యుడు శైలేంద్ర మహతో తనకు పీవీ ముడుపులు చెల్లించారని ఆరోపించి అప్రూవర్‌గా మారడం వంటి పరిణామాలు వెనువెంటనే జరిగాయి. దర్యాప్తు పూర్తిగా శైలేంద్ర మహతో ప్రకటనపై ఆధారపడి జరిగినట్లు, ఆయన రకరకాల ప్రకటనలు చేసినట్లు ఆనాటి ఉదంతాలు అధ్యయనం చేసిన వారికి అర్థమవుతుంది. ఇదే అభిప్రాయంతో అప్పటి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆరఎస్ సోంధీ, పీవీని నిర్దోషిగా ప్రకటించారు. పీవీ నేరుగా ఎంపీలకు ముడుపులు ఇచ్చినట్లు ఎక్కడా రుజువులు లేవని ఆయన తన తీర్పులో ప్రకటించారు. హర్షద్ మెహతా అనే స్టాక్ బ్రోకర్ పీవీకి రూ. 1 కోటి చెల్లించినందువల్ల సీబీఐతో విచారణ జరిపించాలని జనహిత్ అనే సంస్థ సుప్రీంకోర్టుకు వెళ్లినప్పుడు కూడా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్య ఆ పిటిషన్‌ను కొట్టివేశారు. సుప్రీంకోర్టును రాజకీయాలకు వేదిక చేయకూడదని ఆయన స్పష్టం చేశారు.

పీవీపై వచ్చిన అనేక ఆరోపణలు, కేసుల నుంచి ఆయన నిర్దోషిగా బయటపడ్డప్పటికీ, వాటి వెనుక రాజకీయ కుతంత్రాలు ఎన్ని ఉన్నప్పటికీ, జేఎంఎం కేసులో 1998లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజకీయ అవినీతికి సంబంధించి న్యాయవ్యవస్థ తీరుతెన్నులనే ప్రశ్నార్థకం చేసిందని చెప్పక తప్పదు. అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసిన ఎంపీలపై వచ్చిన అవినీతి నేరారోపణలపై రాజ్యాంగంలోని అధికరణ 105(2) ప్రకారం చర్యలు తీసుకోవడానికి వీలు లేదని సుప్రీంకోర్టు భావించింది. సభ్యులు పార్లమెంట్‌లో చేసిన పనులన్నీ ఈ అధికరణ క్రింద వస్తాయని ప్రముఖ న్యాయవాది పావని పరమేశ్వరరావు చేసిన వాదనను సుప్రీం మెజారిటీ బెంచ్ ఆమోదించింది. ఎంపీలు స్వేచ్ఛగా వ్యవహరించేందుకు వీలుగా రూపొందించిన ఈ అధికరణను పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలకూ, ఓటింగ్‌కూ వర్తింపచేయవచ్చు కాని ముడుపులు స్వీకరించినా, ఘోరమైన నేరాలకు పాల్పడినా వర్తింపచేయడం సరైనదేనా అన్న ప్రశ్నలకు జవాబు లేకపోవడంతో నాడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి సవాలుగా నిలిచింది. దాదాపు 26 సంవత్సరాల తర్వాత సుప్రీంకోర్టు మళ్లీ తన తీర్పును తానే తిరగరాయడం చరిత్రాత్మకం.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఇదే ఉద్దేశంతో సుప్రీం తాజా తీర్పును స్వాగతించి ఉంటారు. కాని సరిగ్గా 20 రోజుల క్రితం ఇదే సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్ల పేరుతో రాజకీయ పార్టీలు రహస్య విరాళాలు సేకరించడం రాజ్యాంగ వ్యతిరేకమని, అవి కూడా కార్పొరేట్ సంస్థల నుంచి ముడుపులు స్వీకరించడంతో సమానమని తీర్పు నిచ్చినప్పుడు మాత్రం ప్రధానమంత్రి ఏ మాత్రం స్పందించలేదు. బహుశా ఎన్నికల బాండ్ల విషయంలో ఉన్నత న్యాయస్థానం తీర్పుతో ఆయన ఏకీభవించడం లేదని అనుకోవాల్సి వస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశించినట్లు ఎన్నికల బాండ్ల వివరాలు చెప్పేందుకు కూడా స్టేట్ బ్యాంక్ ఎన్నికలు పూర్తయ్యే వరకూ సమయం అడగడం ప్రభుత్వ పారదర్శకతపై అనేక సందేహాలకు తావునిస్తోంది.

చట్టసభల్లో ముడుపులు తీసుకోవడం తప్పు అని సుప్రీంకోర్టు ప్రకటించింది కాని చట్టసభల బయట ఏ విధంగా ముడుపులు తీసుకున్నా తప్పేమి కాదని ఈ దేశంలో నేతలు భావిస్తున్నట్లు కనపడుతోంది. సుప్రీంకోర్టు ఎన్ని తీర్పులు ఇచ్చినా ఈ దేశంలో ప్రజాప్రతినిధులు తమను తాము అమ్ముకోవడం, వారిని కొనుగోలు చేయడం మాత్రం ఆగిపోవడంలేదు. ఇటీవల హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటకల్లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో పలువురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి వేరే పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించారు. 'ఎన్ని ఫిరాయింపు వ్యతిరేక చట్టాలు చేసినా ఎమ్మెల్యేలు ఇలా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడడం ప్రజాస్వామ్య రాజకీయాల్లో చీకటి కోణాన్ని చూపిస్తోంది. రాజకీయాల్లో నైతికత అనేది ఉంటే క్రాస్ ఓటింగ్ అనేదే జరగదు' అని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఖురేషీ వ్యాఖ్యానించారు. రాజ్యసభలో ఏదో విధంగా మెజారిటీ సంపాదించేందుకు, హిమాచల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరం చేసేందుకు, లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ ఈ క్రాస్ ఓటింగ్‌కు పకడ్బందీగా వ్యూహరచన చేసి ఉండవచ్చు. కాని ఏ ప్రలోభాలు లేకుండా, ఏ ముడుపులు చెల్లించకుండా ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారా అన్న ప్రశ్న ప్రతి ఒక్కరి మనసుల్లో తలెత్తుతుంది. పీవీ నరసింహారావు సమయంలో నలుగురు జేఎంఎం ఎంపీలు ఓటు వేసినందుకు సీబీఐ విచారణకు ఆదేశించినట్లే, ఈ క్రాస్ ఓటింగ్‌పై కోర్టులు కానీ, ప్రభుత్వం కానీ సీబీఐ విచారణకు ఆదేశించగలవా? ఎమ్మెల్యేలు ముడుపులు స్వీకరించలేదని కోర్టు ద్వారా నిర్ధారించగలదా?

రాజ్యసభ ఎన్నికల విషయంలోనే కాదు, గత పది సంవత్సరాలుగా 'ఆపరేషన్ లోటస్' వ్యూహంలో భాగంగా ఎమ్మెల్యేలు ఏదో విధంగా పార్టీ మారుతూనే ఉన్నారు. 2018లో కర్ణాటకలో కాంగ్రెస్–జనతాదళ్ (ఎస్) ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే 17 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. 2019–2022 మధ్య గోవాలో 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కమల తీర్థం పుచ్చుకున్నారు. 2020లో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌లో అత్యంత విధేయుడని అనుకున్న జ్యోతిరాదిత్య సింధియా ఉన్నట్లుండి డిల్లీ వెళ్లి తన మద్దతుదారులైన 22 మంది ఎమ్మెల్యేలతో సహా బీజేపీలో చేరారు. దీనివల్ల కమల్‌నాథ్ ప్రభుత్వం కుప్పకూలిపోయింది. మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సీపీ పార్టీలను చీల్చడం, ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడ బీజేపీ ప్రభుత్వమే అధికారంలో ఉండాలని డిల్లీ పెద్దలు భావించడం రాజకీయాల్లో నైతికతను ప్రశ్నార్థకం చేసింది. పార్టీలు ఫిరాయించిన వారికి రాష్ట్రాల్లోనూ, కేంద్రంలోనూ మంత్రిపదవులు, ముఖ్యమంత్రి పదవులు, రాజ్యసభ సభ్యత్వాలు లభించాయి. ఇక ఎంతమేరకు నిధులు అక్రమంగా ప్రవహించాయో చెప్పలేము. పై పెచ్చు ఈ అనైతిక కార్యక్రమానికి తోడుగా కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలు నిర్వహిస్తున్న పాత్ర కూడా విస్మరించలేనిది. మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలు మనుగడ సాధించడం కష్టమనే ప్రచారం కూడా జరిగేందుకు గత పదేళ్లలో జరిగిన పరిణామాలే కారణమవుతున్నాయి. వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం ఏర్పడి రాజకీయాలు ప్రక్షాళన కావాలంటే సుప్రీంకోర్టు తీర్పులు మాత్రమే సరిపోవు. నాయకులకు నిజాయితీ ఉండాలి.



> గత పదేళ్లుగా 'ఆపరేషన్ లోటస్' వ్యూహంలో భాగంగా ఎమ్మెల్యేలు ఏదో విధంగా పార్టీ మారుతూనే ఉన్నారు. పార్టీలు ఫిరాయించిన వారికి రాష్ట్రాల్లోనూ, కేంద్రంలోనూ మంత్రిపదవులు, ముఖ్యమంత్రి పదవులు, రాజ్యసభ సభ్యత్వాలు లభించాయి. నిధులు ఎంతమేరకు అక్రమంగా ప్రవహించాయో చెప్పలేము. ఈ అనైతిక కార్యక్రమానికి తోడుగా కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలు నిర్వహిస్తున్న పాత్ర విస్మరించలేనిది. వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం ఏర్పడి రాజకీయాల్లు ప్రక్షాళన కావాలంటే సుప్రీంకోర్టు తీర్పులు మాత్రమే సరిపోవు. నాయకులకు నిజాయితీ ఉండాలి.

(ఆంధ్రజ్యోతి డిల్లీ ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్రంలోని అతి పెద్ద నియోజకవర్గమైన మంథనిలో ల్యాండ్ లైన్‌తో సహా ఏ విధమైన నవీన సమాచార వ్యవస్థ లేని ఆ కాలంలో ఉత్తరాల ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకుంటూ వాటి పరిష్కారానికై బస్సులో జిల్లా కేంద్రం కరీంనగర్, రాజధాని హైదరాబాద్‌కు రాక పోకలు సాగించిన శ్రీపాదరావు తరహా నాయకులను ఈ కాలంలో ఊహించగలమా?

ప్రజల మనిషి శ్రీపాదరావు

గల్ఫ్ లేఖ

సమాజ హితమే ధ్యేయంగా, ప్రజల సేవలో నిస్వార్థంగా నిరంతరం నిమగ్నమయ్యే నాయకుల తరం దాదాపుగా అంతరించిపోతోంది. వ్యాపార ప్రయోజనాల కోసమే రాజకీయాలలోకి వచ్చి చట్టసభలలో తిష్టవేసేవారు గణనీయంగా పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో నిన్నటి నాయకోత్తములను స్మరించుకోవడాన్ని సైతం సమాజం విస్మరిస్తోంది. కాల వైపరీత్యం!

అడవులు, నదులు, వాగులు, వంకల మధ్య కాలినడకన లేదా ఎండ్ల బండ్లపై గ్రామ గ్రామానికి వెళుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించే నాయకులు ఉండే వారంటే ఇప్పటి తరానికి ఒకింత ఆశ్చర్యం కూడ కలుగవచ్చు. గోదావరి, ప్రాణహిత, మానేరు నదులు పారుతూ అడవులు విస్తారంగా ఉన్న మంథని ఒక విలక్షణ ప్రాంతం.

వేద పండితులకు నెలవుగా, వేద ఘోషల మంత్రపురిగా పేరొందిన మంథనికి తెలంగాణ తొలితరం విద్యావేత్త ముద్దు రామకృష్ణయ్య (1907–85), తొలి తెలుగు ప్రధాని పీవీ నరసింహారావు దాకా పలువురు మహానుభావులను తెలుగు నేలకు, విశాల భారతదేశానికి అందించిన సుప్రసిద్ధ చరిత్ర ఉన్నది. ఆ జన హితుల, నాయక శ్రేష్ఠుల కోవలోనివాడే దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు (1935–99). గ్రామపంచాయితి స్థాయిలో రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టి శాసనసభ స్పీకర్ పదవి నిర్వహించి, ఒక దశలో ముఖ్యమంత్రి పదవికీ పోటీపడిన విలక్షణ నేత ఆయన.

తెలంగాణ రాష్ట్రంలో భౌగోళిక విస్తీర్ణంలో అతి పెద్ద నియోజకవర్గమైన మంథనిలో ల్యాండ్‌లైన్‌తో సహా ఏ విధమైన నవీన సమాచార మార్పిడి వ్యవస్థ లేని ఆ కాలంలో ఉత్తరాల ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకుంటూ వాటి పరిష్కారానికై బస్సులో జిల్లా కేంద్రం కరీంనగర్, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రాకపోకలు సాగించిన శ్రీపాదరావు తరహా నాయకులను ఈ కాలంలో ఊహించగలమా? సొంత నియోజకవర్గంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు చివరి గ్రామాలకు సాగు నీరు అందడం లేదన్న ఫిర్యాదుతో ఆయన నాలుగు గంటల బస్సు ప్రయాణం చేసి జగిత్యాలకు వచ్చి ప్రాజెక్టు అధికారుల వద్దకు వెళ్లేవారు. ఎలాంటి వ్యక్తిగత భద్రత (ఆ కాలంలో శాసనసభ్యులు ఎవరు కూడ గన్‌మాన్లను కోరుకునేవారు కాదు) లేకుండా అటవీ గ్రామాలలో తిరుగుతూ అందరికీ అందుబాటులో ఉండేవారు.



మంథని అడవులలో పని చేయడాన్ని ఒక శిక్షగా ప్రభుత్వ ఉద్యోగులు భావించే వారు. సాధారణంగా సస్పెన్షన్‌కు బదులుగా మంథని, మహాదేవపూర్ తాలుకాలకు ప్రభుత్వ ఉద్యోగులను బదిలీ చేయడం పరిపాటిగా ఉండేది. ఇటువంటి ప్రతికూల పరిస్థితులలో తన నియోజకవర్గంలో విధులు నిర్వహించడానికి శ్రీపాదరావు ప్రభుత్వ ఉద్యోగులను ఒప్పించుకుని తీసుకువచ్చేవారు.

మహారాష్ట్ర సీనియర్ నాయకుడు, లోక్‌సభ స్పీకర్, మాజీ కేంద్ర హోం మంత్రి అయిన శివరాజ్ పాటిల్‌తో కలిసి ఉస్మానియా విశ్వవిద్యాలయ హస్టల్‌లో ఒక గదిలో ఉండి చదువుకున్న శ్రీపాదరావు పీవీ నరసింహారావుకూ ఆప్తుడు. అయినా తన దైనందిన ప్రజాజీవితంలో ఆ సాన్నిహిత్యాన్ని ఆయన ఎప్పుడు వాడుకోలేదు.

1983 ఎన్టీఆర్ ప్రభంజనంలో సైతం శ్రీపాదరావు శాసన సభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత వరుసగా మూడుసార్లు ఎన్నికయినా 1994లో ఓటమి పాలయ్యారు. 1999లో శ్రీపాదరావును నక్సలైట్లు హతమార్చారు. నక్సలైట్ల దుశ్చర్యపై సర్వత్రా నిరసన వ్యక్తమయింది.

డి.జి.పిగా పని చేసి పదవి విరమణ చేసిన యం. మహేందర్ రెడ్డి తన ఉద్యోగ జీవితాన్ని ఏయస్పిగా గోదావరిఖని నుంచి ప్రారంభించారు. అప్పుడు ఆయన పరిధిలోకి వచ్చే మంథని నక్సలైట్ల ప్రాబల్య ప్రాంతంలో ఉండడంతో శ్రీపాదరావు భద్రత ఆయనకు ఒక ఆందోళనకరమైన అంశంగా ఉండేది. అయితే శ్రీపాదరావు స్వీయ భద్రత గురించి పట్టించుకునేవారు కాదు. తాను ప్రజల మనిషినని వారి మధ్య ఉంటూ సమయం వచ్చినప్పుడు అదే మట్టిలో కన్ను మూస్తానని ఆయన తరచు అనేవారు.

శ్రీపాదరావు హత్యానంతరం ఆయన వారసుడుగా ఆయన కుమారుడు శ్రీధర్‌బాబు రాజకీయాలలోకి ప్రవేశించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో పరిశ్రమలు, ఐ.టి మంత్రిగా న్యూ డిల్లీలోని అధికార వర్గాలలో గుర్తింపు పొందుతున్నారు. ఆయన ఇటీవల తన తండ్రి జయంతిని అధికారికంగా నిర్వహించారు.

రాజనీతిజ్ఞుడు పీవీ నరసింహారావు, విద్యావేత్త ముద్దు రామకృష్ణయ్య, కార్యదక్షుడు శ్రీపాదరావు వంటివారితో పాటు పలువురు ఆధ్యాత్మిక, అభ్యుదయ, విప్లవ రచయితలతో పాటు దేశంలోను, విదేశాలలోనూ కీలక ఇంజినీరింగ్ రంగాలలో నిష్ణాతులయిన నిపుణులు కూడా ఎంతో మంది మంథని నుంచి ప్రభవించారు. శ్రీపాదరావు జయంత్యుత్సవాలకు ఏటా విదేశాల నుంచి కూడా కొంత మంది విచ్చేస్తుంటారు.

అవసరం లేకున్నా భద్రత సిబ్బంది, అనుచరగణం హంగామా, డాబు దర్పాలతో కార్లలో తిరిగితే మాత్రమే శాసన సభ్యులుగా గౌరవం పొందే ఈ కాలంలో శ్రీపాదరావు తరహా నాయకుల పేర ఉత్సవాలు నిర్వహించడం మాత్రమే కాదు, కనీసం కొంత మేరకయినా వారి అడుగుజాడలలో నడిచేందుకు ప్రయత్నించాలి. అదే శ్రీపాదరావుకు నిజమైన నివాళి.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

బీసీలకు చెప్పింది కొండంత, చేసింది గోరంత!

బీసీల ఉద్ధరణ పేరుతో పచ్చి అబద్ధాలు చెబుతూ వారిని దగా చేస్తున్నారు సీఎం జగన్మోహన్ రెడ్డి. బడుగు, బలహీనవర్గాల వారిని మాటలతో మోసం చెయ్యడంలో ఆయనకు ఆయనే సాటి. బీసీలు అంటే బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కాదు, బ్యాక్ బోన్ క్లాసెస్ అంటూ బటన్ నొక్కుడు సభల్లో, రాజకీయ వేదికలపై వారిని ఆకాశానికి ఎత్తుతారు. జగన్మోహన్ రెడ్డి తన మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌తో పోలుస్తూ బీసీలను ఉద్ధరిస్తానని ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. బీసీల అభ్యున్నతికి ప్రత్యేక ఉపప్రణాళిక ద్వారా ఏటా రూ.15 వేల కోట్లు ఖర్చు చేస్తానని.. బీసీ కార్పొరేషన్లకు నిధులిచ్చి ఆర్థికంగా పరిపుష్టి చేస్తానని.. నామినేటెడ్, కాంట్రాక్టు పనుల్లో బీసీలతో పాటు ఎస్సీ ఎస్టీ, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని... ఇలా ఎన్నో లెక్కలేనన్ని హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక వాటికీ పంగనామాలు పెట్టారు. ఆ పవిత్ర గ్రంథాల సాక్షిగా బీసీలను దగా చేశారు.

బీసీలకు విధాన నిర్ణయాధికారాల్లో మిగతా వారితో సమానంగా గౌరవప్రదమైన హోదా దక్కాలన్నది చంద్రబాబు తపన, ఆశయం. గత తెలుగుదేశం ప్రభుత్వం బీసీలకు స్వయం ఉపాధి హామీ యూనిట్లు మంజూరు చేసింది. ఒక్కొక్కరికీ లక్ష రూపాయల సబ్సిడీతో మూడు లక్షల మందికి పైగా లబ్ధి చేకూర్చి బీసీలకు అండగా నిలిచింది. వారి సంక్షేమం కోసం ఆదరణ పథకాన్ని అమలు చేసింది. 17 రకాల కులవృత్తుల వారికి 90 శాతం సబ్సిడీతో అధునాతన పనిముట్లు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. 137 రకాల బీసీ కులాలను కలుపుకొని 13 కార్పొరేషన్లు, 9 ఫెడరేషన్ల ద్వారా ప్రతి ఏటా రూ.వెయ్యి కోట్లకు పైగా స్వయం ఉపాధి యూనిట్లు అందించింది. బీసీ కులవృత్తులను ప్రోత్సహించింది. రజకులకు వాషింగ్‌మెషిన్లు, నాయీబ్రాహ్మణుల సెలూన్లకు సంబంధించిన పరికరాలు, టైలర్లకు సరికొత్త కుట్టుమిషన్లు అందించి వారి అభ్యున్నతికి రూ.750 కోట్లు ఖర్చు చేసింది. దీంతో పాటు ప్రతి ఏటా 60 వేల మంది బీసీలకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేసింది. గత ప్రభుత్వం కేవలం 2018–19 సంవత్సరంలో 3,48,837 మంది బీసీలకు రూ. 377.36 కోట్లు విలువైన పరికరాలు అందజేసింది. ఆదరణ పనిముట్లను సబ్సిడీ రూపంలో అందించడానికి ఐదేళ్లలో రూ.4 వేల కోట్లు పైగా ఖర్చు చేసింది. బీసీ వర్గాల్లో స్వయం ఉపాధి స్ఫూర్తి కలిగించడంతో పాటు ఆదాయం పెంచుకునేందుకు దారి చూపించింది. కానీ జగన్ ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దు చేసింది. నవరత్నాల పేరిట కేవలం 4.37 లక్షల మందికి ఏడాదికి రూ.10 వేలు చొప్పున వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసింది.

గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా బీసీలు నివసిస్తున్న ప్రాంతాల్లో వివాహాలు, వేడుకలు నిర్వహించేందుకు అవసరమైన కమ్యూనిటీ భవనాలను నిర్మించింది. బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించి పేదలకు సాయం అందించింది. 1187 బీసీ కమ్యూనిటీ హాళ్లకు రూ.165 కోట్లు, 12 బీసీ భవనాలకు రూ.56.47 కోట్లు మంజూరు చేసింది. కులవృత్తిదారులకు ఎన్నో ఏళ్లుగా వెన్నుదన్నుగా నిలిచిన స్వయం ఉపాధి రుణాలను నిలిపివేసింది జగన్ ప్రభుత్వం. రూ లక్ష నుండి రూ.25 లక్షల వరకు అందించే 50 శాతం రాయితీ రుణాలకు నీళ్లు వదిలింది. ఈ రుణాలు ఇవ్వకపోవడంతో వారి వృత్తుల్లో ఆధునీకరణ అటకెక్కింది. బీసీలకు అమ్మఒడి లబ్ధి చేకూర్చినా, ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించినా ఆ నిధులన్నీ బీసీ కార్పొరేషన్ ద్వారా ఇస్తున్నట్టు లెక్కలు చెబుతున్నది. అయినా నవరత్నాలు, బీసీ కార్పొరేషన్ రెండింటి ద్వారా లబ్ధి చేకూర్చినట్లు ప్రభుత్వం ఆర్భాటం చేస్తోంది. నవరత్నాల పేరుతో కొందరికి నగదు జమ చేసి, బీసీలను అందరినీ ఉద్ధరించినట్టు డబ్బా కొట్టుకుంటోంది జగన్ ప్రభుత్వం. బీసీలకు సంక్షేమ పథకాలు నామమాత్రంగానే అందుతున్నాయి. 2.14 కోట్ల బీసీ జనాభాలో కేవలం ఐదు రకాల కులాలకు చెందిన 44 లక్షల జనాభాకు తప్ప, మిగతా 1.70 కోట్ల బీసీ జనాభాను గాలికి వదిలేసింది. రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్ వృత్తిని అవలంబిస్తున్న కొన్ని కులాలు, మత్స్యకారులు, చేనేత వృత్తి వారికే నవరత్నాలు అందుతున్నాయి. జగన్ ప్రభుత్వం వచ్చాక గతంలో ఉన్న ఎన్నో పథకాలను రద్దు చేశారు. నిధులు ఇవ్వకుండా కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారు. నవరత్న పథకాల నిధులనే కార్పొరేషన్ల ద్వారా చూపించి జగనన్న చేదోడు, మత్స్యకార భరోసా, నేతన్న నేస్తం పథకాల ద్వారా బీసీలకే నేరుగా ఆర్థిక సాయం అందిస్తున్నా బీసీలను ఆదుకోలేకపోతున్నది.



> కులవృత్తిదారులకు ఎన్నో ఏళ్లుగా వెన్నుదన్నుగా నిలిచిన స్వయం ఉపాధి రుణాలను నిలిపివేసింది జగన్ ప్రభుత్వం. రూ.లక్ష నుండి రూ.25 లక్షల వరకు అందించే 50 శాతం రాయితీ రుణాలకు నీళ్లు వదిలింది. బీసీలకు అమ్మఒడి లబ్ధి చేకూర్చినా, ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించినా ఆ నిధులన్నీ బీసీ కార్పొరేషన్ ద్వారా ఇస్తున్నట్టు లెక్కలు చెబుతున్నది. నవరత్నాల పేరుతో కొందరికి నగదు జమ చేసి, బీసీలను అందరినీ ఉద్ధరించినట్టు డబ్బా కొట్టుకుంటోంది.

ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఉపాధి భద్రత కల్పించి వెన్నుదన్నుగా నిలిచిన బీసీ, ఎస్సీ, కాపు, మైనార్టీ కార్పొరేషన్లు నిర్వీర్యమయ్యాయి. దీంతో వివిధ తరగతుల ప్రజలకు బ్యాంకు రుణాలతో ఉపాధి మార్గం ఎంచుకునే అవకాశం లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో బీసీ, ఎస్సీ, మైనార్టీ కార్పొరేషన్లకు ప్రత్యేక స్థానం ఉండేది. ప్రతియేటా లక్ష్యాలు నిర్దేశించుకుని వీరికి బ్యాంకు రుణాలు ఇప్పించి ఉపాధి మార్గం చూపించేది. కిరాణా కొట్టు, ఫొటో స్టూడియోలు వంటి ఎన్నో వ్యాపారాలు పెట్టుకోవడంతో పాటు, కార్లు వంటి వాటితో ఉపాధి పొందేందుకు కార్పొరేషన్లు సహాయపడేవి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ రుణాలు పెద్దఎత్తున ఇచ్చారు. బీసీ కార్పొరేషన్ ద్వారా వెనుకబడిన కుటుంబాలకు దాదాపు పది వేలకు పైగా యూనిట్లు మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బీసీ, ఎస్సీ, మైనార్టీ, బీసీ సామాజిక తరగతుల్లో అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఛైర్మన్లను, డైరెక్టర్లను నియమించింది. అయితే నిధులు మాత్రం ఇవ్వలేదు. కార్పొరేషన్ల పరిధిలో ఎటువంటి కార్యక్రమాలూ జరగలేదు. గతంలో రుణాల కోసం వచ్చే జనంతో కళకళలాడే కార్పొరేషన్లు నేడు వెలవెలబోతున్నాయి. రాష్ట్రంలో అన్ని తరగతులకు ఇచ్చే సంక్షేమ పథకాల సొమ్మును కూడా వీరికి ఇచ్చిన సొమ్ముగా చూపిస్తున్నారే తప్ప, ఉపాధి కల్పించే బ్యాంకు రుణాల గురించి మాత్రం ప్రభుత్వం మాట్లాడటం లేదు.

జీవో నెం. 217తో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15 లక్షల మంది మత్స్యకారుల్ని రోడ్డున పడేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24శాతానికి తగ్గించడంతో బీసీలు 16,800లకు పైగా స్థానిక పదవుల్ని కోల్పోయారు. ఈ ప్రభుత్వం రూ.18,226కోట్ల బీసీ కార్పొరేషన్ నిధుల్ని దారి మళ్లించింది. దళిత, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 18వేల ఎకరాలను ఇళ్ల పట్టాల పేరుతో బలవంతంగా గుంజుకుంది. స్వతంత్ర భారతదేశ చరిత్రలో బీసీలపై జగన్ ప్రభుత్వంలో జరిగినన్ని దాడులు, వేధింపులు ఎప్పుడూ జరగలేదు. దాదాపు 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులను రోడ్డున పడేశారు. జాబ్ క్యాలెండర్ అతీగతీ లేదు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ, పోలీస్ నోటిఫికేషన్లు, ఇతర ఖాళీలు భర్తీ చేయకుండా బీసీ యువత జీవితాలతో ఆటలాడుతున్నారు.

చంద్రబాబు ఐటీ ఉద్యోగాలిచ్చి యువతను విదేశాలకు పంపితే, జగన్మోహన్ రెడ్డి వాలంటీర్ ఉద్యోగాలతో సరిపెట్టారు. టీడీపీ ప్రభుత్వంలో అమలైన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాలను జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే మూసివేసారు. గత ప్రభుత్వం 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తే, జగన్మోహన్ రెడ్డి ఆ సంఖ్యను 10 లక్షలకు కుదించారు. అయిదేళ్లుగా బీసీ సామాజిక వర్గానికి చెందిన, 3000 మంది బీసీలపై తప్పుడు కేసులు పెట్టారు. సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలు వెల్లడించిన వారిని దారుణంగా వేధించారు. 30 మంది బీసీలను హత్య చేయించారు. జగన్ పాలనలో బీసీలు అత్యంత గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.

మళ్లీ ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని జగన్‌రెడ్డి బీసీ మంత్రం జపిస్తున్నారు. బీసీల పట్ల ఎక్కడలేని ప్రేమ ఒలకబోస్తున్నారు. బీసీల చుట్టూ రాజకీయాలు చేస్తున్నారు. అబద్ధాలు చెబుతూ బీసీల ఓట్లకు గాలం వేస్తున్నారు. గత అయిదేళ్లుగా బీసీలను నిలువునా మోసం చేసారు. బీసీలు టీడీపీ సానుభూతిపరులనే ఉద్దేశంతో జగన్ ప్రభుత్వం వారిపై కక్ష కట్టినట్టు వ్యవహరించింది. ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను టిక్కెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నది. కొద్ది మంది బీసీ నేతలకు కార్పొరేషన్ పదవులిచ్చి మొత్తం బీసీ వర్గాలను ఉద్ధరించినట్లు బిల్డప్ ఇస్తున్నారు జగన్‌రెడ్డి. జగన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఆయన అబద్ధాలకు మరోసారి మోసపోరాదు.

• యనమల రామకృష్ణుడు
టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు

వాలంటీర్లను పోలింగ్ విధులకు దూరంగా ఉంచాలి

ఒక రెవెన్యూ ఉద్యోగిని ఎక్కడ పోస్టుచేసినా భారీగా లంచాలు పడుతున్నాడని గుర్తించిన జిల్లా కలెక్టరు క్రమశిక్షణా చర్యగా లంచాలకు అవకాశం లేని ఒక పోస్టులో నియమించాడు. అతడి డ్యూటీ సముద్రం ఒడ్డున కుర్చీ వేసుకుని కెరటాలను లెక్కించి రికార్డు చేయడం, సాయంత్రానికి ఆ సంఖ్యను కలెక్టరుకు రిపోర్టు చేయడం. అయితే బాగా అక్రమార్జనకు అలవాటుపడ్డ ఆ ఉద్యోగి తన వద్దకు వచ్చిన మత్స్యకారులతో ప్రతి రోజూ ఈ ఒడ్డుకు చేరే కెరటాల సంఖ్యను బట్టి రాబోయే రోజుల్లో ప్రభుత్వం వారిపై కెరటాల పన్ను విధించనున్నదని చెప్పాడు. అందుకే తాను ఒక నెల రోజుల్లో తీరానికి చేరే అలల సంఖ్యను లెక్కించి, రికార్డు చేస్తున్నానని వాళ్లను నమ్మించాడు. దాంతో వాళ్ళ ఆయనను కెరటాల సంఖ్యను సగానికి తగ్గించి రిపోర్టు చేయమని, తమకు మిగిలే పన్ను సొమ్ములో సగం ఆ రెవెన్యూ ఉద్యోగికి చెల్లిస్తామని ఒప్పందం చేసుకుని, ముడుపులు చెల్లించారు. ఈ విషయం తెలిసిన కలెక్టరుకు మతి పోయింది.

ఇదేవిధంగా వైసీపీ కార్యకర్తలుగా చలామణి అవుతున్న వాలంటీర్లను రాబోయే ఎన్నికలలో ఎలక్షన్ విధులకు కేటాయించరాదని స్పష్టం చేసిన కేంద్ర ఎన్నికల సంఘం, పోలింగ్ డ్యూటీలో ఓటర్లుకు వేలి మీద ఇంకు మార్కు వేసేందుకు వారిని వాడుకోవచ్చని మినహాయింపు నిచ్చింది. ఇది చాలా ప్రమాదకరం. వేలిమీద ఇంకు మార్కు వేయడంలో కూడా అనేక విధాలుగా అక్రమాలకు పాల్పడవచ్చనే ఆలోచన మన కేంద్ర ఎన్నికల సంఘానికి రాకపోవడం ఆశ్చర్యకరం. వేలి మీద గుర్తు వేస్తూ ఒక పార్టీ గుర్తు మీదనే ఓటు వేయాలని ప్రభావితం చేయటం, అధికారిక సిరాతో కాక సులువుగా చెరిగిపోయే ఇంకును వాడటం, ఉద్దేశపూర్వకంగా ఇంకుసీసాను పగలగొట్టి కృత్రిమంగా ఇంకు కొరతను సృష్టించడం వంటి అనేక కుటిల చర్యలకు వాలంటీర్లు పాల్పడే అవకాశాలు ఉన్నాయి.

ఇటీవల ఓటర్ల లిస్టు తయారీలో వాలంటీర్లు పాల్పడ్డ అనేక అక్రమాలను పరిగణనలోకి తీసుకొని వీరిని, గృహసారథులను, గ్రామ సచివాలయ ఔట్‌సోర్స్ సిబ్బందిని కేంద్ర ఎన్నికల సంఘం పూర్తిగా ఎన్నికల విధులకు దూరంగా, పోలింగ్ ఆవరణ వెలుపల మాత్రమే ఉంచాలి. లేకపోతే భారీ స్థాయిలో పోలింగ్ అక్రమాలు జరిగే ప్రమాదం ఉంది. అంతేకాక గత నాలుగేళ్లుగా ఆంధ్రప్రదేశ్ పోలీసులు మితిమీరిన పక్షపాత ధోరణి ప్రదర్శిస్తూ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారు. పాలకులు కూడా కీలక ప్రాంతాలలో తమకు అనుకూలురైన పోలీసులను నియమించుకున్నట్లు వార్తాకథనాలు వస్తున్నాయి.

కాబట్టి వాలంటీర్లతో పాటు గృహ సారథులను, ఔట్‌సోర్స్ ఉద్యోగులను పోలింగ్ కేంద్రాల ఆవరణలోకి అనుమతించరాదు. ఈ విషయమై స్వచ్ఛంద సంస్థలు, ప్రతిపక్షాలు, ప్రజాస్వామ్యవాదులు ఉద్యమించాలి.

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ఫ్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

మంగళగిరిలోని బైబిల్ మిషన్ గ్రౌండ్‌లో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో 'జయహో బీసీ' జెండాలతో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర

సభకు హాజరైన అశేష జనవాహిని



బీసీల.. జయహో!

నాగార్జున వర్సిటీ ఎదుట జనసంద్రం



జనసేన, టీడీపీ జెండాలతో శ్రేణుల హంగామా

- రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన బీసీలు
- విజయవంతంగా బీసీ డిక్లరేషన్ సభ
- ఐక్యత చాటిన టీడీపీ - జనసేన శ్రేణులు



అచ్చెన్నతో లోకేశ్ మాటామంతీ.. పక్కన కొల్లు

జయహో.. బీసీ నినాదం మారుమోగింది. 153 కులాలతో 56 సాధికార కమిటీలు ఏర్పాటు చేసి అభిప్రాయాలు సేకరించిన అనంతరం రూపొందించిన టీడీపీ, జనసేన ఉమ్మడి బీసీ డిక్లరేషన్‌పై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని బైబిల్ మిషన్ గ్రౌండ్ బీసీలతో నిండిపోయింది. మంగళవారం జరిగిన బీసీ డిక్లరేషన్ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది తరలివచ్చారు. ఆర్టీసీ బస్సులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం అడ్డంకులు కల్పించినా ప్రైవేటు వాహనాలు, తెలంగాణ ఆర్టీసీ బస్సుల ద్వారా లక్షలాదిగా ప్రజలు సభకు తరలివచ్చారు. బీసీలను జగన్‌రెడ్డి ఊచకోత కోశాడని చంద్రబాబు, వైసీపీ పాలనలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని సూటిగా, స్పష్టంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెప్పారు.



విజయచిహ్నం చూపుతున్న తెలుగు మహిళలు

"ఇన్నాళ్లు ప్రభుత్వ పథకాలన్నీ మీ చేతుల మీదుగానే అమలు అయ్యాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మీకు జీతాలు ఇస్తూ ఆర్థికంగా ఆదుకున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు ఓటములు మీ చేతుల్లోనే ఉన్నాయి. కాబట్టి మీరంతా పార్టీకి పనిచేయాల్సిందే. పార్టీకి పని చేయని వారిపై కఠిన నిర్ణయాలు ఉంటాయి"

- వారం రోజులుగా సెంట్రల్ నియోజకవర్గంలోని వైసీపీ కార్యాలయాల్లో వినిపిస్తున్న మాటలు ఇవి.

అధికార వైసీపీ నేతలు ఎన్నికల్లో గెలుపు కోసం వలంటీర్లపై గురి పెట్టారు. వలంటీర్లు ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశాలిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో పార్టీ గెలవాలని, అందుకు అనుగుణంగా మీరు తప్పనిసరిగా పని చేసి తీరాలని ఆదేశిస్తున్నారు. రహస్య సమావేశాలు పెట్టి ఏం చేయాలి? ఓటర్లను ఎలా కలవాలి? అనే అంశాలపై దిశానిర్దేశం చేస్తున్నారు. తమకు అనుకూలంగా పనిచేస్తే రూ.5వేలు ఇస్తామని బేరం పెడుతున్నారు. పనిచేయని వారిపై బెదిరింపులకు దిగుతున్నారు.

తాయిలాలు.. బెదిరింపులు!



- ఒక్కొక్కరికి రూ.5వేలు ఇస్తాం
- ఈ ఏడాది ఇచ్చిన సత్కార బహుమతికి ఇది అదనం
- మాట వినకపోతే ఊరుకోం
- గెలిచాక మీ సంగతి తేలుస్తాం
- రోజుకు గంట సేపైనా ఓటర్లతో మాట్లాడాలి
- వలంటీర్లకు వైసీపీ నేతల అల్టిమేటం
- ఎన్నికల్లో ఎలా పని చేయాలో దిశానిర్దేశం

వలంటీర్లతో వైసీపీ కార్యాలయాల్లో నేతల రహస్య సమావేశాలు | ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేయాలని ఆదేశాలు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 5 : వారం రోజులుగా నియోజకవర్గంలోని వైసీపీ డివిజన్ కార్యాలయాల్లో వలంటీర్లతో రహస్య సమావేశాలు జరుగుతున్నాయి. వైసీపీ సెంట్రల్ ఇన్‌చార్జి వెలంపల్లి నియమించుకున్న డివిజన్ ఇన్‌చార్జ్‌లు, కార్పొరేటర్లు, పార్టీ నేతలు వలంటీర్లకు బ్రెయిన్ వాష్ చేస్తున్నారు. జగన్ గెలిస్తేనే మీకు భవిష్యత్తు అంటూ ప్రలోభపెట్టి వారిని ఎన్నికలకు సిద్ధం చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. ప్రతి డివిజన్‌లో రోజుకు రెండు సచివాలయాల చొప్పున ఎన్నుకుని పార్టీ కార్యాలయాలకు రప్పించుకుని సమావేశాలు నిర్వహిస్తున్నారు.

● రూ.5 వేలు ఇస్తామని ఎర

ఎన్నికల్లో పనిచేసినందుకు గాను వలంటీర్లకు రూ.5 వేలు ఇస్తామని రహస్య సమావేశాల్లో చెబుతున్నట్టు తెలుస్తోంది. ప్రతి ఏడాదీ ఇచ్చే వలంటీర్ల సత్కార కార్యక్రమానికి ఇచ్చే రూ.10 వేలుకు బదులుగా ఈ ఏడాది రూ.15 వేలు ఇచ్చామని మరో రూ.5 వేలు ఇస్తామని ఆశచూపిస్తున్నారు. అయితే రూ.5 వేలుకు తగ్గట్టుగా తమతో ఫలితాలు చూపించాలని వలంటీర్లతో రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారు.

● నోటిఫికేషన్ విడుదల తర్వాత ఎలా పని చేయాలో దిశానిర్దేశం

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన తరువాత వలంటీర్లు విధుల్లో ఉండే పరిస్థితులు లేకపోవడంతో నోటిఫికేషన్ విడుదల తర్వాత వలంటీర్లు ఎలా పనిచేయాల్లో రహస్య సమావేశాల్లో వైసీపీ నేతలు వారికి దిశ నిర్దేశం చేస్తున్నారు. వలంటీర్లంతా తమ తమ క్లస్టర్ల పరిధిలో ఏదో ఒక వ్యక్తిగత పని కల్పించుకుని వెళ్లాలని, ఓటర్లతో రోజులో కనీసం ఒక గంట గడపాలని సూచిస్తున్నారు. పథకాల్లో లబ్ధిపొందిన వారి జాబితాను సిద్ధం చేసుకుని రోజుకు ఐదు ఆరు కుటుంబాలను కలుస్తూ మాట మంతీ మాట్లాడి నిదానంగా వారిని ఓటు బ్యాంకుగా మార్చాలని వలంటీర్లకు నూరిపోస్తున్నారు.

● పనిచేయకపోతే తీవ్ర పరిణామాలు

ఎన్నికల్లో వలంటీర్ల పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తామని పనిచేయని పక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరింపులకు గురి చేస్తున్నారు. వచ్చేది వైసీపీ ప్రభుత్వమే అని, పనిచేయని వలంటీర్లను గుర్తించి విధుల నుంచి తొలగించడమే కాకుండా వారికి వచ్చే పథకాలను కూడా నిలుపుదల చేస్తామని ముందుగానే హెచ్చరిస్తున్నారు.

● కమిషనర్ ఆదేశాలు బేఖాతర్

వైసీపీ నేతల పర్యటనల్లో వలంటీర్లు పాల్గొనకూడదని ఇప్పటికే నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఓ సర్క్యులర్‌ను కూడా జారీ చేశారు. అయినా కమిషనర్ ఆదేశాలు బేఖాతర్ చేస్తూ వైసీపీ నేతలు సచివాలయ సిబ్బంది కుమ్మక్కై వలంటీర్లు వైసీపీ కార్యాలయాలకు వెళ్లి సమావేశాల్లో పాల్గొనేలా చూస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పంపిణీ చేసిన కుక్కర్లపై వైసీపీ ప్రచార చిత్రాలు

ఈసారి వీవోఏలకు...

- వలంటీర్లను ప్రలోభపెడుతున్న వైసీపీ అభ్యర్థులు
- పెనమలూరు, విజయవాడ సెంట్రల్‌లో కుక్కర్ల పంపిణీ
- తాజాగా పామర్రులోనూ డ్వాక్రా వీవోఏలకు ప్రలోభాలు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎన్నికల వేళ వైసీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుంది. ఐదేళ్లపాటు అడ్డగోలుగా దోచుకున్న ఎమ్మెల్యేలు ఇప్పుడు ఓటమి భయంతో ప్రలోభాలతో గెలుపును సొంతం చేసుకోవాలని తహతహలాడుతున్నారు. విజయవాడ సెంట్రల్ నుంచి వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న వెలంపల్లి శ్రీనివాసరావు, పెనమ లూరు నుంచి బరిలో ఉన్న జోగి రమేశ్ ఇప్పటికే ఈ బాటలో పయనిస్తుండగా తాజాగా పామర్రు ఎమ్మెల్యే కైలే అనీల్ వారి సరసన చేరారు. వెలంపల్లి డివిజన్ల వారీగా వలంటీర్లతో సమావేశాలు నిర్వ హిస్తూ తాయిలాలు అందజేస్తున్నారు. తన గెలుపు నకు సహకరించాలని వలంటీర్లను వేడుకుంటు న్నారు. పెనమలూరులో జోగి రమేశ్ సైతం వలంటీర్లతో, డ్వాక్రా ఆర్పీలతో సమావేశాలు పెట్టి తాయిలాలు అందజేస్తున్నారు. తాజాగా పామర్రులో ఎమ్మెల్యే అనీల్ డ్వాక్రా విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీవోఏ)లతో సమావేశం నిర్వహించి కుక్కర్లను అందజేశారు. అందరికీ భోజనాలు పెట్టి, తన గెలుపునకు కృషి చేయాలని కోరారు.

కోర్టులో మాజీ ఎమ్మెల్యే వంశీ

దౌర్జన్యం

కోర్టు కారిడార్‌లో టీడీపీ కార్యకర్తలపై దాడి

- వంశీ ఆదేశాలతో ఫోన్లు లాక్కున్న గన్‌మెన్లు
- దాడికి దిగిన కొమ్మా కోట్లు
- న్యాయాధికారికి వివరించిన బాధితులు
- రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించిన కోర్టు
- సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ వద్ద యార్లగడ్డ నిరసన



మాట్లాడుతున్న యార్లగడ్డ

విజయవాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ఆయన అనుచరులు కోర్టు ఆవరణలోనే బరి తెగించారు. ప్రత్యర్థులపై దాడులకు ప్రయత్నించారు. ఈ ఘటన విజయ వాడలోని ప్రజాప్రతినిధుల కోర్టు ఆవరణలో మంగళవారం జరిగింది. 2019 ఎన్నికల్లో వంశీ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆయనకు ప్రత్యర్థిగా యార్లగడ్డ వెంకటరావు ఉన్నారు. ఆ సమయంలో జరిగిన గొడవపై ఇరు వర్గాలపైనా కేసులు నమోదు చేశారు. తర్వాత వంశీ వైసీపీలోకి వెళ్లినా ఆయన అనుచరులు చాలామంది టీడీపీలోనే ఉన్నారు. యార్లగడ్డ టీడీపీలో చేరారు. ప్రసాదంపాడు ఉపసర్పంచ్ గూడవల్లి నరసింహారావు, కోనేరు పెదబాబు నాడు వంశీ వెంట ఉండి, ఇప్పుడు టీడీపీలో ఉన్నారు. వారిపైనా కేసులు ఉండడంతో కోర్టుకు హాజరవుతున్నారు. మంగళవారం జరిగిన విచారణకు వల్లభనేని వంశీ, గూడవల్లి నరసింహారావు, ఆయన మేనల్లుడు కిరణ్, సోదరుడు శివనాగేశ్వరరావు, సోదరుడి కుమారుడు రవీంద్రబాబు, రామారావు, కోనేరు పెదబాబు తదితరులు వచ్చారు. నరసింహారావుతో మిగిలిన వాళ్లంతా కోర్టు బయట ఉన్న కారిడార్‌లో నిలబడి ఉన్నారు. వంశీ మాత్రం కోర్టు హాలులో కూర్చున్నారు. ఆయన అనుచరులు కొమ్మా కోట్లు, గన్‌మన్లు బయట కారిడార్‌లో ఉన్నారు. డ్రైవర్ అంబటి సుబ్బారెడ్డి, ఆయన సోదరుడి కుమారుడు రవీంద్రబాబు కారులో ఉన్న మంచినీళ్లు తీసుకెళ్లి నరసింహారావుకు ఇచ్చి తిరిగి వెళ్తుండగా కొమ్మా కోట్లు మరికొంతమంది వారిపై దాడి చేశారు. కొమ్మా కోట్లు తమపై దాడి చేశాడని నరసింహారావు ఆరోపిస్తున్నారు. గొడవ విషయం తెలిసి అక్కడికి చేరుకున్న పోలీసులు.. రవీంద్రబాబు, సుబ్బారెడ్డిని సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకుని టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు తన అనుచరులతో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. కొద్దిసేపటికి రవీంద్రబాబు, సుబ్బారెడ్డిని పోలీసులు వదిలేయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ప్రాణహాని ఉంది

వంశీ అనుచరులు నాపైనా, నా అనుచరులపైనా దాడి చేయడం ఇది మొదటిసారి కాదు. కొద్దినెలల క్రితం ఇంటి వద్ద ఉన్న మూడు కారులను ధ్వంసం చేశారు. ఇప్పుడు ఏకంగా కోర్టులోనే దాడి చేశారు. కొమ్మా కోట్లు నా దగ్గరకు వచ్చి త్వరలో కనిపించకుండా చేస్తానని బెదిరించారు. వంశీ, అతని అనుచరుల నుంచి ప్రాణహాని ఉంది. ఇదే విషయాన్ని న్యాయాధికారికి వివరించాను.

-గూడవల్లి నరసింహారావు, టీడీపీ నేత

అంతా రహస్యం!

- మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్వాకం
- వాస్తవాలను దాచి కలెక్టర్‌ను బురిడీ కొట్టించారు
- నిబంధనలకు విరుద్ధంగా పోస్టుల భర్తీ
- పోస్టును అమ్ముకున్నారన్న ఆరోపణలు
- అర్హత, అనుభవం ఉన్నవారిని పక్కన పెట్టి స్థానికేతర మహిళకు కట్టబెట్టేందుకు సిద్ధం

'దిశ' వన్‌స్టాప్ సెంటర్ పోస్టుల భర్తీలో గోల్‌మాల్

ఆంధ్రజ్యోతి, విజయవాడ: బాధిత మహిళలకు న్యాయ, వైద్య సేవలందించే 'దిశ' వన్‌స్టాప్ సెంటర్‌లో పనిచేయాలనుకునే వారికి న్యాయం కరువైంది. ఎన్టీఆర్ జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో నిర్వహించే దిశ వన్‌స్టాప్ సెంటర్ (సఖి)లో సెంటర్ అడ్మినిస్ట్రేటర్ (సీఏ) పోస్టుల భర్తీలో గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పోస్టును అధికారులు అమ్ముకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. తమకు అన్యాయం జరిగిందని అభ్యర్థులు లబోదిబోమంటున్నారు. నిబంధనల ప్రకారం భర్తీ చేయాల్సిన సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పోస్టును రహస్యంగా భర్తీ చేయటంపై విమర్శలు వస్తున్నాయి. ఈ పోస్టుకు జిల్లాలో ఎంతో మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎంతో మంది అర్హత కలిగిన వారున్నారు. పోటీ ఎక్కువగా ఉండటంతో మిగిలిన అభ్యర్థులకు తెలియకుండా రహస్యంగా భర్తీ ప్రక్రియ నిర్వహించారు. ఒక పారదర్శక విధానం లేకుండా కేవలం ఇద్దరినే ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు. వీరిలో ఒకరు స్థానికేతర మహిళ. ఆమెకే పోస్టును కట్టబెట్టే ప్రయత్నాలు చేయటంపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. గుంటూరు జిల్లాలో దిశ వన్‌స్టాప్ సెంటర్‌లో కేస్ వర్కర్‌గా పనిచేస్తున్న ఓ మహిళకు ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్వ్యూకు ఎంపిక చేయటం వెనుక ఎలాంటి అర్హతలున్నాయో అధికారులే చెప్పాలి. దీనిపై ఏకంగా కలెక్టర్‌కే తప్పుడు సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. ఎంపిక చేసిన మహిళ విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్ ప్రాంతానికి చెందిన మహిళగా చూపించారు. దిశ వన్‌స్టాప్ సెంటర్లలో ఏ జిల్లాకు ఆ జిల్లాలో స్థానికులనే తీసుకోవాలి. వేరే జిల్లావారిని తీసుకోవటానికి వీలు లేదు. తప్పు ఎక్కడ జరిగిందో మహిళా శిశు సంక్షేమ అధికారే చెప్పాలి.

కలెక్టర్ విచారణకు ఆదేశించాలి

దిశ వన్‌స్టాప్ సెంటర్‌లో సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పోస్టు భర్తీలో జరిగిన గోల్‌మాల్ వ్యవహారాలపై జిల్లా కలెక్టర్ తక్షణం విచారణకు ఆదేశించాలి. ఆమె స్థానిక వివరాలపై కలెక్టర్ దృష్టి సారిస్తే వాస్తవం తెలిసిపోతుంది. తమకు న్యాయం చేయాలని అభ్యర్థులు కోరుతున్నందున కలెక్టర్ విచారణకు ఆదేశించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, విజయవాడ పార్లమెంట్ ఇన్‌చార్జి కేశినేని చిన్ని తదితర నేతలతో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

- టీడీపీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తా
- ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

విద్యాధరపురం, మార్చి 5: టీడీపీ సిద్ధాంతాలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీ పెద్దల నాయకత్వంలో పార్టీ అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన ఆయన తొలిసారిగా ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇకపై తాను టీడీపీ సభ్యుడిగా పార్టీ కార్యక్రమాలను కొనసాగిస్తానన్నారు. 1982లో టీడీపీ ఆవిర్భావం నుంచే తన తండ్రి వసంత నాగేశ్వరరావు ప్రజాసేవా ప్రారంభించారని గుర్తు చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేష్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని విశ్వసిస్తున్నానన్నారు. బంగారు భవిష్యత్తు ఉన్న యువత కోసం రాష్ట్రంలో పరిశ్రమలు రావాల్సి ఉందని, ఆదాయ వనరులు పెంచి జీవనోపాధి కల్పించాలన్నారు. సంక్షేమం, అభివృద్ధిని ఏకతాటిపై నడిపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. టీడీపీ-జనసేన కూటమి ప్రధాన అజెండా ఇదేనన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. వైఎస్ఆర్ ఆశయాలను నెరవేరుస్తానని చెప్పి ఒక్క అవకాశం ఇవ్వండంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి వైఎస్సార్ ఆశయాలను విస్మరించారన్నారు. రాజకీయాల్లో విలువలు పాటించాలని విమర్శకు, అసభ్యపదజాలానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అందరూ తెలుసుకోవాలన్నారు. విధానపరమైన విమర్శలు చేస్తానే తప్ప వ్యక్తిగత దూషణలు చేయనన్నారు. టీడీపీ అధిష్ఠానం నిర్ణయాలే తనక శిరోధార్యమన్నారు. అక్రమ కేసులకు గురైన వారందరినీ తాను వ్యక్తిగతంగా కలుస్తానన్నారు. రెండు వారాల నుంచి తనను కూడా అక్రమ కేసుల్లో ఇరికించాలని చూస్తున్నారన్నారు. నెట్టెం రఘురామ్, కేశినేని శివనాథ్ (చిన్ని), గన్నె వెంకటనారాయణ ప్రసాద్, కోమటి సుధాకర్ రావు, జంపాల సీతారామయ్య తదితర టీడీపీ సీనియర్ నేతలు, క్యాడర్ కృష్ణప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ నోటిఫైడ్ కార్గో సెంటర్

ఆంధ్రజ్యోతి, విజయవాడ: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ నోటిఫైడ్ కార్గో సెంటర్ ఏర్పాటు చేయాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ ఛాంబర్స్) లేఖ రాసింది. మంగళవారం ఏపీ ఛాంబర్స్ అధ్యక్షుడు పొటూరి భాస్కరరావు ఏఏఐకు లేఖ రాశారు. విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా, ఆటో కాంపోనెంట్స్, మెషినరీ పార్ట్స్, హ్యాండ్లూమ్స్, ఫ్లోరీ కల్చర్ తదితర కార్గో రవాణా నిర్వహణకు అవకాశాలున్నాయన్నారు. దేశ విదేశాలకు భారీగా రవాణా చేసే స్థాయి ఉన్నందున ఇక్కడ కస్టమ్స్ నోటిఫైడ్ కార్గో సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్గో నోటిఫైడ్ లేక ఎగుమతిదారులంతా హైదరాబాద్ విమానాశ్రయం నుంచే రవాణా చేయాల్సి వస్తోందని, తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

బాలిక అనుమానాస్పద మృతి

పెడన, మార్చి 5: మండలంలోని నందిగామ గ్రామంలో మంగళవారం ఉదయం ఓ బాలిక (15) ఆత్మహత్య చేసుకుంది. నందిగామకు చెందిన పామర్తి ప్రభుకుమార్ (19) అదే గ్రామానికి చెందిన బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఫలితంగా ఆమె గర్భవతి అయింది. ప్రభుకుమార్ ఏవో మాత్రలు మింగించడంతో అబార్షన్ అయింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లి 5 రోజుల క్రితం ప్రభుకుమార్ ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని ప్రభుకుమార్ తల్లిదండ్రులకు తెలిపి వారిద్దరి పెళ్లి జరిపించాలని ప్రాథేయపడింది. ప్రభుకుమార్ తల్లిదండ్రులు నిరాకరించడంతో ఇంటికొచ్చేసింది. అప్పటి నుంచి బాలిక ముభావంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆమె మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉరికి వేలాడుతున్న బాలికను బంధువులు బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ఎస్ఐ సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





ఆర్టీసీ డీపో మేనేజర్ పేరుతో ఏర్పాటు చేసిన స్వాగతం ఫ్లెక్సీ, వంశీమోహన్‌కు ఎమ్మెల్యే హోదా తగిలిస్తూ హనుమాన్‌జంక్షన్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ శిలాఫలకం

ఇదేం మర్యాద!

అనర్హత వేటు వేసిన ఎమ్మెల్యేకు ప్రొటోకాల్‌లో పెద్దపీట

- ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభోత్సవ శిలాఫలకంపై వంశీ పేరు
- అధికారుల తీరుపై మండిపడుతున్న విపక్షాలు

హనుమాన్‌జంక్షన్, మార్చి 5: అనర్హత వేటు పడిన గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ విషయంలో అధికారులు ఇంకా ప్రొటోకాల్ పాటిస్తూ తమ స్వామిభక్తిని చాటుకుంటున్నారు. హనుమాన్‌జంక్షన్ నూతన బస్టాండ్ ప్రారంభోత్సవ శిలాఫలకంపై వంశీని ఎమ్మెల్యే అంటూ సంబోధించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండున్నరేళ్ల కిందట ప్రారంభించిన బస్టాండ్ పనులను సదరు కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు రాకపోవడం నెమ్మదిగా సాగదీస్తూ పనులు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రానున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో పనులు పూర్తికాకపోయినా మంగళవారం హడావిడిగా బస్టాండ్‌ను ప్రారంభించారు. అయితే ప్రారంభోత్సవ శిలాఫలకంపై అనర్హత వేటుతో మాజీగా మారిన వల్లభనేని వంశీమోహన్ పేరును ఎమ్మెల్యేగా పేర్కొంటూ వేయడం వివాదాస్పదమవుతోంది. అధికారికంగా వేసిన శిలాఫలంకపై ఎమ్మెల్యేగా పేర్కొనగా, వంశీకి స్వాగతం పలుకుతూ ఆర్టీసీ వైస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ గన్నవరం డిపో కమిటీ వేసిన ఫ్లెక్సీలో మాత్రం ఎమ్మెల్యే పదంపై వైటనర్‌తో చెరిపేయడం గమనార్హం. గన్నవరం డీపో మేనేజర్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై కూడా వంశీమోహన్‌ను ఎమ్మెల్యే హోదాతో స్వాగతించారు. యూనియన్ నాయకులకు ఉన్న అవగాహన కూడా అధికారులకు లేకపోవడాన్ని విపక్షాలు, స్థానికులు తప్పుపడుతున్నారు. హోదాలేని వ్యక్తికి హోదాను ఆపాదించడంలో అధికారుల తీరు వింతగా ఉందని విమర్శిస్తున్నారు.

పోలింగ్ సైన్యం.. సిద్ధం!

22వేల మంది ఉద్యోగ సైన్యంతో ఎన్నికల బరిలోకి..

- 12,103 మంది ఉద్యోగులకు విధుల కేటాయింపు
- డేటాబేస్‌లో ఎంటర్ చేస్తున్న జిల్లా అధికారులు
- స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలూ ఖరారు
- రవాణా వాహన శ్రేణి కోసం ప్రతిపాదనలు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: వచ్చే ఎన్నికల సమరానికి పోలింగ్ విధులు నిర్వహించేందుకు ఎన్టీఆర్ జిల్లాలో పోలింగ్ సైన్యం సిద్ధమైంది! జిల్లావ్యాప్తంగా 22,885 మంది పోలింగ్ సైన్యం అవసరమని భావిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి (డిస్ట్రిక్ట్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్)గా కలెక్టర్ ఢిల్లీరావు వ్యవహరించబోతున్నారు. ఆయన సారథ్యంలో 169 సెక్టార్ పోలీసు ఆఫీసర్లు, 900 మంది మైక్రో అబ్జర్వర్లు, 2236 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, పోలింగ్ ఆఫీసర్లు 10,246 మంది, బూత్ లెవల్ ఆఫీసర్లు 1863 మంది, జిల్లా నోడల్ అధికారులు 16 మంది, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఏడుగురు, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఏఆర్‌వోలు 44 మంది, ఈఆర్‌వోలు ఏడుగురు, ఏఈఆర్‌వోలు 36 మంది, పోలీసు బందోబస్తుకు 7200 మంది పోలీసులు అవసరమని అధికారులు 2 నెలల కిందటే నిర్ణయించింది. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి విజయవాడ పర్యటనకు వచ్చినపుడు కలెక్టర్ ఈ ప్రతిపాదనలను చేశారు. పోలింగ్ రోజున మాత్రం 12,103 మంది ఉద్యోగుల అవసరం ఉందని ప్రాథమికంగా గుర్తించారు. జిల్లావ్యాప్తంగా 1781 పోలింగ్ కేంద్రాలతో పాటు కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గానికి సంబంధించి ఎన్టీఆర్ జిల్లాలో అంతర్భాగంగా ఉన్న పలు విజయవాడ రూరల్ గ్రామాలకు అవసరమైన 82 పోలింగ్ కేంద్రాలు కలిపి మొత్తం 1863 పోలింగ్ కేంద్రాలకు 12,103 మంది పోలింగ్ సిబ్బంది అవసరం కాగా 14,524 మంది పోలింగ్ సిబ్బందిని సిద్ధం చేశారు. ప్రిసైడింగ్ ఆఫీసర్స్ (పీవో)గా 1863 మందికి గాను 2236 మందిని, అదర్ పోలింగ్ ఆఫీసర్లు (ఓపీవో)గా 9315 మంది అవసరం కాగా 11,178 మంది సిబ్బందిని, మైక్రో అబ్జర్వర్లుగా 925 మంది అవసరం కాగా 1110 మందిని సిద్ధం చేసుకుంది. రిజర్వు అవసరాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు సిబ్బందిని సిద్ధం చేసుకున్నారు. తుది డేటాబేస్‌లోకి మాత్రం అందరి పేర్లు ఎక్కలేదు. 2317 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్స్, 8287 మంది అదర్ పోలింగ్ ఆఫీసర్స్, 311 మంది మైక్రో అబ్జర్వర్ల డేటాను మాత్రమే ఎంటర్ చేశారు. ఉద్యోగుల నుంచి పూర్తిగా కన్ఫర్మేషన్ రాకపోవటం, పలువురు ప్లేస్‌లు మార్చుకోవటానికి సిఫార్సులు పంపించటం, వంటి కారణాలతో డేటాను పూర్తిగా ఎంటర్ చేయలేదు. నోటిఫికేషన్‌కు నాలుగైదు రోజులు ముందుగానే పూర్తి వివరాలు ఎంటర్ చేయాలని భావిస్తున్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను అధికారులకు అందిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ఫిక్స్

స్ట్రాంగ్ రూమ్, ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులు నిర్ణయించారు. జూపూడిలోని నోవా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీని స్ట్రాంగ్ రూమ్‌గా ఎంపిక చేశారు. ఎలింగ్ అనంతరం జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు, విజయవాడ ఈస్ట్, వెస్ట్, సెంట్రల్ అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలన్నింటినీ ఈ స్ట్రాంగ్ రూమ్‌లోనే భద్రపరుస్తారు. అలాగే కౌంటింగ్ కేంద్రాలనూ ఎంపిక చేసింది. నగరానికి చెందిన సెంట్రల్, పశ్చిమతో పాటు తిరువూరు, నందిగామ నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్‌కు నోవా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీను ఎంపిక చేశారు. జగ్గయ్యపేట, విజయవాడ తూర్పునకు నిమ్రా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీని ఎంపిక చేశారు. మైలవరానికి నిమ్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ను ఎంపిక చేశారు. ఈ మూడు కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి జిల్లా యంత్రాంగం పంపించింది.

వాహనాల కోసం ప్రతిపాదనలు

ఎన్నికల అవసరాలకు కోసం కావాల్సిన వాహనాల ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేశారు. దాదాపు 1115 వాహనాలు అవసరమని ప్రతిపాదించింది. లైట్ మోటార్ వెహికల్స్ (ఎల్ఎంవీ) 851, హెవీ మోటార్ వెహికల్స్ (హెచ్ఎంవీ) 234 కావాలని నిర్ణయించింది. 2014లో ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 769 వాహనాలను వినియోగించారు. 2019లో 1055 వాహనాలను వినియోగించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఎన్నికలకు జిల్లాలో 1115 వాహనాలు అవసరమని నిర్ణయించింది. ఎల్ఎంవీ వాహనాల్లో కార్లు, వ్యాన్లు, క్యాబ్స్, హెవీ వాహనాల్లో బస్సులుంటాయి.

పిటిషన్ ఎస్‌హెచ్‌వోలకు చేరాల్సిందే

- ఆదేశాలు జారీ చేసిన డీసీపీ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

విజయవాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పోలీసు స్టేషన్లకు వచ్చే ప్రతి పిటిషన్ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ల దృష్టికి వెళ్లాల్సిందేనని పోలీసు కమిషనరేట్ ఆదేశాలు చేసింది. ఈ ఆదేశాలను ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసుస్టేషన్లకు పంపింది. ఆంధ్రజ్యోతిలో గత నెల 29న 'పిటిషన్ పరేషాన్' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై కమిషనరేట్ అధికారులు స్పందించారు. స్పందన ద్వారా వచ్చిన పిటిషన్లు, నేరుగా స్టేషన్లకు వచ్చే పిటిషన్లను స్వీకరించిన రైటర్లు వాటిని స్టేషన్ హౌస్ ఆఫీసర్ వద్దకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. పిటిషన్ ఏ స్థాయిది అయినా ఎస్‌హెచ్‌వోల దృష్టిలో పెట్టకుండా పరిష్కరించి పంపొద్దని తెలిపారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన రైటర్లు, సెక్టర్ ఎస్ఐలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనల మేరకు ఈవీఎంల వినియోగం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

ఆంధ్రజ్యోతి, విజయవాడ/గొల్లపూడి: ఎన్టీఆర్ జిల్లాలో త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలను చైతన్యవంతులను చేయడంతో పాటు ఎన్నికల అధికారులు సిబ్బందికి శిక్ష ఇచ్చేందుకు ఈసీఐ నిబంధనలు మార్గదర్శకాల మేరకు ఈవీఎంలను ఉపయోగిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు స్పష్టం చేశారు. మంగళవారం గొల్లపూడి ఈవీఎంల గోదామును సందర్శించి ప్రస్తుతం శిక్షణ ఇచ్చేందుకు వినియోగిస్తున్న ఈవీఎంలకు అదనంగా మరో మూడు ఈవీఎంలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆయన అధికారులకు అందించారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రణాళిక ప్రకారం జన జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నదాన విభాగంలో మొరాయించిన స్టౌవ్‌లు

వన్‌టౌన్: దుర్గగుడిలోని వంటశాలలో రెండు రోజులుగా 4స్టౌవ్‌లు పనియడంలేవు. దీంతో భక్తులకు అన్న ప్రసాద వితరణకు బాగా ఆలస్యమవుతోంది. స్టౌవ్‌లన్నీ పాతకాలం నాటివి కావడంతో మధ్యలో ఓవర్ హాలింగ్ చేయలేదు. మంగళవారం భోజనశాలకు ఉదయం 11.30 గంటలకు వండిన ఆహార పదార్థాలు చేరాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడం వల్ల ఇబ్బంది ఏర్పడింది. సిబ్బంది కూడా ప్రతి రోజూ సమయానికి భోజనం అందించకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థితో మాటాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

త్వరలో 1500 డీజిల్ బస్సులు, 1000 ఎలక్ట్రిక్ బస్సులు

- ఆర్టీసీ ఆసుపత్రుల అభివృద్ధి
- రూ.3.5 కోట్లతో మచిలీపట్నంలో అభివృద్ధి పనులు
- ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, చైర్మన్ మల్లికార్జునరెడ్డి

మచిలీపట్నం టౌన్, మార్చి 5: ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్తగా 1500 డీజిల్ బస్సులు, 1000 ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేస్తున్నామని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. మంగళవారం ఆయన ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, ఇతర అధికారులతో కలిసి బస్టాండ్‌లో చేపడుతున్న ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం అభివృద్ధి పనులు, ప్రయాణికుల సమస్యలపై సమీక్షించారు. అవసరమనుకుంటే కొత్తగా మరిన్ని హైర్ బస్సులు తీసుకుంటున్నామన్నారు. రాజమండ్రి, అనంతపురంలో ఆర్టీసీ ఆసుపత్రుల నిర్మాణాలు పూర్తయ్యాయని మచిలీపట్నం, తిరుపతి, నరసరావుపేట, చిత్తూరు, హిందుపురంలో డిస్పెన్సరీలకు భవనాలు నిర్మిస్తున్నామన్నారు. విద్యాధరపురం, కడపలో పూర్తిస్థాయిలో ఆసుపత్రులు ఉన్నాయన్నారు. 1297 మందికి కారుణ్య నియామకాలు జరిపామన్నారు. హనుమాన్‌జక్షన్ బస్టాండును అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆర్టీసీ చైర్మన్ రెడ్డి మాట్లాడుతూ, బందరు ఆర్టీసీ బస్టాండ్‌ను రూ.మూడున్నర కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. బంటుమిల్లి బస్టాండును రూ.40 లక్షలతో అభివృద్ధి చేస్తున్నామని, నెల రోజుల్లో పనులు పూర్తవుతాయన్నారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ పిన్నింటి మహేష్, జోనల్ ఈడీ కె శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్, జిల్లా రవాణా శాఖ అధికారి వాణిశ్రీ, డిపో మేనేజరు పెద్దిరాజులు పాల్గొన్నారు.

కొడాని నాని వ్యాఖ్యలు సిగ్గుచేటు

- టీడీపీ గుడివాడ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము

గుడివాడ, మార్చి 5: పవిత్రమైన సచివాలయాన్ని తాకట్టు పెడితే తప్పేంటని స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని అనడం సిగ్గుచేటని, ఇలాంటి మూర్ఖుడికి ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ రాజధాని అమరావతి గ్రాఫిక్స్ అని వాగిన జగన్‌రెడ్డి, నానిలాంటి వారికి ఎట్టకేలకు అమరావతి కనిపించిందన్నారు. అక్కడున్న సచివాలయాన్ని తాకట్టు పెట్టడం కన్నా దారుణమైన పని ఇంకోటి ఉండదన్నారు. వైసీపీ భూస్థాపితం ఖాయమన్నారు. గుడివాడ ప్రజలకు అవసరమైన వాటిపై శ్రద్ధ పెట్టని ఎమ్మెల్యే నాని జాతీయ, రాష్ట్ర రాజకీయాల గురించి మాట్లాడుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. పవన్ కల్యాణ్ అభిమానులపై శ్రద్ధ చూపిస్తున్నట్టు నటిస్తూ పవన్‌ను అనరాని మాటలను అంటున్నాడన్నారు. ప్రతిమాటకు పవన్ అభిమానులు, జనసైనికులు సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈసారి ఓటు అడగడానికి వస్తే నానిని ప్రజలు తన్ని తరిమేస్తారన్నారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు నాంచారయ్య

పొటోకాల్ పాటించలేదని వైసీపీ ఎంపీటీసీ ఆవేదన

కోడూరు, మార్చి 5: వైసీపీ నేతలు, స్థానిక అధికారులు ప్రొటోకాల్ పాటించటం లేదంటూ కోడూరు మండల వైసీపీ ఎంపీటీసీ తిమ్మన నాంచారయ్య ఆరోపించారు. మంగళవా రం 3వ సెగ్మెంట్ పరిధిలోని స్వతంత్రపురం ప్రభుత్వాసుపత్రి వద్ద బ్లాక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బా బు శంకుస్థాపన చేశారు. అందులో స్థానిక ఎంపీటీసీని అయిన నా పేరు పెట్టకుండా మిగిలిన వారి పేర్లు రాశారని ఆరోపించారు. దీనిపై స్థానిక అధికారులను నిలదీశారు. వైసీపీలో ఎంపీటీసీగా కొనసాగుతున్నా ప్రాధాన్యత, గౌరవం దక్కటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైభవంగా దుర్గానాగేశ్వరుని

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మోపిదేవి, మార్చి 5: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకళ్లేపల్లిలో కొలువైన శ్రీ దుర్గానాగేశ్వరస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభించారు. పర్యవేక్షకుడు బొప్పన సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఉదయం 11 గంటలకు శ్రీ స్వామిని పెండ్లి కుమారుడిని చేయటంతో కల్యాణ మహోత్సవాలు ప్రారంభం కాగా, ఆలయ అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లి రాజా వంశీయుల తరఫున శ్రీ స్వామి, అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలను పర్యవేక్షకుడు బొప్పన సత్యనారాయణ అర్చకులకు అందజేశారు. ప్రధాన అర్చకులు బుద్ధు వరప్రసాద్ ఆధ్వర్యంలో అర్చక బృందం శాస్త్రోక్తంగా స్వామిని పెండ్లి కుమారుడిని చేసే ఘట్టాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెండ్లి కుమారుడి మహోత్సవంలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఉద్యోగులు వెంకటరమణ, వెంకటేశ్వరరావు భక్తులకవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు

కీచక డాక్టర్‌పై కేసు నమోదు

విస్సన్నపేట, మార్చి 5: వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వైద్యుడు టి.సీతారామ్‌పై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి.రామకృష్ణ తెలిపారు. కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్‌కు చెందిన కనిగెంటి తిరుమల అనే మహిళ గర్భకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. విస్సన్నపేట మండలం తాతకుంట్లకు చెందిన తన సోదరి ద్వారా ఈనెల 2న విస్సన్నపేట కీర్తనా ప్రసూతి ఆసుపత్రిలో చేరి ఆపరేషన్ చేయించుకుంది. అనంతరం కొన్ని రోజులు ఆసుపత్రిలోనే ఉండి వైద్య సేవలు పొందాలని సదరు వైద్యుడు సూచించారు. ఈక్రమంలో పేషెంట్‌కు తోడుగా వచ్చిన ఆమె సోదరి పట్ల ఆ డాక్టర్ సోమవారం రాత్రి అసభ్యంగా ప్రవర్తించినట్టు బాధితురాలు కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో బంధువులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని డాక్టర్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకొని వైద్యుడ్ని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. సదరు వైద్యుడు ఖమ్మం జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది.



కొలికపూడి శ్రీనివాసరావు ఇంటివద్ద సీఐ అబ్దుల్ నబీ, పోలీసులు

'కొలికపూడి' హౌస్ అరెస్ట్

- పట్టణంలో ఉద్రిక్తత

తిరువూరు, మార్చి 5: మ్యానిఫెస్టోపై బహిరంగ చర్చకు సిద్ధమంటూ టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు సవాల్ చేసిన నేపథ్యంలో మంగళవారం ఉదయం ఆయన్ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఇటీవల వైసీపీ అభ్యర్థి టీడీపీపైన, ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోపైన విమర్శలు సందిస్తుండగా, కొలికపూడి అభివృద్ధిపైన, టీడీపీ, వైసీపీలు ప్రకటించిన మ్యానిఫెస్టోలపై బోసుబొమ్మ సెంటర్‌లో 5న బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సీఐ అబ్దుల్‌నబీ నేతృత్వంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది తెల్లవారుజాము నుంచే కొలికపూడి ఇంటిని ముట్టడించి బయటికి రానీయకుండా కట్టడి చేశారు. దీంతో నియోజకవర్గం పరిధిలోని నేతలు, కార్యకర్తలు కొలికపూడి ఇంటికి చేరుకున్నారు. బోసుబొమ్మ సెంటర్‌లో పోలీసు బందోబస్తు ఏర్పాటుతో పాటుగా వైసీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసును కూడా పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఇరుపార్టీల నేతల సవాళ్లతో పట్టణంలో తీవ్ర ద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా బోసుబొమ్మ సెంటర్‌లో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని మధ్యాహ్నం వరకు భయందోళనలు నెలకొన్నాయి. బోసుబొమ్మ సెంటర్‌కు ఎవరూ రాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

11న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

ఘంటసాల: మండల పరిధిలోని తాడేపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ ఈ నెల 11న సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు హాజరై విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని కమిటీ తెలిపింది. టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విరివిగా వచ్చి విజయవంతం చేయాలని కోరింది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

పోలీసుల స్ట్రీట్‌వాక్



పాయకాపురం, మార్చి 5 : ప్రజలు ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు శాఖ సమర్థవంతంగా పనిచేస్తోందని టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ శ్రీహరిబాబు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ వాంబేకాలనీలో మంగళవారం ఫ్లాగ్ మార్చ్ జరిగింది. ఏడీసీపీ శ్రీహరిబాబు, నార్త్‌జోన్ ఏసీపీ డీఎస్‌వీ. ప్రసాద్ కాలనీలోని వివిధ బ్లాక్‌ల్లో 200 మంది సిబ్బందితో స్ట్రీట్ వాక్ చేశారు. వివిధ బ్లాక్‌లలోకి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ప్రవర్తించినా తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సీఐలు దుర్గాప్రసాద్, గురుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తులు తాకట్టు పెట్టి పరువు తీస్తున్న జగన్

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శ

పటమట, మార్చి 5 : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆస్తులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి ఆంధ్రప్రదేశ్ పరువు తీస్తున్నారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విమర్శించారు. 10వ డివిజన్ మారుతీ కో-ఆపరేటివ్ కాలనీ అక్కినేని పూర్ణచంద్రమోహన్ పార్కు నుంచి టీడీపీ-జనసేన పార్టీల అభ్యర్థి గద్దె గద్దె రామ్మోహన్, స్థానిక కార్పొరేటర్ దేవినేని అపర్ణ, జాస్తి సాంబశివరావులతో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ రాష్ట్ర సచివాలయాన్ని జగన్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.370 కోట్లు అప్పు తీసుకుని రాష్ట్ర పరువును బజారులో పెట్టారని ఆరోపించారు. విశాఖపట్నంలో 13 ప్రభుత్వం ఆస్తులను తాకట్టు పెట్టి రూ.25వేల కోట్లు అప్పులను తీసుకున్నారని, మద్యం పథకాన్ని తాకట్టు పెట్టి రూ.48వేల కోట్లు ఈ విధంగా ప్రభుత్వ ఆస్తులను తాకట్టుపెట్టి పరిపాలన చేయడం జగన్‌మోహన్‌రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శమన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే టీడీపీ-జనసేన బలపర్చిన ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీగా కేశినేని చిన్నిలను అత్యధిక మెజారిటీలతో గెలిపించాలన్నారు. డివిజన్ అధ్యక్షుడు పాలగాని జగన్‌మోహన్‌రావు, మన్నే జయప్రకాష్, మండవ నాగేశ్వరరావు, కె.హరిబాబు, కె.సురేంద్ర. పి.శివరామకృష్ణ పాల్గొన్నారు.



10వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న గద్దె రామ్మోహన్, దేవినేని అపర్ణ

జగన్ పాలనలో

జనజీవనం అస్తవ్యస్తం: గద్దె అనురాధ

ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు రాక ప్రభుత్వ ఉద్యోగులు, తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు, సరైన జీవనోపాధి లేక కార్మికులు ఇలా ప్రతి వర్గం జగన్‌రెడ్డి పాలనలో అవస్థలు పడుతున్నారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. అయ్యప్పనగర్‌లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జనసేన-టీడీపీ బలపర్చిన అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని చిన్నిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, శాయన బుజ్జి, అబ్దుల్ ఖలీమ్, మాదాల చిన్నతల్లి, రాజకుమారి, తెనాలి అరుణలు పాల్గొన్నారు.

లబ్బీపేట: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం టీడీపీ ద్వారానే సాధ్యమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తనయుడు గద్దె క్రాంతి అన్నారు. మంగళవారం లబ్బీపేట 19వ డివిజన్‌లోని మసీదురోడ్డు, కాపు కల్యాణమండపం రోడ్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థిగా గద్దె రామ్మోహన్‌కు, పార్లమెంట్ అభ్యర్థిగా కేశినేని చిన్ని గెలిపించాల్సిందిగా కోరారు. ఎస్.ఫీరోజ్ పాల్గొన్నారు.





పశ్చిమ నుంచి , రాణిగారితోట నుంచి బైక్ ర్యాలీగా తరలిన టీడీపీ-జనసేన శ్రేణులు

జయహో బీసీకి తరలిన టీడీపీ-జనసేన శ్రేణులు

వన్‌టౌన్, మార్చి 5: నాగార్జున యూనివర్సిటీలో టీడీపీ-జనసేన సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జయహో బీసీ కార్యక్రమానికి పశ్చిమ నుంచి టీడీపీ-జనసేన శ్రేణులు భారీగా తరలివెళ్లారు. 40వ డివిజన్ అధ్యక్షుడు పొనుగుపాటి సుబ్బయ్య ఆధ్వర్యంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక బస్సులో తరలివెళ్లారు. ఇదే తరహాలో ఆయా డివిజన్ నాయకుల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. టీడీపీ నాయకులు బుద్దా వెంకన్న, నాగుల్ మీరాల ఆధ్వర్యంలో, జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

లబ్బీపేట: జయహో బీసీ సభకు తూర్పు నుంచి గద్దె రామ్మోహన్ నాయకత్వంలో కొక్కెర తిరుపతయ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టీడీపీ- జనసేన పార్టీ శ్రేణులు రాణిగారితోట నుంచి బైక్ ర్యాలీగా తరలి వెళ్ళారు. ఈ ర్యాలీ రాణిగారితోట, కృష్ణలంక ప్రాంతాల్లో జరిగింది. 18వ డివిజన్ రాణిగారితోట నుంచి టీడీపీ శ్రేణులు తరలి వెళ్ళారు. డివిజన్ అధ్యక్షుడు దుర్గారావు, పీరుబాబు పాల్గొన్నారు.



బైక్‌లపై ర్యాలీగా వెళుతున్న తెలుగు యువత నాయకులు

తెలుగు యువత బైక్ ర్యాలీ

చిట్టినగర్: జయహో బీసీ గర్జన సభ విజయవంతం చేయాలని మంగళవారం పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ్ చిట్టినగర్ పరిసరాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్‌లపై చిట్టినగర్ నుంచి ర్యాలీగా వెళ్లారు.ధనేకుల హరికృష్ణ, మక్కిన భాస్కర్, పిళ్లాసాయి కిరణ్, సాయికృష్ణ, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

తెలుగు యువత జిల్లా కార్యదర్శి కోటికి అభినందనలు

గవర్నర్‌పేట, మార్చి 5: జిల్లా తెలుగు యువత కార్యదర్శిగా నియమితుడైన 23వ డివిజన్‌కు చెందిన కటిక వెంకట కోటేశ్వరరావు (కోటి) అభినందన కార్యక్రమం మంగళవారం సూర్యారావుపేట టీడీపీ డివిజన్ కార్యాలయంలో జరిగింది. కోటికి డివిజన్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. టీడీపీ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతా దుర్గారావు, ఆలపాటి రాము, డివిజన్ శ్రేణులు రత్న, కొండా, హనుమంతరాఆవు, మల్లికార్జునరావులు తెలుగు యువత బాధ్యతలు తీసుకుని కోటికి అభినందనలు తలిపారు.

శ్లాబ్ నిర్మాణానికి ఐరన్ వితరణ

విజయవాడ కల్చరల్, మార్చి 5: సింగ్‌నగర్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శివాలయ నిర్మాణానికి ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ మంగళవారం ఆలయ కమిటీకి ఐరన్‌ను కానుకగా అందించారు. కమిటీ అధ్యక్షులు డి.పున్నారావు, సెక్రటరీ కాళిదాసు, డి.శ్రీనుబాబు, తిరుమలకొండ శ్రీను, డి.శ్రీను, ఆర్.రాజు, టి.రాజేశ్వరరావు, టి.కాళికా వరప్రసాద్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో కమిషనర్ సమీక్ష

చిట్టినగర్, మార్చి 5: సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీలతో మంగళవారం సెంట్రల్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, కమిషనర్ స్వప్నిల్ దినకర్ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో తన చాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత సెంట్రల్‌లో పలు పోలింగ్ బూత్‌ల పేర్లలో స్వల్ప సవరణలపై రాజకీయ పార్టీలతో మాట్లాడారు. సుమారు 26 పోలింగ్ కేంద్రాల పేర్ల సవరణకు సంబంధించిన అంశంపై రాజకీయ ప్రతినిధులు తమ ఆమోదాన్ని తెలిపారు. టీడీపీ ప్రతినిధి నవనీతం సాంబశివరావు, వైసీపీ నేత సుందర్‌పాల్, సీపీఐ నేత వీరభద్రరావు, కాంగ్రెస్ అన్సార్, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించండి

లబ్బీపేట, మార్చి 5: రాబోయే ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలందరూ బీజేపీని ఓడించాలని తూర్పు డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జ్ షేక్ అబ్దుల్ అన్సారి పిలుపునిచ్చారు. మంగళవారం లబ్బీపేటలోని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సుభాని, స్థానిక ముస్లిం పెద్దలను కలిసిన కాంగ్రెస్ నాయకులు బీజేపీని ఓడించాలని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రహీమ్, ఏపీసీసీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ జూనీద్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి ట్రస్ట్‌బోర్డుకు మరో ఇద్దరు సభ్యుల నియామకం

వన్‌టౌన్, మార్చి 5: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డులో మరో ఇద్దరిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాధరపురానికి చెందిన అమలాపురపు రామలక్ష్మిని సభ్యురాలిగా నియమించారు. భవానీపురానికి చెందిన అల్లం భువనకుమార్‌ను ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించారు.

వంద మంది టీడీపీలో చేరిక

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 5 : 60వ డివిజన్ వాంబేకాలనీలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, అభిమానులు 100 మంది మంగళవారం టీడీపీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బొండా ఉమా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నేతలు కంచి ధనశేఖర్, ఘంటా కృష్ణమోహన్ తదితరులు

మర్యాదపూర్వక కలయిక

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావును అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో టీడీపీ నాయి బ్రాహ్మణ సాధికార కమిటీ నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బొండా ఉమాకు టీడీపీ నాయిబ్రాహ్మణ సాధికార కమిటీ పార్లమెంట్ అధ్యక్షుడు సూరవరపు నాగరాజు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈనెల 12న షాదీఖానాలో నిర్వహించనున్న నాయిబ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమావేశానికి రావాలని ఆహ్వానించారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బొండా ఉమా

ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు హామీ ఇచ్చారు. ఆర్ఎంపీ అసోషియేషన్ ఆత్మీయ సమావేశం అజిత్‌సింగ్‌నగర్‌లోని గుజ్జల సరళాదేవి కల్యాణమండపంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీ అసోషియేషన్ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మునిలక్ష్మిపై దాడిని ఖండిస్తూ నిరసన

ధర్నాచౌక్, మార్చి 5: జై భారత్ నేషనల్ పార్టీ తిరుపతి అసెంబ్లీ అభ్యర్థి మునిలక్ష్మిపై దాడిని ఆ పార్టీ నేతలు తీవ్రంగా ఖండించారు. నెల్లూరు మునిలక్ష్మిపై హత్యాయత్నాన్ని ఖండిస్తూ స్థానిక ప్రెస్‌క్లబ్ వద్ద మంగళవారం నిరసన నిర్వహించారు. మునిలక్ష్మిపై దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పోతిన వెంకట రామారావు మాట్లాడుతూ నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బీవీ అరుణ, నాగలక్ష్మి, వసుంధర, కొడాలి ఏకాంబరం, పి.రవికిరణ్, దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆడిటోరియంలో మహిళా ఉద్యోగులకు వైద్యశిబిరం

రైల్వేస్టేషన్, మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడ రైల్వే ఆడిటోరియంలో మంగళవారం మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భాశయ కేన్సర్ స్క్రీనింగ్, పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 70 మంది మహిళా ఉద్యోగులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అడిషనల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.జయదీప్, అదనపు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (పరిపాలన) డాక్టర్ ఎల్.రవికాంత్‌లు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అమెరికన్ అంకాలజీ డాక్టర్ అనిల్ పాటిబండ్ల, కార్డియాలజిస్ట్ డాక్టర్ పృథ్వీ, శ్రీనివాస్, గైనకాలజిస్ట్ సుజని తదితరుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇదే సమయంలో జాక్ అండ్ జిల్ పాఠశాలలో మహిళా ఉద్యోగుల కోసం వికసిత్ భారత్, వికసిత్ రైల్-2047లో మహిళలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు, పోస్టర్ మేకింగ్, స్కెచ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎస్ఆర్‌డీపీవో ఆనంద్‌కర్త మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి వాక్‌థాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హోసన్న వార్షిక సమ్మేళనానికి ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, మార్చి 5: గుంటూరు జిల్లా గోరంట్లలో ఈ నెల 7 నుంచి 10 వరకు హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరగనున్న 47వ వార్షిక సమ్మేళనానికి దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ మేరకు విజయవాడ డివిజన్ పీఆర్‌ఓ నుస్రత్ ఎం మండ్రూప్కర్ మంగళవారం ఒక ప్రకటనలో రైళ్ల వివరాలను తెలిపారు. అనకాపల్లి-గుంటూరు మధ్య ఈ రైళ్లు నడవనున్నాయి. 6వ తేదీ సాయంత్రం 7.40కి అనకాపల్లిలో రైలు బయలుదేరి తుని, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకువీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు(గోరంట్ల)లో రైలు ఆగుతుందని తెలిపారు. తిరిగి గుంటూరు నుంచి ఉదయం 8.10 గంటలకు బయలుదేరి అనకాపల్లి వద్దకు అదే రూట్‌లో రైలు నడుస్తుందని తెలిపారు.

నాఫ్కాబ్ డైరెక్టర్‌గా చలసాని రాఘవేంద్రరావు

కృష్ణలంక, మార్చి 5 : అర్బన్ బ్యాంకులు, క్రెడిట్ సొసైటీల జాతీయ సమాఖ్య (నాఫ్కాబ్) డైరెక్టర్‌గా విశాఖపట్నం కో- ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ఎన్నికయ్యారు. న్యూ ఢిల్లీలోని నేషనల్ కో- ఆపరేటివ్ యూనియన్ ఆడిటోరియంలో జరిగిన ఎన్నికల్లో మొత్తం పోలైన 222 ఓట్లకు 211 ఓట్లతో గెలుపొందారు. మొత్తం 21 స్థానాలకు అర్బన్ బ్యాంకులకు కేటాయించిన 7 స్థానాలకు ఎన్నిక జరిగింది. ఈ నియోజకవర్గంలో దేశంలోని అన్ని రాష్ట్రాల అర్బన్ బ్యాంకుల ప్రతినిధులు ఓటుహక్కును వినియోగించుకొన్నారు. అభ్యర్థులకు లభించిన ఓట్లలో రాఘవేంద్రరరావు రెండో స్థానంలో నిలవడం ఆయనకు లభించిన గౌరవం. ఈ సందర్భంగా ఈనెల 9న గవర్నరుపేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో ఉదయం 10 గంటలకు ఆయనకు అభినందన సభ ఏర్పాటు చేశారు.

8న ఉచిత చికిత్స శిబిరం

ధర్నాచౌక్, మార్చి 5: మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 8న మోకాళ్ల నొప్పులపై ఉచిత అవగాహన, చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు యోగశక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కానూరు అశోక్‌నగర్‌లోని ఇండియన్ ఓం కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు 90003 47369 నంబర్‌ను సంప్రదించి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు.

విజ్జీ ట్రోఫీకి ఎంపికైన నలంద క్రికెటర్లకు సత్కారం



విజయవాడ స్పోర్ట్స్, మార్చి 5: బీసీసీఐ విజ్జీ ట్రోఫీ 2023-24 క్రికెట్ టోర్నీకి ఎంపికైన విజయవాడ నలంద డిగ్రీ కళాశాలలో బీబీఏ మూడో సంవత్సరం చదువుతున్న ఎం.శుశాంత్ నాయుడు, బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న జి. చంటిలను కళాశాల యాజమాన్యం మంగళవారం ఘనంగా సత్కరించింది. ప్రముఖ వ్యాపారవేత్త, బీసీసీఐ మాజీ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు వీరిద్దరినీ అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ ఇద్దరూ విజ్జీ ట్రోఫీకి ఎంపికవ్వడం ఇది రెండోసారన్నారు. నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు మాట్లాడుతూ తమ కళాశాల స్పోర్ట్స్ విభాగంలోని విద్యార్థులకు ఫీజుల రాయితీ విషయంలో అండగా ఉంటామన్నారు. శుశాంత్ నాయుడు, చంటిలను మెమెంటో, దుశ్సాలువాలుతో సత్కరించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పార్టీ బలంగా ఉన్న స్థానాల్లో పోటీ చేస్తాం

• ఆప్ రాష్ట్ర అధ్యక్షుడు శీర రమేష్

ధర్నాచౌక్, మార్చి 5: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో తమ పార్టీ బలంగా ఉన్న అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తామని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శీర రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి, విశాఖపట్నం, అరకు, ఏలూరు, విజయవాడ, కడప, అనకాపల్లి పార్లమెంట్ స్థానాలతో పాటు 50 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తామన్నారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు.

దళిత, గిరిజనులపై పెరిగిన దాడులు

ధర్నాచౌక్, మార్చి 5: రాష్ట్రంలో దళిత, గిరిజనులపై దాడులు, హత్యలు, అక్రమ కేసులు పెరిగాయని మన రామరాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.కేఎస్.ధనేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ప్రజా సోషలిస్టు కూటమి అభ్యర్థులు పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తారన్నారు. ఈ నెల 9న నందిగామలో జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇండియన్ ప్రజాకాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ కె.రమేష్, విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి లాం జైబాబు, హనుమంతరావు, ప్రజా సోషలిస్టు కూటమి రాష్ట్ర కార్యదర్శి వెంకట్రావ్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాజ్యమేలుతున్న ఇసుక మాఫియా

• పోతిన మహేశ్



చిట్టినగర్, మార్చి 5: జగన్ అవినీతి పాలనలో ఇసుక మాఫియా రాజ్యమేలుతుందని జనసేన నగర అధ్యక్షుడు, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ విమర్శించారు. ఇంటింటి రాబోయే మన జనసేన- టీడీపీ ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం 49వ డివిజన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో ఇసుక మాఫియా విపరీతంగా పెరిగిపోయిందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఇసుక లేక పనులు ఆగి పోయాయన్నారు. ట్రాక్టర్ ఇసుక రూ. 1300 ఉండేదని, ప్రస్తుతం రూ. 7000 అయిందని, భవన నిర్మాణాలు పూర్తిగా ఆగిపోయాయన్నారు. జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆర్యకటిక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

వన్‌టౌన్: ఆర్యకటిక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆర్యకటిక నాయకులు మంగళవారం జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనసేన-టీడీపీ ప్రభుత్వంలో ఆర్యకటిక సామాజిక వర్గానికి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఆర్యకటిక సామాజిక వర్గం వారినే పదవులలో నియమించాలని కోరారు.

• వైసీపీకి రాజీనామా చేసిన బుద్దా దివాకర్ మంగళవారం జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయనకు దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ తాను జనసేనలో చేరి పవన్‌కల్యాణ్ కోసం పనిచేస్తానని తెలిపారు. అడపా చిన్న, నారాయణ పాల్గొన్నారు.

• పోతిన మహేశ్‌కు టీడీపీ నాయకులు పలువురు సంఘీభావం తెలిపారు. పార్టీ నాయకులు అమర్‌బాబు, పాల్వాయి దాసులు మంగళవారం జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్‌ను కలిసి ఆయనకు దుశ్శాలువా కప్పి సత్కరించారు.

కాల్వల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలి

వన్‌టౌన్, మార్చి 5: కాల్వల్లో, రోడ్లపై చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవ్ అప్పాజీరావు సంబంధిత కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన కార్పొరేషన్ హెల్త్ విభాగం, ఇంజనీరింగ్ విభాగం తదితర అధికారులతో కలిసి గాంధీహిల్ అవుట్‌ఫాల్ డ్రెయిన్, జెండా చెట్టు వద్ద ఉన్న డ్రెయిన్, గణపతిరావు రోడ్డులోని కృష్ణవేణి క్లాత్‌మార్కెట్ వద్ద ఉన్న డ్రెయిన్‌ను పరిశీలించారు. ఎప్పటికప్పుడు కాల్వల్లో ఉన్న చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించాలని ఆయన అధికారులకు సూచించారు. సర్కిల్-1 జోనల్ కమిషనర్ కీర్తన, ఏఎంవోహెచ్ సురేష్, ప్రాజెక్ట్ ఏఈ బూసిరెడ్డి, ఇంజనీరింగ్ ఏఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దుర్గారావు, గుర్రం శ్రీను, జానకీ రామ్ పాల్గొన్నారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

విద్యాధరపురం, మార్చి 5: తన కుమార్తె కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు మేరకు మంగళవారం భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం భవానీపురం అవుట్‌ఏజెన్సీ కరకట్ట ప్రాంతానికి చెందిన బాలిక తల్లి, ఇద్దరు సోదరులతో ఉంటుంది. బాలిక ఇటీవల పండు అనే యువకుడితో తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ ఉండడంతో తల్లి మందలించింది. సోమవారం ఉదయం తల్లి పనికి వెళ్ళింది. సాయంత్రం 7 గంటలకు వచ్చి చూడగా బాలిక కనిపించలేదు. చుట్టూపక్కల, బంధువుల, స్నేహితుల వద్ద వెతికినప్పటికి బాలిక ఆచూకీ లభించలేదు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 6 మార్చి 2024
cinema@andhrajyothy.com



ఒక రోజు పర్యటన నిమిత్తం సోమవారం సాయంత్రం చెన్నై వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీతో సీనియర్ నటి, నృత్య కళాకారిణి వైజయంతి మాల భేటీ అయ్యారు. ఈ విషయాన్ని తన ఎక్స్ ఖాతాలో పొందుపరుస్తూ వైజయంతి మాల భారతీయ చలనచిత్రసీమకు అందించిన సేవలు అజరామరం అని, ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఆమె సేవలను గుర్తించి అత్యున్నతమైన పద్మవిభూషణ్ అవార్డును ప్రకటించిందని ప్రధాని మోది పేర్కొన్నారు.

సలార్ 2 షూటింగ్ ఎప్పుడంటే..?



'సలార్' మూవీతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కారు ప్రభాస్. ఈ మూవీకి సీక్వెల్‌గా తెరకెక్కబోతోన్న 'శౌర్యాంగ పర్వం'పై భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా, పార్ట్-1లో భారవి పాత్రలో నటించిన నేషనల్ అవార్డ్ విన్నర్, నటుడు బాబీ సింహా ఈ చిత్రంపై అప్‌డేట్ ఇచ్చారు. షూటింగ్ ఏప్రిల్‌లో ప్రారంభం కానుందని మీడియాకు తెలిపారు. మరోవైపు కొద్దిరోజుల క్రితమే ఈ సీక్వెల్ గురించి నిర్మాత విజయ కిరగందూర్ మాట్లాడారు. పార్ట్-2 స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని తెలిపారు. మొదటి భాగానికి దక్కిన ఆదరణ పట్ల ఎంతో సంతృప్తిగా ఉన్నామని అన్నారు. 'శౌర్యాంగ పర్వం' హాలీవుడ్ సిరీస్ 'గేమ్ ఆఫ్ థ్రోన్స్'ను పోలి ఉంటుందంటూ వెల్లడించి పార్ట్-2పై అందరిలోనూ ఆసక్తిని రెట్టింపు చేశారు. కాగా, ప్రశాంత్ నీల్ దర్శకత్వంతో తెరకెక్కిన 'సలార్ పార్ట్-1' గతేడాది డిసెంబర్ 22న విడుదలై వసూళ్ల ప్రభంజనం సృష్టించింది. ఇప్పటివరకూ ఎవరూ చూపించని విధంగా ప్రభాస్‌ను సరికొత్త యాక్షన్ అవతార్‌లో చూపించారని ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అయ్యారు. 'సలార్' రిలీజ్ సమయానికే పార్ట్-2 షూటింగ్ 40 శాతం పూర్తైంది. మిగిలిన వర్క్ పూర్తి చేసి, 2025లో విడుదల చేయడానికి మేకర్స్ ప్రయత్నిస్తున్నారు.

వార్-2లో ఎన్టీఆర్ పాత్రపై క్లారిటీ..!



'ఆర్‌ఆర్‌ఆర్'తో పాన్‌ఇండియా స్టార్‌గా ఎదిగారు జూనియర్ ఎన్టీఆర్. ప్రస్తుతం ఆయన వరుస పాన్‌ఇండియా ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. దేవర చిత్రం సెట్స్‌పై ఉండగానే బాలీవుడ్ చిత్రం వార్-2కు సైన్ చేశారు. యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో ఆయన నటిస్తున్నారనే అధికారక ప్రకటన కొన్నాళ్ల క్రితమే వెలువడింది. తాజాగా, ఈ చిత్రంలో ఎన్టీఆర్ పోషించే పాత్రపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఇందులో భారతీయ రా ఏజెంట్‌గా ఎన్టీఆర్ నటిస్తున్నారని నిర్మాత ఆదిత్య చోప్రా వెల్లడించారు. అంతేకాక ఎన్టీఆర్ అభిమానులు పండుగ చేసుకునేలా మరో తీపి కబురును కూడా నిర్మాత ఆదిత్య చోప్రా అందించారు. ఎన్టీఆర్ పాత్ర కేవలం ఈ సినిమాకు మాత్రమే పరిమితం కాలేదని..ఆ పాత్రను కొనసాగిస్తూ ఈ స్పై యూనివర్స్‌లోనే మరో ప్రత్యేక చిత్రాన్ని తీర్చిదిద్దే ఆలోచన ఉందని అన్నారు. ఈ స్పై యూనివర్స్ ఫ్రాంఛైజీలో తెరకెక్కే మరిన్ని చిత్రాల్లో ఎన్టీఆర్ అతిథిగా మెరవనున్నారు అని నిర్మాత ప్రకటించారు. కాగా, ఈ సినిమాలో హృతిక్ రోషన్‌తో కలిసి ఎన్టీఆర్ నటించనున్నారు. 'బ్రహ్మాస్త్ర' ఫేం అయాన్ ముఖర్జీ ఈ సినిమాకు దర్శకుడు. వచ్చే ఏడాది ఆగస్టులో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయ్యటానికి చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.

పోలీస్ కథల్లో విభిన్నం భీమ



'భీమ' కమర్షియల్ ప్యాక్డ్ మూవీ. నా పాత్రలో ప్రేమ, ఎమోషన్స్, రొమాన్స్.. ఇలా అన్ని అంశాలూ ఉంటాయి. సినిమా చూసి బయటకు వచ్చిన తర్వాత నా పాత్ర ప్రేక్షకుడి మనసులో నిలిచిపోతుందనే నమ్మకం ఉంది. ఈ కథలోని సెమీ ఫాంటసీ ఎలిమెంట్‌ను దర్శకుడు హర్ష చాలా అద్భుతంగా చూపించారు. ప్రతి యాక్షన్ సీన్‌లో ఎమోషన్ ఉంది. అది ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు హీరో గోపీచంద్. ఆయన హీరోగా నటించిన 'భీమ' చిత్రం ఈనెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలు పంచుకున్నారు.

● 'భీమ' జర్నీ ఎలా మొదలైందో చెబుతూ 'ఈ చిత్ర సహనిర్మాత శ్రీధర్ కోవిడ్ సమయంలో దర్శకుడు హర్షను పరిచయం చేశారు. ఆయన ఒక కథ చెప్పారు కానీ అలాంటి సమయంలో వద్దనిపించింది. అందుకే పోలీసుకి సంబంధించి ఏదైనా విభిన్నమైన కథ ఉంటే చెప్పమన్నా. ఎనిమిది నెలలు గ్యాప్ తీసుకుని ఈ కథ చెప్పారు. హీరో పాత్ర పేరు భీమ. ఈ కథకు అదే పేరు యాప్ట్ కనుక టైటిల్‌గా నిర్ణయించాం. భీమ క్యారెక్టరైజేషన్ నచ్చి అంగీకరించా' అన్నారు.

● తమ సినిమాకీ, 'అఖండ' చిత్రానికీ పోలికలు లేవని అని స్పష్టం చేశారు. 'అఘోరాలు, కలర్ ప్యాట్రన్, మ్యూజిక్ వల్ల అలా అనిపించి ఉండవచ్చు. కానీ 'భీమ' పూర్తిగా డిఫరెంట్ స్టోరీ. అయినా 'అఖండ'తో పోలిస్తే మంచిదేగా' అని నవ్వేశారు గోపీచంద్.

● తన కొత్త సినిమాల గురించి చెబుతూ 'శ్రీను వైట్ల దర్శకత్వంలో చేస్తున్న సినిమా 30 శాతం పూర్తయింది. ప్రసాద్‌గారితో ఒక సినిమా ఉంటుంది. అలాగే యూవీ క్రియేషన్స్‌లో చేయబోయే చిత్రానికి కథ తయారవుతోంది' అన్నారు గోపీచంద్.

కంటెంట్ ఉన్న చిత్రాలకు ఆదరణ ఉంటుంది



చదలవాడ శ్రీనివాసరావు

'కంటెంట్ ఉంటే ఏ సినిమా అయినా ప్రేక్షకులు ఆదరిస్తారు. నేను అందించిన 'బిచ్చగాడు' చిత్రంతో అది మరోసారి రుజువైంది. అందుకే ప్రజలకు మనసుకి హత్తుకొనే విధంగా, వాస్తవానికి దగ్గరగా 'రికార్డ్ బ్రేక్' చిత్రాన్ని తీశాను. కథ మీద నమ్మకంతో చాలా డబ్బు ఖర్చు పెట్టి తీసిన ఈ సినిమా ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుంది' అన్నారు సీనియర్ నిర్మాత శ్రీనివాసరావు. 'హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామయ్య' చిత్రం తర్వాత ఆయన మళ్లీ దర్శకత్వం వహించిన 'రికార్డ్ బ్రేక్' చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 'ట్రైలర్ రిలీజ్ అయినప్పుడు ఎటువంటి రెస్పాన్స్ వచ్చిందో ఈ సినిమాను అందరికీ చూపించినప్పుడు అదే స్పందన వచ్చింది. ప్రీవ్యూ సమయంలో సినీ ప్రముఖులు ఇచ్చిన సూచనల మేరకు సినిమాను కొంత ట్రిమ్ చేశాం. దీని వల్ల సినిమాకు మరింత అందం వచ్చింది. ఈ సినిమాకు 'రికార్డ్ బ్రేక్' టైటిల్ యాప్ట్ అని అందరూ చెబుతున్నారు' అని ఆయన అన్నారు. 'ప్రస్తుతం ఉన్న హీరోలలో ఇటువంటి భారీ కాయం ఉన్న వారెవరూ లేరు. అందుకే కొత్త వారిని ఎన్నుకొని ఈ సినిమా తీశాం. సినిమాకు ఎంత అవసరమో అంత ఖర్చు పెట్టాం. అలాగే విజువల్ ఎఫెక్ట్ విషయంలోనూ రాజీ పడలేదు' అని చెప్పారు శ్రీనివాసరావు. 'హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామయ్య' చిత్రం కొన్ని కేంద్రాల్లో బాగా ఆడినా, అప్పుడు వచ్చిన పెద్ద సినిమాలతో పోటీ పడలేకపోయింది. 'రికార్డ్ బ్రేక్' చిత్రం మాత్రం కచ్చితంగా అందరినీ అలరిస్తుంది. మంచి సినిమాగా నిలుస్తుంది. 'బిచ్చగాడు' చిత్రంలో హీరో తల్లి కోసం కష్టపడతాడు. 'రికార్డ్ బ్రేక్'లో బిడ్డల కోసం తల్లి ఏం చేసింది అని చెబుతున్నాం. పతాక సన్నివేశాలు అందరినీ ఆకట్టుకుంటాయి' అని చెప్పారాయన. 'నాకు ఎక్కువ థియేటర్లు అందుబాటులో ఉన్నా 'బిచ్చగాడు' సినిమాలా మొదట కొన్ని థియేటర్లలోనే విడుదల చేస్తున్నాం. ప్రేక్షకుల స్పందనను బట్టి థియేటర్ల సంఖ్య పెంచుతాం' అని చెప్పారు శ్రీనివాసరావు. 'రికార్డ్‌బ్రేక్' చిత్రాన్ని చూసి ప్రేక్షకులు తనకు పాస్ మార్కులు వేస్తే హాలీవుడ్ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ చిత్రాన్ని అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్‌తో తీస్తానని చదలవాడ శ్రీనివాసరావు ప్రకటించారు.

గామి.. కొత్త ప్రయత్నం



దర్శకుడు విద్యాధర్

విశ్వక్‌సేన్, చాందినీ చౌదరి జంటగా నటించిన 'గామి' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు విద్యాధర్ కాగిత మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 'హిమాలయ పర్వతాలు, మంచు శిఖరాలు, అక్కడికి ప్రయాణించడం అంటే నాకు ఇష్టం. అలాగే విఠలాచార్యగారి జానపద చిత్రాలు అంటే అభిమానం. ఇవన్నీ కలసి ఓ ఆలోచనగా మారి, కథారూపం ఏర్పడ్డాయి. క్రౌడ్ ఫండ్ కోసం ఒక పిచ్ వీడియో తయారు చేశాం. దాని ద్వారా వచ్చిన డబ్బుతో చిత్ర నిర్మాణం ప్రారంభించాం. మా సినిమా గ్లింప్స్ చూసి యూవీ క్రియేషన్స్ వారు సపోర్ట్ ఇవ్వడానికి ముందుకు వచ్చారు. హీరో విశ్వక్‌సేన్‌కు అప్పుడు సినిమాలు లేవు. ఆడిషన్స్ చేసి ఎంపిక చేశాం. చాలా ఓపెన్ మైండ్‌తో తను ఈ ప్రాజెక్ట్‌లో బాగా ఇన్‌వాల్వ్ అయ్యారు.' అని చెప్పారు. చిత్ర నిర్మాణానికి ఐదేళ్లు పట్టడానికి కారణాల్ని వివరిస్తూ 'ప్రేక్షకులకు కొత్తగా చెప్పాలనుకున్నాం కనుక ఎక్కువ పట్టిందనే భావన లేదు. విజువల్స్, మ్యూజిక్, టెక్నికల్ పరంగా కొత్తగా ప్రయత్నించాం.. ట్రైలర్ లో చూపించినట్లు సినిమాలో పాత్రలన్నీ ఆసక్తికరంగా సాగుతాయి. సినిమా అంతా ఎంగేజింగ్‌గా ఉంటుంది. ముందు ఏం జరగబోతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో కలిగిస్తుంది. యూవీ క్రియేషన్స్ వారు ప్రాజెక్ట్‌లో ఇన్‌వాల్వ్ అయిన తర్వాత ఫైనాన్షియల్ ఫ్రీడమ్ వచ్చింది. బిగ్గర్ స్కేల్‌లో పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చేసుకోవడానికి వారు అవకాశం ఇచ్చారు' అని తెలిపారు.



పుష్ప రాజే నా రోల్ మోడల్

గ్లామర్ రోల్స్‌లో మెప్పిస్తూనే మరోవైపు నటనకు ఆస్కారమున్న పాత్రలనూ ఎంచుకుంటుంటారు అగ్ర కథానాయిక సమంత. ఇటీవలే మయోసైటిస్ అనే వ్యాధి నుంచి కోలుకుని సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిందీ భామ. తాజాగా, ఓ కాలేజి ఫంక్షన్‌లో పాల్గొన్న సమంత అక్కడి విద్యార్థులు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చింది. అందులో ఒక విద్యార్థి 'నటనలో మీకు రోల్ మోడల్ ఎవరు' అని ప్రశ్నిస్తే, ఆమె తడుముకోకుండా అల్లు అర్జున్ అని తెలిపింది. ఒక సినిమా నుంచి మరో సినిమాకు అల్లు అర్జున్ ఎంతో పరిణితి చెందుతూ యాక్టింగ్ బీస్ట్‌గా మారారని ప్రశంసించింది. ఆయనతో కలసి తెరను పంచుకోవడం ఎంతో సవాలుతో కూడుకున్న విషయమని, అందుకోసమే మళ్లీ తనతో నటించే చాన్సు కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నానంది. ఈ మాటలు విన్న స్టైలిష్ స్టార్ అభిమానులు ఆనందంలో మునిగితేలుతున్నారు. వీళ్లిద్దరూ కలసి 'సన్ ఆఫ్ సత్యమూర్తి' చిత్రంలో నటించారు. ఆ తర్వాత అల్లు అర్జున్ నటించిన 'పుష్ప' చిత్రంలోని ఓ ఐటెమ్ సాంగ్‌లో మెరిసిందీ బ్యూటీ. ప్రస్తుతం సిటాడెల్, చెన్నై స్టోరీస్‌తో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమవుతోంది సమంత.

రెండు కుటుంబాల మధ్య జరిగే కథ



రవితేజ నున్నా, నేహా జురెల్ జంటగా నటించిన 'రాజుగారి అమ్మాయి.. నాయుడుగారి అబ్బాయి' చిత్రం ఈనెల 9న విడుదల కానుంది. ఈ సినిమాతో సత్యరాజ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విడుదల సందర్భంగా రవితేజ, సత్యరాజ్ మంగళవారం పాత్రికేయులతో మాట్లాడారు. ఇది కులాల నేపథ్యంలో తీసిన సినిమా కాదని, రెండు కుటుంబాల మధ్య జరిగే ఇంటెన్స్ స్టోరీ అని దర్శకుడు సత్యరాజ్ చెప్పారు. సినిమా కథ కొత్తగా ఉంటుందని తెలిపారు. గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమా అయినా ఇదొక క్రైమ్ థ్రిల్లర్ అని ఆయన చెప్పారు. 'నేను ఒకసారి కేరళ నుంచి హైదరాబాద్‌కు వస్తున్నప్పుడు కొందరు అక్కడ జరిగిన ఓ సంఘటన గురించి చర్చించుకుంటున్నారు. కులాల కారణంగా ఓ ఊరే తగలబడిపోయిందని వారు చెప్పారు. ఆ సంఘటన ఆధారంగా నేను అమలాపురం నేటివిటీకి తగ్గట్టుగా కథ తయారు చేశాను' అని చెప్పారు సత్యరాజ్. 'ఒక చిన్న సినిమాగా ప్రారంభించాం. పది రోజుల వర్క్ పూర్తయిన తర్వాత ఎవరిదైనా సపోర్ట్ లభిస్తే బాగుంటుందనిపించింది. అలా ముత్యాల రామదాసుగారిని సంప్రదించాం. ఆయన వచ్చాక సినిమా స్వరూపమే మారిపోయింది' అని ఆయన చెప్పారు. నటనలో ప్రత్యేకంగా శిక్షణ ఏమీ తీసుకోలేదని, దర్శకుడి సలహాలు పాటిస్తూ నటించానని హీరో రవితేజ నున్నా చెప్పారు. తన నుంచి దర్శకుడు కావాల్సిన నటన రాబట్టుకున్నారని ఆయన తెలిపారు.

శరవేగంగా.. లగ్గం!



'భీమదేవరపల్లి బ్రాంచి' ఫేం రమేశ్ చెప్పాల దర్శకత్వంలో చిత్రీకరణ జరుపుకొంటోన్న చిత్రం 'లగ్గం'. సాయి రోనక్, ప్రగ్యా నగ్రా హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్, రోహిణి, ఎల్ బి శ్రీరామ్, సప్తగిరి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. వేణుగోపాల్ రెడ్డి నిర్మిస్తున్నారు. మంగళవారం, ఈ చిత్ర బృందం మీడియాతో ముచ్చటించింది. పెళ్లి కాన్సెప్ట్‌తో వచ్చిన సినిమాలన్నింటి కంటే ప్రత్యేకంగా ఈ చిత్రం ఉండబోతోందని నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. తెలంగాణ పెళ్లిని కన్నుల విందుగా తెరకెక్కించామని, ప్రతీ ఒక్కరూ ఈ చిత్రం చూసి ఇందులోని సన్నివేశాల గురించి గొప్పగా మాట్లాడుకుంటారని ఈ చిత్ర దర్శకుడు రమేశ్ తెలిపారు. ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుందని.. కొన్ని తరాలు గుర్తుంచుకునేలా ఉంటుందని నిర్మాత విశ్వాసం వ్యక్తం చేశారు. దర్శకుడు అన్ని హంగులు జోడించి లగ్గం యూనివర్స్‌ను క్రియేట్ చేశారని నటి రోహిణి పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు-చరణ్ అర్జున్, ఎడిటర్-బొంతల నాగేశ్వర రెడ్డి, కెమెరామెన్-

వెలిగొండ కాదు.. ఖాళీ కుండ


గొట్టిపడియ డ్యామ్

- నీళ్లు లేవు.. ప్రాజెక్టు పనులూ పూర్తి కాలేదు అయినా ప్రారంభోత్సవానికి సిద్ధమైన జగన్
- నేడు సొరంగాలు జాతికి అంకితం పేరిట కార్యక్రమం
- ఎన్నికల లబ్ధే లక్ష్యం..కదలిక లేని పునరావాసం
- గత ఐదేళ్లలో జగన్ ఖర్చు చేసింది 978 కోట్లే
- రూ.1,450 కోట్ల పనులు చేసిన టీడీపీ సర్కారు
- ప్రాజెక్టు పూర్తికి మరో రూ.నాలుగువేల కోట్లు
- పనులు వేగంగా చేస్తే మూడేళ్లు పట్టే వీలు

ఒంగోలు/మార్కాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు లబ్ధి చేకూరడం కన్నా రాజకీయ ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యం ఇచ్చే సీఎం జగన్.. ఎన్నికల వేళ మరో పాచిక విసిరారు. అసంపూర్తిగా ఉన్న వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసేందుకు మరో మూడేళ్ల సమయం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, బుధవారం ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి నీరిచ్చే అవకాశం ఏమాత్రం లేదు. కీలకమైన నిర్వాసితుల తరలింపులో ఏమాత్రం కదలిక లేదు. అయినా, రెండు సొరంగాలను జాతికి అంకితం పేరుతో శిలాఫలకాన్ని జగన్ ఆవిష్కరించి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారు. వెలిగొండ పూర్తికి ఇంకా రూ. నాలుగు వేల కోట్లు వెచ్చించాల్సిన అవసరం ఉంది. నిజానికి, తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలో వెలిగొండ పూర్తి చేసి నీరిస్తామని గత ఎన్నికల ముందు జగన్ పదేపదే చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తున్నా దానిని పూర్తి చేయలేకపోయారు. అంతేకాక సుమారు రూ.5వేల కోట్లు అవసరం ఉన్నా ఈ ప్రాజెక్టు కోసం ఈ ఐదేళ్లలో కేవలం రూ.978 కోట్లను మాత్రమే ఖర్చుపెట్టారు. కీలకమైన పలు పనులు గత టీడీపీ కాలంలోనే కొలిక్కి రాగా ఈ ఐదేళ్లు ఒట్టి మాటలకే వైసీపీ ప్రభుత్వం పరిమితమైందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

గత టీడీపీ హయాంలో స్పీడు...

2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చేనాటికి వెలిగొండ ప్రాజెక్టు పనులు ఆగిపోయి రెండేళ్లు అవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాల్లో వెలిగొండను చేర్చి ప్రత్యేక దృష్టి సారించారు. పోలవరంతోపాటు వెలిగొండపైనా తరచూ సమీక్షలతోపాటు ప్రాజెక్టును సందర్శించి వాస్తవ పరిస్థితుల ఆధారంగా కాంట్రాక్టర్లను మార్చి పనుల్లో వేగం పెంచారు. 2014 నాటికి 11 కిలోమీటర్లు మాత్రమే తొలి సొరంగం పూర్తి కాగా తర్వాత ఐదేళ్ల కాలంలో దాదాపు 17.50 కిలోమీటర్లు తవ్వడంతోపాటు అత్యంత క్లిష్టమైన హెడ్ రెగ్యులేటరీ పనులు మొదలయ్యాయి. రెండో టన్నెల్ దాదాపు 3 కిలోమీటర్లు తవ్వారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాస ప్యాకేజీలపై విస్తృత కసరత్తు చేశారు. 2014-19 మధ్య వెలిగొండపై దాదాపు రూ.1,450 కోట్ల ఖర్చు చేశారు.

వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం

ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం వెలిగొండపై ఆరంభంలో హడావుడి చేసినా, అనంతరం తీవ్ర నిర్లక్ష్యం చూపింది. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే ఏడాదిలో వెలిగొండ పూర్తి చేస్తామని జగన్, ఇతర వైసీపీ నేతలు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం చేశారు. నిజానికి గత టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో చేసిన పనుల వల్ల వైసీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదికే కొరవ ఉన్న తొలి సొరంగం తవ్వకం పూర్తయింది. తద్వారా తొలి సొరంగం నుంచి ప్రాజెక్టులోకి నీరు తీసుకొనే అవకాశం ఏర్పడింది. నిర్వాసితుల తరలింపును వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో అది వీలు కాలేదు.

వెలిగొండపై పూటకో మాట!

ఒంగోలులో 2021 అక్టోబరు 7 : వెలిగొండ ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసే విధంగా అడుగులు వేస్తున్నాం. మొదటి టన్నెల్‌ను 2022 ఆగస్టు నాటికి పూర్తి చేసి దాని ద్వారా వెలిగొండ ప్రాజెక్టుకు 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తాం. 2023 ఫిబ్రవరి నాటికి రెండో టన్నెల్‌ను కూడా పూర్తి చేసి 9000 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టుకు అందిస్తాం.

చీమకుర్తిలో 2022 ఆగస్టు 23

2023 సెప్టెంబరు నాటికి వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేస్తాం. నీళ్లిచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళతాం.

మార్కాపురంలో 2023 ఏప్రిల్ 12

వెలిగొండ ప్రాజెక్టులో భాగమైన మొదటి టన్నెల్ తవ్వకం ఇప్పటికే పూర్తయింది. రెండో టన్నెల్‌ను సెప్టెంబరు లేదా అక్టోబరు నాటికి పూర్తిచేస్తాం. మళ్లీ జిల్లాకు వచ్చి వెలిగొండకు నీటిని విడుదల చేస్తాం.

నంద్యాల జిల్లా లక్షవరంలో 2023 సెప్టెంబరు 20:

ఈ ఏడాది అక్టోబరులో వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నాం.

2024 మార్చి 6 ప్రాజెక్ట్ పూర్తికాకుండానే జాతికి అంకితం పేరుతో ప్రజలను మోసం చేయడానికి జగన్ సిద్ధమయ్యారు.



సొరంగాల లైనింగ్‌కే ఏడాది అవసరం

ఇప్పటివరకు ఉన్న లెక్కల ప్రకారం వెలిగొండ ప్రాజెక్టు కోసం రూ.8,043 కోట్లు కేటాయించగా, దాదాపు రూ.5,974 కోట్లు వెచ్చించారు. అందులో వైసీపీ ప్రభుత్వ కాలంలో చేసింది కేవలం రూ.958 కోట్లు మాత్రమే. ఆ విషయం అలా ఉంచితే తాజాగా అధికారుల అంచనా ప్రకారం ప్రాజెక్టు వ్యయ అంచనా సుమారు రూ.10వేల కోట్లకు చేరింది. అంటే ప్రాజెక్టు పూర్తికి ఇంకా రూ.4వేల కోట్లు అవసరం. అలాగే సొరంగాల లోపల లైనింగ్ పూర్తికి కనీసం ఏడాది, మొత్తం ప్రాజెక్టు పనుల పూర్తికి మరో మూడేళ్లు పడుతుందని ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఆ మేరకు ప్రభుత్వానికి కూడా వారు నివేదించినట్లు సమాచారం. ఇవేమీ పట్టించుకోకుండా ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాజకీయ లబ్ధి, ఓట్లు దండుకొనే లక్ష్యంతో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం అంటూ వైసీపీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు.

డోలు విద్వాంసుడు వినుకొండకు కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం


వినుకొండ సుబ్రమణ్యం

గూడూరు, మార్చి 5: తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన డోలు విద్వాంసుడు వినుకొండ సుబ్రమణ్యం కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఎంపికయ్యారు. బుధవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. గూడూరు పట్టణం మాళవ్యానగర్‌లో నివాసముంటున్న వినుకొండ సుబ్రమణ్యం 1957 ఫిబ్రవరి 10న కోట మండలం కొత్తపాళెం గ్రామంలో జన్మించారు. 10వ ఏట నుంచే డోలుపై మక్కువతో సాధన మొదలెట్టారు. తిరుపతిలోని ఎస్వీ సంగీత కళాశాలలో శిక్షణ పొందారు. ప్రముఖ నాదస్వర విద్వాంసుడు ఏకేసీ నటరాజన్‌తో కలిసి పలు కచేరీల్లో పాల్గొన్నారు. ఆలిండియా రేడియో టాప్ గ్రేడ్ ఆర్టిస్టుగా 40 సంవత్సరాలకు పైగా దేశమంతా డోలు కచేరీలతో పేరుగాంచారు.

మహిళలకు అవకాశం ఇస్తే ఆకాశమే హద్దు: వెంకయ్య



తిరుపతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): 'మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. స్త్రీలలో తెలివికి ఏమీ కొదవలేదు. అవకాశం వచ్చినా, ఇచ్చినా ఆకాశమే హద్దుగా ఎదుగుతారు' అని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. తిరుపతిలోని రాష్ట్రీయ సేవా సమితి (రాస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకయ్య నాయుడు రాస్ వ్యవస్థాపక కార్యదర్శి దివంగత పద్మశ్రీ మునిరత్నంతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. 'పురుషులతో పాటు మహిళలకు సాధికారిత ఉంటేనే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థముంటుంది. మహిళా సాధికారత లేని అభివృద్ధి అభివృద్ధే కాదు. ఆస్తిలో సగభాగం ఉన్నప్పుడే స్త్రీ స్వతంత్రంగా ఆలోచించగలదు. మన చట్టాలు, పాఠ్యాంశాలు, ప్రచార మాధ్యమాల ద్వారా మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పించాలి' అని పేర్కొన్నారు.

నేడు అనంతలో 'నిజం గెలవాలి'

- మూడు నియోజకవర్గాల్లో నారా భువనేశ్వరి పర్యటన

అనంతపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి బుధవారం అనంతపురం జిల్లాకు వస్తున్నారు. మూడు నియోజకవర్గాల్లో ఆమె పర్యటిస్తారు. చంద్రబాబు అరెస్టు సమయంలో మనోవేదనతో మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శించి, ఆర్థిక సాయం అందజేస్తారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని 28వ డివిజన్‌లో టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి, కళ్యాణదుర్గం నియోజకవర్గ పర్యటనకు వెళతారు. కళ్యాణదుర్గం రూరల్ మండలం ఎం.కొండాపురంలో మృతిచెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తారు. సాయంత్రం అదే నియోజకవర్గంలోని ముద్దినాయనపల్లి గ్రామంలో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి, అనంతరం ఎం.కొత్తూరులో కార్యకర్త కుటుంబాన్ని ఓదారుస్తారు. రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్లు మండలం గోపులాపురంలో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి అనంతపురం చేరుకుంటారు. బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ కళ్యాణమండపం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో భువనేశ్వరి రాత్రికి బస చేస్తారు.

రేపటి నుంచి లోకేశ్ 'శంఖారావం'

- శ్రీసత్యసాయి జిల్లాలో ఐదుచోట్ల సభలు

పుట్టపర్తి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ గురువారం నుంచి రెండు రోజులు పర్యటించనున్నారు. ఐదు నియోజకవర్గాల్లో ఆయన శంఖారావం సభలు నిర్వహిస్తారు. హిందూపురంలో గురువారం ఉదయం, మడకశిరలో మధ్యాహ్నం, పెనుకొండలో సాయంత్రం సభలను నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి పుట్టపర్తి చేరుకుని బస చేస్తారు. రెండో రోజు శుక్రవారం పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. శంఖారావం సభలకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జగన్ పాలనలో వైద్య ఆరోగ్య శాఖ దోపిడీ: టీడీపీ

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో వైద్య ఆరోగ్య శాఖలో రూ.వేల కోట్లు దోచేస్తున్నారని టీడీపీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'పేదలకు వైద్యం పేరుతో నకిలీ రోగుల్ని సృష్టించి ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌తో కుమ్మక్కై అధికార పార్టీ నాయకులు పేదల వైద్యం కోసం చెల్లించాల్సిన సొమ్మును స్వాహా చేశారన్నారు. వైద్య సేవల కోసం ప్రభుత్వం రూ.58 వేల కోట్లు కేటాయించిందని జగన్ చెప్తున్నారని, ఆ సొమ్ము ఎటు పోయిందో చెప్పాలన్నారు.

బాబాయ్ హత్యపై మాట్లాడితే ఎదురుదాడి: నాగుల్ మీరా

బాబాయ్ హత్య గురించి మాట్లాడే వారిపై జగన్ ఎదురుదాడి చేస్తున్నారని టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్‌మీరా ఆరోపించారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వివేకా కుమార్తె సునీత, దస్తగిరి లాంటి వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. వివేకా హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని, ఫ్యాక్షన్ భావజాలమున్న వ్యక్తికి మరలా ఓటేస్తే ప్రజల ప్రాణాలు గాల్లో దీపాలవుతాయని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌రావు అన్నారు.

స్పైడర్ సినిమాలో భైరవ పాత్రధారి జగన్: దేవినేని ఉమా

'స్పైడర్ సినిమాలో భైరవ పాత్రధారికి మరో రూపమే జగన్. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. టీడీపీ నేతలపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. వారిని ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారు' అని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నెల్లూరులో మాజీ మంత్రి నారాయణ, ఆయన బంధువుల ఇళ్లు, కార్యాలయాలపై జరిపిన దాడులు జగన్ కక్ష సాధింపుల్లో భాగమేనన్నారు. తన పరిధిలో రాని విషయాల్ని పట్టుకుని ప్రత్తిపాటి శరత్‌పై అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపారన్నారు.

ఓట్ల కోసం ప్రాంతాల మధ్య చిచ్చుపెడ్తున్న జగన్: అచ్చెన్న

ఓట్ల కోసం జగన్ ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో ఆరోపించారు. వచ్చే ఎన్నికల అనంతరం విశాఖ నుంచి పాలన సాగిస్తానని, మళ్లీ గెలిచి విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తానని జగన్ పగటి కలలు కంటున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడొస్తాయా, జగన్‌ను రాష్ట్రం నుంచి ఎప్పుడు తరిమికొడదామా అని ఒక్క విశాఖ వాసులే కాదు... యావత్ రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

పార్టీ ఫిరాయింపుపై ఎమ్మెల్సీల వివరణ

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద జారీ అయిన నోటీసులకు వివరణ ఇచ్చేందుకు ఎమ్మెల్సీలు రామచంద్రయ్య, వంశీకృష్ణ యాదవ్ మంగళవారం శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు ఎదుట హాజరయ్యారు. పార్టీ ఫిరాయింపు నేపథ్యంలో ఎమ్మెల్సీ సభ్యత్వాలను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ అయిన విషయం తెలిసిందే.

జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలి: వైవీబీ

గుంటూరు(తూర్పు), మార్చి 5: నిధులు, విధులు లాక్కొని పంచాయతీలను నిర్వీర్యం చేసి భ్రష్టు పట్టించిన ముఖ్యమంత్రి జగన్‌ను రాబోయే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని, 'జగన్ ఓడితేనే మన మనుగడ' అనే నినాదంతో ముందుకెళ్లాలని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉమ్మడి జిల్లా సర్పంచ్‌లతో కలిసి ఆయన గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.

రెవెన్యూ డే ప్రకటనపై సీఎస్‌కు సన్మానం

విజయవాడ(కృష్ణలంక), మార్చి 5 : జూన్ 20ను 'రెవెన్యూ డే'గా ప్రభుత్వం ప్రకటించడం పట్ల ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డిని ఆయన చాంబర్లో ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ నాయకుడు బొప్పరాజు మాట్లాడుతూ 237 సంవత్సరాల చరిత్ర గలిగిన రెవెన్యూ శాఖకు జూన్ 20న ఆవిర్భావ తేదీగా ప్రకటించడం హర్షణీయమని పేర్కొన్నారు.

నకిలీ బంగారంతో రూ.1.77 కోట్ల రుణం

- బాపట్ల బ్యాంక్ ఆఫ్ మహరాష్ట్రలో ఘరానా మోసం
- రోజు కూలీలతో 41 ఖాతాలు తెరిపించిన కొందరు వ్యక్తులు



బాపట్ల, మార్చి 5: బాపట్ల బ్యాంక్ ఆఫ్ మహరాష్ట్ర బ్రాంచ్‌లో నకిలీ బంగారంతో రూ.కోట్లు రుణం తీసుకున్న వ్యవహారం కలకలం రేపింది. పది రోజుల క్రితమే ఈ విషయం తెలిసినా బ్యాంక్ అధికారులు రహస్యంగా ఉంచారు. అయితే నకిలీ బంగారం తనఖా పెట్టించి తమకు కేవలం రూ.10 వేలు చొప్పున మాత్రమే ఇచ్చారని 18 మంది సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటివరకు విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడిన బ్యాంక్ అధికారులు హడావుడిగా లెక్కలు తేల్చి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొందరు వ్యక్తులు రోజువారి కూలీ పనులు చేసుకునే 41 మందితో ఖాతాలు ప్రారంభించి వారితో నకిలీ బంగారం తనఖా పెట్టించారు. 1,77,62,000 రుణం పొందారు. ఇటీవల బంగారు రుణాలపై ఆడిట్ జరగ్గా నకిలీ బంగారం వెలుగు చూసింది. పట్టణ సీఐ యు.శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతేడాది నవంబరు నెల నుంచి ఈ తంతు జరిగినట్లు సమాచారం. బ్యాంక్ అప్రైజర్ వెల్లటూరి రాఘవేంద్రరావు సహకారంతో కొంతమంది కలిసి ఈ విధంగా చేసినట్టు తెలిసింది. రాఘవేంద్రరావు ఇటీవల గంజాయి అనుమానిత కేసులో అరెస్టై జైలులో ఉన్నాడు. ఇదిలా ఉండగా ఇంతపెద్ద మోసం జరిగినా బ్యాంక్ అధికారులకు తెలియకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇందులో ఓ రాజకీయపార్టీ నాయకుడి పాత్ర ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై సీఐ శ్రీనివాసులను వివరణ కోరగా దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

సొంత చెల్లికి న్యాయం చేయలేని వాడు రాష్ట్రానికి ఏం చేస్తాడు..?

- జగన్ నిర్వాకంతో వలసపోతున్న యువత
- అసెంబ్లీ తాకట్టుపై వైసీపీ నేతల మాటలు బాధాకరం: పురందేశ్వరి

గుంటూరు సిటీ, మార్చి 5: నాన్నని చంపిన వారిని శిక్షించాలని సొంత చెల్లి సునీత కన్నీళ్లు పెడుతున్నా న్యాయం చేయలేని సీఎం జగన్.. రాష్ట్రానికి ఏం చేస్తాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ప్రశ్నించారు. మంగళవారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఆవరణలో జరిగిన ప్రజాపోరు ముగింపు సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. 'సీఎం ఇంటికి సమీపంలోనే ఓ మహిళ హత్యాచారానికి గురయింది. ఇంతవరకు న్యాయం జరగలేదు. ఇక రాష్ట్రంలోని ఆడపడుచులకు ఏమి భద్రత కల్పించగలడు? 2019 ఎన్నికల్లో 'ఒక్క అవకాశం' అన్న జగన్ మాటలు విని ప్రజలు భస్మాసురుని మాదిరిగా వారి చేతులు వారి నెత్తిన పెట్టుకుని రాష్ట్రాన్ని నాశనం చేసుకున్నారు. జగన్‌ని చూసి రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు పారిపోతున్నారు. జగన్ నిర్వాకం వల్లే రాష్ట్రానికి చెందిన యువకులు పొట్ట చేత పట్టుకుని పొరుగు రాష్ట్రాలకు వలస పోతున్నారు. చివరకు జగన్ ధన దాహానికి పవిత్రమైన సచివాలయం కూడా తాకట్టులోకి వెళ్లింది. తాకట్టు పెట్టకూడదని ఎక్కడైనా ఉందా? అని వైసీపీ నాయకులు ప్రశ్నించడం చూస్తుంటే బాధ కలుగుతుంది. చివరకు రాష్ట్రంలోని గనులు కూడా రూ.7 వేల కోట్లకు తాకట్టు పెట్టటం సిగ్గుచేటు. నా చెల్లి, నా తల్లి అంటూ సంబోధిస్తున్న జగన్.. నకిలీ మద్యంతో వారి పుస్తెలు తెంచేస్తున్నారు. రైతులకు మద్దతు ధర స్థిరీకరణ నిధి, ఫసల్ బీమా యోజన అంటూ ప్రగల్భాలు పలికిన జగన్ వారిని మోసం చేశాడు. అమరావతి రాజధానికి కేటాయించిన నిధులనూ వినియోగించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. 22 లక్షల ఇళ్లు మంజూరు చేస్తే కేవలం 3 లక్షలు మాత్రమే పూర్తి చేశారంటే జగన్‌కు పేదలపై ఉన్న ప్రేమ ఎంతో అర్థం అవుతుంది' అని పురందేశ్వరి ఎద్దేవా చేశారు.

రాచమల్లు అరాచకం!

- 'ఆంధ్రజ్యోతి'పై అక్కసు.. బాలుడికి హింస
- దుస్తులు ఊడదీయించి పైశాచికత్వం
- ఎమ్మెల్యే వైఖరిపై హక్కుల సంఘాల ఆగ్రహం
- సుమోటోగా కేసు నమోదుకు డిమాండ్

ప్రొద్దుటూరు, మార్చి5: ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఓ బాలుడిపై పైశాచికంగా ప్రవర్తించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన 'అరాచకమల్లు' కథనంపై తన అసహనం ప్రదర్శించేందుకు నాలుగేళ్ల బాలుడిని ఉపయోగించుకున్నారు. ఆ బాలుడి దుస్తులు ఊడదీయమని అనుచరులను ఉసిగొల్పి.. ఏడుస్తున్నా.. 'ఆ పేపర్‌తో పిల్లవాడి గు.. తుడవండి, ము.. తుడవండని అసభ్య పదజాలంతో మాట్లాడారు. ఈ వీడియోను కొన్ని యూట్యూబ్ చానల్స్‌లో ప్రసారం చేయగా మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కరుణాకర్ చూశారు. దీనిపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన తెలిపారు. ప్రజా ప్రతినిధిగా ఉండీ బాలుడిపట్ల బహిరంగ ప్రదేశంలో అసభ్యకరంగా వ్యవహరించడం, దాన్ని ప్రోత్సహించటంపై సుమోటోగా బాలల పరిరక్షణ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటివి ప్రసారంచేసే యూట్యూబ్ చానల్స్‌పై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ విమర్శలకు పిల్లలను, మహిళలను కించపరచకూడదని, అవమానపరిచేలా వ్యవహరించకూడదని చట్టంలో ఉన్నా వాటిని రాజకీయ నాయకులు ఇటీవల తరచూ ఉల్లంఘిస్తున్నారని అన్నారు. దీనిపై మానవ హక్కుల కమిషన్, హైకోర్టు నేరుగా జోక్యం చేసుకోవాలని కోరారు.

వైసీపీకి ప్రతిపక్ష హోదా దక్కేనా..!

- విశాఖే రాజధాని అనడం హాస్యాస్పదం
- ఓటమి భయంతో రెచ్చిపోతున్న పేటీఎం కూలీలు: రఘురామరాజు



న్యూఢిల్లీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): 'సీఎం జగన్మోహన్‌రెడ్డి పిట్టలదొరలా మాట్లాడడం దురదృష్టకరం. బెండపూడి ఇంగ్లీష్ యాసలో విశాఖపట్నమే రాష్ట్ర రాజధానని పేర్కొనడం హాస్యాస్పదం' అని ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. విశాఖపట్నంలోనే మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తానన్న జగన్‌కు రానున్న ఎన్నికల్లో అసలు ప్రతిపక్ష నేత హోదా అయినా దక్కుతుందా? అని ప్రశ్నించారు. మంగళవారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'పొలాల్లో ఏనుగులు వచ్చి పడినప్పుడు రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో, ఇప్పుడు విశాఖవాసుల పరిస్థితి అలా ఉంది. ఏనుగులే మేము వస్తున్నామని ప్రకటించిన తరువాత, ఇప్పుడు విశాఖ వాసుల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. రాష్ట్ర పరిస్థితి చూస్తుంటే, ఇటీవల వచ్చిన ఓ తెలుగు సినిమాలో 'కుర్చీ మడత పెట్టి..' అనే పాట గురుకొస్తోంది. వైసీపీకి ఓటమి తప్పదన్న భయంతో మళ్లీ పేటీఎం కూలీలు రెచ్చిపోతున్నారు. నరసాపురంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కూటమి అభ్యర్థులకు 70% ఓట్లు పోలవడం ఖాయం. రాష్ట్రంలోని మిగతా నియోజకవర్గాలలో ఎక్కడా 60 శాతానికి తగ్గే అవకాశం లేదు. ఎన్నికల కోడ్ ఎంత తొందరగా వస్తే అంత తొందరగా ఈ పనికిమాలిన పరిపాలకుడిని వదిలించుకోవాలని ప్రజలు ఎదురుచూస్తున్నారు' అని రఘురామ అన్నారు. 'పోలవరం ప్రాజెక్టును ఆపేస్తారా? అమరావతి రోడ్లను తవ్వేసి కంకర, మట్టి అమ్ముకుంటారా? ప్రజాధనం రూ.500 కోట్లు వెచ్చించి ప్యాలెస్ నిర్మించుకుంటారా? అని ప్రజలు నిలదీస్తున్నారు. ప్రాజెక్టులు కట్టేవారు కావాలా? సొంత ప్యాలెస్‌లు నిర్మించుకునేవారు కావాలా? ఆలోచించి, ప్యాలెస్ ప్రభుత్వాన్ని సమాధి చేయాలి. ప్రాజెక్టులు కట్టే ప్రభుత్వాన్ని తీసుకురావాలి' అని రఘురామ విజ్ఞప్తి చేశారు.

ఈవీఎంలపై సందేహాల నివృత్తి

- ఈసీఐఎల్ బృందం వర్చువల్ శిక్షణ

అమరావతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల నిర్వహణ, వాటి వినియోగంలో నోడల్ అధికారులు ఎదుర్కొంటున్న సందేహాలను, సమస్యలను హైద్రాబాద్ నుంచి ఆన్‌లైన్ ద్వారా ఈసీఐఎల్ అధికారుల బృందం సభ్యులు నివృత్తి చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం అమరావతి సచివాలయంలో రెండో విడత శిక్షణ కార్యక్రమం జరిగింది. అదనపు ప్రధాన ఎన్నికల అధికారి హరేంద్ర ప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన ఈవీఎం నోడల్ అధికారులు, సాంకేతిక సహాయకులు ప్రత్యక్షంగాను అరుణాచలప్రదేశ్, ఒడిసా, సిక్కిం రాష్ట్రాలకు చెందిన అధికారులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 9న జరిగిన మొదటి విడత శిక్షణా కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల నిర్వహణ వాటి వినియోగంపై సమగ్ర అవగాహన కల్పించారు. అయితే క్షేత్ర స్థాయిలో ఈవీఎంల వినియోగంలో అధికారులకు, సాంకేతిక సహాయకులకు ఎదురైన సమస్యలు, సందేహాలను నివృత్తిపర్చేందుకు నెల రోజుల తదుపరి రెండో విడత శిక్షణ నిర్వహించారు. జిల్లాల వారీగా ఈవీఎం నోడల్ అధికారులు, సాంకేతిక సహాయకులు అడిగిన పలు సందేహాలకు, సమస్యలకు ఈసీఐఎల్ అధికారుల బృందం సభ్యులు సీనియర్ డీజీఎం ఏపీ రాజు, ఇంజనీర్ సీజీ ఆదిత్య సమగ్రమైన వివరణ ఇచ్చారు.

గొడ్డలి నా చేతిలో కాదు

▸▸ జగన్మోహన్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి చేతుల్లో పెట్టాలి: దస్తగిరి



కడప, మార్చి 5(ఆంధ్రజ్యోతి): "జగన్ మీడియాలో తప్పుగా వచ్చింది.. గొడ్డలి నా చేతికి కాదు ఇచ్చేది.. ఒకపక్క జగన్మోహన్‌రెడ్డిని, మరో పక్క అవినాశ్‌రెడ్డిని నిలబెట్టి వాళ్ల చేతికి గొడ్డళ్లు ఇచ్చి మధ్యలో భారతీరెడ్డి, భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శంకర్‌రెడ్డిని పెట్టాలి" అని వివేకా హత్యకేసులో అప్రూవర్ దస్తగిరి అన్నారు. ఇలాంటి తప్పుడు కథనాలు రాసి మళ్లీ ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నారని, దీన్ని ప్రజలు గమనించాలని కోరారు. కేవలం ఎంపీ టికెట్ కోసమే ఈ హత్య జరిగిందని స్పష్టం చేశారు. మంగళవారం ఆయన కడప ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. "వైఎస్ సునీత ఇంట్లో పనిచేసే బీబీ మా ఇంట్లోనూ పనిచేస్తుందని, అక్కడి విషయాలు ఇక్కడకు, ఇక్కడి విషయాలు అక్కడకు చేరవేస్తుందని భరత్ యాదవ్ చెప్పడం దగ్గరనుంచి జగన్ మీడియాలో అన్నీ అవాస్తవాలే రాశారు. నాపై చేస్తున్న ఆరోపణలను నిరూపిస్తే జైలుకెళ్లేందుకు నేను సిద్ధం. నిరూపించకపోతే జైలుకు వెళ్లేందుకు మీరు సిద్ధమా? నేను జైలు నుంచి విడుదల అవుతూనే గన్‌మెన్లు, ఎస్కార్టు వెంట వచ్చారు. నేను ఏం చేసేది ప్రతీదీ వారికి తెలుసు. నావద్ద బొలెరో ఉన్నట్లు నిరూపిస్తే మీరేం చెప్పినా చేసేందుకు సిద్ధం, నిరూపించలేకపోతే జగన్ మీడియాను మూసేసి, చేసిన తప్పు ఒప్పుకొంటారా?" అని దస్తగిరి సవాల్ విసిరారు.

జైల్లో సీసీ ఫుటేజీ బయట పెట్టాలి

"నన్ను భయభ్రాంతులకు గురిచేసింది వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, దేవిరెడ్డి చైతన్యరెడ్డి. వారు చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు చైతన్యరెడ్డి ప్రెస్‌మీట్ పెట్టాడు. అసలు ఆయన్ను జైల్లోకి ఎలా రానిచ్చారు? జైలులో సీసీ కెమెరాలు ఉన్నాయని జగన్ మీడియాలో రాశారు. అక్టోబరు 31న నేను జైలుకు వెళ్లినప్పటి నుంచి ప్రతి వీడియోను భద్రపరచాలి. కానీ అందతా డిలీట్ అయిపోయుంటుందని చెబుతున్నారు. జైలులో జరిగిన ఘటనల సీసీ ఫుటేజీని సీబీఐ వెలికితీసి వీరి నిజస్వరూపం బయటపెట్టాలి" అని దస్తగిరి కోరారు. "నా భార్యకు కూడా 41ఏ నోటీసులు ఇచ్చామని, ఆమెను కూడా లోపల వేస్తామని, నీ కుటుంబాన్ని కాపాడుకుంటావో, మాకు సహకరిస్తావో చూస్కో అని జైలులో నన్ను కలిసిన చైతన్యరెడ్డి బెదిరించాడు. పులివెందులలో వైఎస్ మనోహర్‌రెడ్డికి రైట్‌హ్యాండ్‌గా ఉన్న రాజశేఖర్‌రెడ్డి అనే కౌన్సిలర్ నా భార్య వద్దకెళ్లి నీ భర్తను జైలులోనే చంపేస్తాం.. ఇబ్బంది పడకుండా ఉండాలంటే మేం చెప్పినట్లు వినాలని హెచ్చరించారు. మీకు కావాలంటే పులివెందుల ఓఎస్డీ ఆఫీ‌ఎలో రూ.20కోట్లు డబ్బు ఉంది.. అది తీసుకోండి అని ప్రలోభపెట్టారు" అని దస్తగిరి చెప్పారు.

"మేం డ్రామాలు ఆడుతున్నామని చెబుతున్నారు.. ఈ ఐదేళ్లు మీ ప్రభుత్వమే కదా ఉంది.. మీరేం చేస్తున్నారు.. టీడీపీ హయాంలో ఏర్పాటుచేసిన సిట్ అధికారులకు కట్టుకథలు చెప్పాం. మళ్లీ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు అండగా ఉంటామని జగన్, భారతీరెడ్డి నుంచి సమాచారం వచ్చింది. మాట వినకుంటే మమ్మల్ని ఏదోటి చేస్తామనే ధీమాతో ఉన్నారు. నాకు సహాయం చేసిన వారిని భయభ్రాంతులకు గురిచేశారు. నా తరఫున వాయిదాలకు తిరగకూడదని కడపకు చెందిన లాయర్ చంద్రగుప్తను భయపెట్టారు. నేను ఇచ్చిన సలహాతో నా భార్య జడ శ్రీనివాస్ వద్దకెళ్లి ప్రాధేయపడింది. ఆయన హైకోర్టులో బెయిల్‌కు దరఖాస్తు చేసి తీసుకొచ్చారు" అన్నారు.

విచారణకు పిలిస్తే... ఢిల్లీ పోయి కాళ్లు పట్టుకుంటున్నారు

"జైలులో జరిగిన ప్రతి అంశంపై జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తా. నా భార్యకు మతిస్థిమితం లేక చెబుతా ఉంది, మీడియా మిత్రులు కూడా తప్పుదోవ పట్టిస్తున్నారని జైలు సూపరింటెండెంట్ లెటర్ రాయమన్నారు. వినకుంటే ములాఖత్‌లు కట్ చేస్తామని, ఫోన్లు లేకుండా చేస్తామని బెదిరించారు. ఈ విషయాలన్నీ సీబీఐ, జైళ్ల డీజీ దృష్టికి తీసుకెళ్తా. సీసీ ఫుటేజీ బయటకు వచ్చేవరకు పోరాడతా. సుప్రీంకోర్టుకు కూడా వెళ్తా. న్యాయస్థానాలను, సీబీఐని మేనేజ్ చేసే కెపాసిటీ వైఎస్ సునీతకు లేదు. చేసిన తప్పునకు ప్రాయశ్చిత్తంగానే అప్రూవర్‌గా మారాను. వివేకా దగ్గర పనిచేశా.. ఆయన పెట్టిన కూడు తిన్నా. వీళ్లతో చేతులు కలపడం తప్పే" అని దస్తగిరి పేర్కొన్నారు.

ఖనిజ భూములు

కొల్లగొట్టారు!

- ▸▸ నంద్యాల జిల్లాలో వైసీపీ ప్రజా ప్రతినిధి గలీజు దందా
- ▸▸ కొలిమిగుండ్లలో మైనింగ్ భూముల పంపిణీకి భారీ స్కెచ్
- ▸▸ క్వార్జ్, లైమ్‌స్టోన్ వంటి ఖనిజాలు ఉన్నా దోచేసే పన్నాగం
- ▸▸ సదరు నేత సూచనలు పక్కాగా అమలు చేసిన అధికారులు
- ▸▸ 20 రోజుల్లోనే 2,753.91 ఎకరాల్లో సర్వే
- ▸▸ ఫైల్‌పై సంతకం కోసం అధికారులపై ఒత్తిడి



కొలిమిగుండ్ల మండలం పెట్నికోట గ్రామంలో భూ పంపిణీ చేయదలిచిన కొండ ప్రాంతం

నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలోని మైనింగ్ భూములపై స్థానిక వైసీపీ ప్రజాప్రతినిధి కన్ను పడింది. ఆ భూములను తనవారికి ఇప్పిస్తే ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చని భావించాడు. ఉచితంగా ఇచ్చే బదులు.. ఎకరాకు ఇంత చొప్పున వసూలు చేస్తే డబ్బుకు డబ్బు.. భూములు పంచాడన్న పేరూ ఉంటుందని, ఓట్లు కురుస్తాయని ప్రణాళిక వేశాడు. ఆ భూములు మైనింగ్‌కు పనికిరావని, వ్యవసాయ యోగ్యమైనవని చూపితే భవిష్యత్తులో ఏ ఇబ్బంది రాదని అధికారులకు సలహా కూడా ఇచ్చాడు. వారి సహకారంతో దాదాపు 2వేల ఎకరాలకు పైగా విలువైన ఖనిజ భూములను కొల్లగొట్టి తనవారికి బదలాయించేందుకు రంగం సిద్ధం చేశాడు.

(నంద్యాల-ఆంధ్రజ్యోతి)

నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం కొలిమిగుండ్ల మండలంలో ఇటిక్యాల, పెట్నికోట, తోళ్లమడుగు, నందిపాడు తదితర 14 గ్రామాల్లో 2,753.91 ఎకరాల మైనింగ్ భూమి ఉంది. దీనిపై అధికార పార్టీ నాయకుడు కన్నేశాడు. ఈ భూముల్లో సిమెంటు తయారీకి సంబంధించిన క్వార్జ్, లైమ్‌స్టోన్ వంటి ఖనిజాలు ఉండటంతో వీటిని అంత సులువుగా సొంతం చేసుకోవడానికి వీలుపడలేదు. దీంతో వాటిని మొదట అర్హులైన పేదలకు భూ పంపిణీ చేసి, తర్వాత కైవసం చేసుకోవచ్చని పథకం పన్నాడు. అనుకున్నదే తడవుగా తన నియోజకవర్గంలో ఫలానా వారు అర్హులు అంటూ లెటర్లు కూడా ఇచ్చేశాడు. ఇందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ.30వేల నుంచి రూ.లక్షకు పైగా వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇలా ఆయా గ్రామాల నుంచి దాదాపు రూ.8కోట్ల నుంచి రూ.10కోట్ల వరకు వసూలు చేసినట్లు విమర్శలు వస్తున్నాయి. భూ పంపిణీ జరగాల్సిన సమయానికి కొందరు స్థానికులు మోసాన్ని గుర్తించి ఎదురు తిరిగారు. అవన్నీ ఖనిజ భూములని, సదరు వైసీపీ నాయకుడు అర్హులంటూ తేల్చినవారిలో కొంతమంది గతంలో ప్రభుత్వ భూములు పొందినవారని, మరి కొంతమందికి సొంత భూములున్నాయని, కొంతమంది ఏకంగా ఐటీ కడుతున్నారని నంద్యాల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ భూములను పంపిణీ చేస్తే ప్రభుత్వానికి వచ్చే ఆదాయం భారీగా కోల్పోతుందని కోర్టులో కేసు కూడా వేశారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో పెండింగ్‌లో ఉంది.

మరో దారిలో...

సదరు వైసీపీ నాయకుడు వేసిన స్కెచ్ బూమరాంగ్ అవడంతో భూమి కోసం డబ్బులు ముట్టజెప్పిన వారంతా తిరిగి ఇచ్చేయమని అడిగినట్లు తెలుస్తోంది. ఆ ఉద్దేశమే లేని సదరు నేత మరో దారిలో భూముల పంపిణీకి సిద్ధమయ్యాడు. ఈ భూముల్లోని ఖనిజాలు పరిశ్రమలకు పనికిరావని చెప్పించి, ఆ తర్వాత అవి వ్యవసాయానికి అనువుగా ఉన్నాయని సర్వే చేయించి డబ్బులు ఇచ్చినవారికి కట్టబెడదామనుకున్నాడు. తదనుగుణంగా అధికారులను పురమాయించాడు. ఆయన కోరిందే తడవుగా రెవెన్యూ, మైనింగ్, వ్యవసాయ, సర్వే శాఖ అధికారులతో ఓ కమిటీ వేశారు. ముందుగా రెవెన్యూ అధికారులు కొలిమిగుండ్లలోని ఆయా గ్రామాల్లో 2,753.91 ఎకరాలను గుర్తించి, ఇందులో ఖనిజాలు ఉన్నాయో? లేవో? గుర్తించమని సూచించారు. ఆ తర్వాత ఖనిజశాఖ అధికారులు ఈ మొత్తం భూమిలో 81.81 ఎకరాల్లో లైమ్‌స్టోన్, 2672.1 ఎకరాల్లో క్వార్జ్ నిల్వలు ఉన్నాయి కానీ, అవి పరిశ్రమల అవసరాలకు పనికిరావని, ఇందులో 2,128.6 ఎకరాలు వ్యవసాయానికి అనువుగా ఉంది కాబట్టి ఆ భూములను పేదలకు ఇవ్వచ్చని రిపోర్టు ఇచ్చారు. ఇక వ్యవసాయ అధికారులు కూడా గుర్తించి సంతకం చేయడం ఒక్కటే మిగిలిపోయింది. దీంతో భూముల పంపిణీకి బ్రేక్ పడింది.

అధికారులపై ఒత్తిడి...

కొలిమిగుండ్లలోని రెవెన్యూ, మైనింగ్, సర్వే శాఖ అధికారులు గుర్తించిన భూములు పూర్తిగా రాళ్లు, రప్పలు, పొదలతో నిండి ఉన్నాయి. ఇక్కడ వ్యవసాయం చేయాలంటే వాటిని తొలగించడానికి తీవ్రంగా శ్రమించాలి. ఆ తర్వాత రెండు మూడు అడుగుల మేర మట్టి వేసి, కొండ ప్రాంత వ్యవసాయ విధానాలు అనుసరిస్తే గానీ ఇక్కడ వ్యవసాయం సాధ్యం కాదు. ఈ విధంగా ఆయా శాఖల అధికారులే రిపోర్టు ఇచ్చారు. ఈ లెక్కన ఈ భూములు పూర్తిగా వ్యవసాయ యోగ్యం కాదని తెలుస్తోంది. దీంతో వ్యవసాయశాఖ అధికారులు సంబంధిత ఫైల్ మీద సంతకాలు చేయలేదు. తాను ఆదేశించినా సంతకం చేయకపోవడం ఏమిటని సదరు నేత వారిపై ఒత్తిడి చేయడం మొదలుపెట్టాడు. ఆయనకు తోడు జడ్పీ చైర్మన్ స్థాయి నాయకుడు కూడా యంత్రాంగంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీనికి తలొంచి విలువైన భూములు కట్టబెడితే కోర్టు ధిక్కరణ కేసు ఎదుర్కోవాల్సి వస్తుందని, గతంలో సీనియర్ ఐఏఎస్‌లకు పట్టిన గతే తమకూ పడుతుందని సదరు అధికారులు ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం. దీంతో మండల స్థాయి అధికారులు సెలవుపై వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

అన్నీ అనుమానాలే..

ఖనిజాలు ఉన్నాయని కేంద్రం గుర్తించిన భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర అవసరాలకు వినియోగించకూడదు. అయితే ప్రస్తుతం వైసీపీ నేతలు ఆ భూముల్లోని ఖనిజాలు పనికిరావని గుర్తించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉదాహరణకు కొలిమిగుండ్ల మండలంలో పెట్నికోట రెవెన్యూ గ్రామం సర్వే నం.1208/1లో 994.04 ఎకరాల్లో లైమ్‌స్టోన్ లీజుకు ఇస్తున్నట్లు 2011లోనే సంబంధిత యంత్రాంగం ప్రైవేటు వ్యక్తికి కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సర్వే చేసిన అధికారులు మాత్రం ఇందులో 470 ఎకరాలు వ్యవసాయానికి అనువుగా ఉన్నాయని రిపోర్టు ఇచ్చారు. ఇదే మండలంలోని ఇటిక్యాల గ్రామం సర్వే నంబరు 112-ఏలో 130.96 ఎకరాలు, 112-సీలో 630.32 ఎకరాలు వ్యవసాయానికి అనువుగా ఉన్నాయంటూ నివేదిక సిద్ధం చేశారు. ఈ ప్రాంతం పూర్తిగా రాళ్లు, కొండలతో వ్యవసాయ యోగ్యంగా లేదు. ఖనిజ నిల్వలున్న ప్రాంతం కావడంతో ఓ ప్రైవేటు కంపెనీ మరికొద్ది రోజుల్లో తమ సిమెంటు ఫ్యాక్టరీకి సంబంధించిన నాలుగో ప్లాంటును ఇక్కడ శంకుస్థాపన చేసేందుకు అన్నీ సిద్ధం చేసుకుంది. అయితే వైసీపీ అధిష్ఠానంతో బేరసారాలు కుదరక వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది.

ఆగమేఘాలపై నివేదికలు

ఈ ప్రాంతంలోని భూములు వ్యవసాయానికి అనువుగా ఉన్నాయో? లేదో? సర్వే చేయాల్సిన అధికారులు ఆఘమేఘాల మీద రిపోర్టు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జనవరి 8న అప్పటి కలెక్టరు సర్వే చేయాలంటూ ఆదేశించగా.. మైనింగ్ అధికారులు అదే నెల 25న అక్కడి భూములు మైనింగ్‌కు పనికి రావని, వాటిని ఇతర అవసరాలకు వాడుకోవచ్చంటూ నివేదిక తయారు చేశారు. ఇదే నివేదికపై రెవెన్యూ, మైనింగ్, సర్వే అధికారులు సంతకాలు చేసి ఫిబ్రవరి 23న కలెక్టరుకు నివేదిక సమర్పించారు. 14 గ్రామాల్లోని 2,753.91 ఎకరాల్లోని భూముల్లో ఖనిజాలు ఉన్నవీ లేనిదీ తెలుసుకోవాలంటే చాలా సమయం పడుతుంది. అలాంటిది 20రోజుల వ్యవధిలో ఆ భూముల్లోని అత్యధిక శాతం వ్యవసాయానికి అనువుగా ఉన్నాయని అధికారులు తేల్చేయడం ఎలా సాధ్యమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భూ పంపిణీ వ్యవహారాన్ని పూర్తిగా తమ స్వలాభం కోసం వాడుకోవాలని వైసీపీ నేతలు చూస్తున్నారని, అందుకే పైపైన సర్వే చేయిస్తూ భూములను కొట్టేయాలని చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు ఈ వ్యవహారాన్ని అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టీడీపీలోకి గుమ్మనూరు

▸▸ 'జయహో బీసీ' సభలో చంద్రబాబు సమక్షంలో చేరిక

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళవారం సాయంత్రం 'జయహో బీసీ' సభలో చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గత కొంతకాలంగా సీఎం జగన్ అనుసరిస్తున్న విధానాలపై అసంతృప్తితో ఉన్న జయరాంకు ఆలూరు వైసీపీ టికెట్ మళ్లీ ఇవ్వలేదు. కర్నూలు లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయాలని జగన్ సూచించారు. అసెంబ్లీకే పోటీ చేస్తానని పట్టుబట్టినా పట్టించుకోలేదు. దీంతో జయరాం టీడీపీ నాయకత్వంతో సంప్రదింపులు జరిపి ఆ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం ఉదయం వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, మంత్రి పదవికి రాజీనామా చేస్తూ ముఖ్యమంత్రికి లేఖను మీడియా ప్రతినిధుల ముందే పంపారు. తనకు కర్నూలు ఎంపీగా పోటీ చేయడం ఇష్టం లేదని, గుంతకల్లు నుంచి టీడీపీ తరఫున పోటీచేస్తానని వెల్లడించారు. ఆయన రాజీనామాను జగన్ ఆమోదించకుండా ఆయన్ను బర్తరఫ్ చేయాలని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సిఫారసు చేశారు. దీంతో గవర్నర్ ఆయన్ను కేబినెట్ నుంచి తొలగించారు. ఈ మేరకు రాజ్‌భవన్ గెజిట్ విడుదల చేసింది.

ఇన్‌పుట్ సబ్సిడీ కొందరికే!

▸▸ నేడు నిధులు విడుదల చేయనున్న సీఎం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో నిరుడు తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు ఏర్పడి లక్షలాది మంది రైతులు నష్టపోయారు. ఆదేసమయంలో మిచౌంగ్ తుఫాన్‌తో అకాల వర్షాలు కురిసి వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో కరువు, తుఫాన్ వల్ల నష్టపోయిన 11.59 లక్షల మందికి రూ.1,294 కోట్లను ఇన్‌పుట్ సబ్సిడీ కింద సీఎం జగన్ బుధవారం విడుదల చేయనున్నారు. పంట నష్టపోయిన రైతులకు జగన్ సర్కార్ అరకొర సాయంతో సరిపుచ్చుతోందని రైతులు రగిలిపోతున్నారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం 33%పైన పంట నష్టాలకే ప్రభుత్వం పరిహారం రూపంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తోంది. కరువు, తుఫాన్ వల్ల 10%పైన నష్టం జరిగినా.. రైతులకు పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో కరువు, చంద్రబాబు కవల పిల్లలని హేళన చేసిన జగన్.. తన హయాంలోనూ కరువు పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది. 448 మండలాల్లో తీవ్ర వర్షాభావం ఏర్పడగా, సర్కార్ కేవలం 103 కరువు మండలాలనే ప్రకటించింది. తీవ్ర వర్షాభావం వల్ల ఖరీఫ్‌లో 27 లక్షల ఎకరాల్లో విత్తనమే పడలేదు. వేసిన పంటలకు సాగునీరు అందక దిగుబడులు తగ్గి, రైతులు నష్టపోయారు. కరువు ప్రాంతాల్లో 14.23 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిని, 7 లక్షల మంది రైతులు నష్టపోయారని అధికారులు అంచనా వేశారు. గత డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్‌తో 22 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసి, 6.65 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అంచనా వేశారు. తుఫాన్ కారణంగా 4.61 లక్షల మంది రైతులు నష్టపోయారని లెక్క తేల్చారు. కరువు, తుఫాన్ కారణంగా దాదాపు 21 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిని, 11.59 లక్షల మంది రైతులు నష్టపోయినట్లు గుర్తించారు. దీంతో ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.1,294 కోట్లను బాధిత రైతుల ఖాతాలకు జమ చేయనున్నట్లు చెబుతున్నారు. కాగా, ప్రకృతి విపత్తులకు నష్టపోయిన రైతుల్ని ఆదుకునేందుకు రూ.4వేల కోట్లతో విపత్తు సహాయ నిధిని ఏర్పాటు చేస్తామన్న జగన్ సర్కార్ 57నెలల్లో పంట నష్టపోయిన రైతులకు వెచ్చించింది కేవలం రూ.3,262 కోట్లు మాత్రమే. ఏటా ఏదోక విపత్తుతో లక్షలాది రైతులు పంటల్ని కోల్పోయినా పూర్తి స్థాయి సాయం అందక నష్టాల పాలవుతూనే ఉన్నారు.

దుర్గగుడిలో నకిలీ అధికారి హల్‌చల్



భరత్ భూషణ్‌ను విచారిస్తున్న పోలీసులు, అధికారులు.. నకిలీ ఐడీ కార్డులు

వన్‌టౌన్, మార్చి 5: దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో మంగళవారం మాచవరానికి చెందిన భరత్‌భూషణ్ తాను ఆదాయపు పన్ను అధికారినంటూ విజిటింగ్ కార్డు చూపించి హల్‌చల్ చేశాడు. అతని ప్రవర్తనపై ఆలయ అధికారులకు అనుమానాలు తలెత్తడంతో వన్‌టౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అతనిని అదుపులోకి తీసుకుని విచారించారు. భరత్‌భూషణ్ మంగళవారం సాయంత్రం 5 గంటలకు అమ్మవారి దర్శనం నిమిత్తం కొండపై సమాచార కేంద్రం వద్దకు వచ్చాడు. అక్కడ ఉద్యోగులతో ఇన్‌కం టాక్స్ జాయింట్ కమిషనర్‌నంటూ విజిటింగ్ కార్డును చూపించాడు. సమాచార కేంద్రం సూపరింటెండెంట్ తన సెల్‌ఫోన్ ద్వారా ఫోటో తీసుకుని ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు పంపించి అతని వివరాలను అడిగారు. తమ డిపార్ట్‌మెంట్‌లో ఆపేరుతో ఎవరూ లేరన్నారు. దీంతో సూపరింటెండెంట్, ఆలయ ఉద్యోగులు పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతని వద్ద ఆనంద్, వి.శ్రీనివాస్ పేరులతో ఉన్న విజిటింగ్ కార్డులను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తీసుకుని వెళ్లారు. గతంలో కూడా విజిటింగ్ కార్డు చూపించి పలు ఆలయాల్లో హడావుడి చేసినట్లు ఆలయ సిబ్బంది చెబుతున్నారు. సీఐ ధనశేఖర్‌రెడ్డి అతని నుంచి పూర్వపరాలను సేకరించే పనిలో పడ్డారు. ఇతని గురించిన వ్యక్తిగత వ్యవహారాలు, కుటుంబ వ్యవహారాలు ఇంకా తెలియరాలేదు.

జస్టిస్ అరుణ్ మిశ్రాకు స్వాగతం



స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ రాజబాబు

గన్నవరం, మార్చి 5 : జాతీయ మానవ హక్కుల సంఘం చైర్మన్ జస్టిస్ అరుణ్ మిశ్రా మంగళవారం రాత్రి గన్నవరం విమానాశ్రయానికి చేరుకోగా వారిని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లా పోలీసు అధికారి అద్నాన్ నయీం అస్మి ఘనంగా స్వాగతం పలికారు. ఆయనతో పాటు సభ్యులు డాక్టర్ డి.ఎం. మూలే, రాజీవ్ జైన్, సెక్రటరీ జనరల్ భరత్ లాల్, రిజిస్ట్రార్ సురాజిత్ డే, డీఐజీ పాటిల్ కేతన్ బలిరాం, డిప్యూటీ రిజిస్ట్రార్ ఇంద్రజిత్ కుమార్, కోర్టుమాస్టర్ డి.బి. షాజీ గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ నెల 6వ తేదీన జరిగే ఓపెన్ హియరింగ్‌లో పాల్గొంటారు. విమానా శ్రయం డైరెక్టర్ ఎంఎల్‌కె రెడ్డి, ప్రోటోకాల్ అధికారి జవహర్, లైజన్ అధికారి కిరణ్మయి, గుడివాడ రెవెన్యూ డివిజనల్ అధికారి పి.పద్మావతి, డీఎస్పీ జయసూర్య, సీఎస్‌వో వెంకటరత్నం, తహసీల్దార్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన అవసరం

కృష్ణలంక, మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సంబంధించిన అన్ని విషయాలపై అవగాహన కలిగిస్తూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం, బాలలపై లైంగిక వేధింపులను అరికట్టడం వంటి వాటిపై బాలలు, స్త్రీలలో అవగాహన పెంచాల్సిన అవసరం వుందని స్త్రీ శిశు సంక్షేమ డైరెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. సమాన అవకాశాలు - సమాన అధికారాలు, మహిళల ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తూ, మహిళల సమస్యలను కౌన్సిలింగ్ ద్వారా అరికట్టడం, 'బేటీ బచావో - బేటీ పడావో', ఆడపిల్లల్ని బతికించు -చదివించు అనే నినాదాన్ని ప్రచురించిన వాల్‌పోస్టర్‌ను మహిళాభివృద్ధి శిశుసంక్షేమ శాఖ డైరెక్టర్ వెట్రిసెల్వికె, జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. ఏలూరు ఆర్‌జేడీ శైలజ, ఏడీ శ్రీలక్ష్మి, జిల్లా డీడబ్ల్యూ అండ్ సీడబ్ల్యూ ఈవో జి.ఉమాదేవి, డీసీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

సైకో జగన్ దెబ్బకు విద్యార్థుల జీవితాలు చీకటిమయం

విద్యాధరపురం, మార్చి 5: సైకో జగన్ దెబ్బకు విద్యార్థుల జీవితాలు చీకటిమయమ య్యాయని టీడీపీ సీనియర్ నాయకుడు, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారు నాగశ్రావణ్‌ను మంగళవారం ఆయన పరామర్శిం చారు. ఆయనకు సంఘీభావం తెలియజేసి విద్యార్థుల కోసం చేస్తున్న ఉద్యమానికి మద్దతు పలికారు. విద్యార్థుల డిమాండ్లను పరిష్కరించాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. విద్యార్థులకు పరీక్షలు దగ్గరలోనే ఉన్నం దున ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయా లని, ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చేయాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చే సత్తా ఉన్న చంద్రబాబును రానున్న ఎన్నికల్లో గెలిపించి సీఎంను చేయాలన్నారు. చిన్నవయస్సులోనే శ్రావణ్ రాజకీయాలలో చురుకుగా పాల్గొంటూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరాహార దీక్ష చేయడం అభినందనీయమని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, అమలాపురం పార్ల మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్ బాలయోగి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పలనాయుడు, టీఎన్‌ఎస్‌ఎఫ్ జనరల్ సెక్రటరీ చరణ్‌యాదవ్, తెలుగుయువత నాయకులు పెద్ది సరసు, సుశీల్, సాయిరాం పాల్గొన్నారు.

కిలారును పరామర్శించిన కేశినేని చిన్ని



కిలారు నాగ శ్రావణ్‌ను పరామర్శించి మాట్లాడుతున్న నెట్టెం రఘురాం, కేశినేని శివనాథ్

నాగశ్రావణ్‌కు దేవినేని ఉమా, గద్దె అనురాధ పరామర్శ

విద్యార్థుల సమస్యల పరిష్కారించాలన్న డిమాండ్‌తో తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కిలారు నాగశ్రావణ్ చేస్తున్న నిరవధిక నిరాహార దీక్ష మంగళవారం మూడో రోజుకు చేరుకుంది. అతనిని టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పరామర్శిస్తున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధలు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా నిరసించారు.

కేశినేని చిన్నిని కలిసిన కృష్ణప్రసాద్

వన్‌టౌన్, మార్చి 5: టీడీపీలో చేరిన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మంగళవారం టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని)ని గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణప్రసాద్‌ను సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ బీసీ విభాగం టీడీపీ ప్రధాన కార్యదర్శి, మైలవరం ఏఎంసీ మాజీ చైర్మన్ ఉయ్యూరు వెంకటనరసింహరావు, రామినేని రాజశేఖర్ (రాజా), నల్లూరి నారాయణరావు, పి.రవికుమార్(వెంకయ్య), సూరిబాబు, నరసింహరావు పాల్గొన్నారు.

నూర్‌బాషాలకు అన్యాయం

ధర్నాచౌక్, మార్చి 5: నూర్‌బాషా దూదేకులకు దక్కాల్సిన వాటా పదవులు అగ్రవర్ణ ముస్లింలకు కేటాయిస్తూ తమకు తీరని అన్యాయం చేస్తున్నారని నూర్‌బాషా దూదేకుల ముస్లిం హక్కుల సాధన సమితి అధ్యక్షుడు షేక్ షానవాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. బుర్రకథ పితామహుడు పింజారి నాజర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఖాసీమ్, సుంకేసుల ఖాదర్ బాషా, ఖాసీమ్‌వలీ పాల్గొన్నారు.

టీడీపీ దళిత మహిళా కార్యకర్తకు బెదిరింపులు

- ● అర్ధరాత్రి ఇంటిపై దాడికి యత్నించిన గుర్తుతెలియని వ్యక్తులు
- ● కేకలు పెట్టడంతో పరార్.... పోలీసులకు ఫిర్యాదు

పాయకాపురం, మార్చి 5 : వైసీపీ ప్రభుత్వం అవినీతిని, అసమర్థతను ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే సెంట్రల్ టీడీపీ దళిత మహిళా కార్యకర్తను గుర్తుతెలియని వ్యక్తులు బెదిరింపులకు గురిచే శారు. అర్ధ రాత్రి ఇంటి తలుపులు కొడుతూ గేట్లు తన్ని నానా యాగి చేశారు. దీంతో బాధితురాలు మంగళవారం నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 64వ డివిజన్ కండ్రికకాలనీలో ఉంటున్న టీడీపీ దళిత మహిళా కార్యకర్త తేళ్ల భవాని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొం టున్నారు. వైసీపీ అవినీతిపై సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుండటంతో సోమవారం రాత్రి బంధువు లను ఆటో ఎక్కించేం దుకు కండ్రిక కాలనీ సెంటర్‌కు రాగా స్థానిక వైసీపీ కార్పొరేటర్ భర్త యర్రగొర్ల శ్రీరాము లు మీ ఇంటి వద్ద ఆకతాయిల బెడద తగ్గిందా అంటూ ప్రశ్నించాడు. కనీసం వీధి లైట్లు కూడా లేవని, ఆకతా యిలు బెడద ఎక్కువైందని, పార్క్‌లో గంజాయి బ్యాచ్‌లు చేరుతున్నాయని భవానీ అన్నారు. అర్ధరాత్రి సమయంలో ఇంటి గేటును ఎవరో కాలితో తన్నినట్టు పెద్ద శబ్దం వచ్చింది. బయటకు వద్దామను కునే లోపే తలుపులు కూడా తన్నుతుండటంతో భయంతో కుటుంబ సభ్యులంతా ఇంట్లో ఉండిపోయారు. కేకలు వేయగా ఇరుగు పొరుగు వారు రావడంతో ఉడాయించారు. బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముగిసిన గణితశాస్త్ర జాతీయ సదస్సు



ఫాదర్ జేవియర్ రెక్స్‌ను సత్కరిస్తున్న లయోల కళాశాల యాజమాన్యం

గుణదల, మార్చి 5: గణితశాస్త్ర అధ్యయనంతో మంచి భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ మంచిర్యాల జిల్లా కార్మెల్ అకాడమీ డైరెక్టర్ ఫాదర్ జేవియర్ రెక్స్ అన్నారు. ఆంధ్రా లయోల కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న గణితశాస్త్ర జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. ఫాదర్ జేవియర్ రెక్స్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సుకు గణితశాస్త్రానికి ఉన్న సంబంధాన్ని అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులకు వివరించారు. కళాశాల పూర్వ విద్యార్థిగా నేటితరం విద్యార్థులకు పలుసూచనలు చేశారు. పూర్వపు ప్రిన్సిపాల్ ఫాదర్ విక్టర్ ఇమ్మాన్యుయేల్, విశ్రాంత ఆచార్యులు సి.హెచ్.శేషయ్య, డాక్టర్ ఎన్.వి. రమణమూర్తి, బిఎస్.పద్మావతిని సత్కరించారు. కళాశాల రెక్టర్ ఫాదర్ బాలశౌరి, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్ కుమార్, గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వేణుగోపాలరావు, కో కన్వీనర్‌లు తబిత, అనురాధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2024

క్రీడా, సాంస్కృతిక పోటీలు ప్రారంభం



కృష్ణలంక, మార్చి 5 : ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2024 క్రీడా, సాంస్కృతిక పోటీలు సబ్ కలెక్టర్ ఆఫీసు ప్రాంగణంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 5,6 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన మహిళా ఉద్యోగినులకు ఈనెల 7న విజయవాడ సబ్‌కలెక్టర్ ఆఫీస్ ఆడిటోరియంలో జరుగు అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2024 వేడుకల్లో ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరుగుతుంది. ముగింపు వేడుకలకు ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ విజయకృష్ణన్, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని రాష్ట్ర ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం చైర్‌పర్సన్ పారే లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి తదితరులు తెలిపారు.

డిజిటల్ డ్రైవింగ్ లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ల జారీలో ఉల్లంఘన

వన్‌టౌన్, మార్చి 5: రాష్ట్రంలో రవాణా శాఖ డిజిటల్ లైసెన్స్‌లు, వాహన రిజిస్ట్రేషన్‌ల సర్టిఫికెట్‌లు జారీని అంతర్జాతీయ రోడ్డు భద్రతా నిపుణుడు, జాతీయ రహదారి భద్రతా మండలి సభ్యుడు డాక్టర్ కమల్‌సోయ్ తప్పుబట్టారు. గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ రకమైన డిజిటల్ విధానం చట్టంలో పొందుపరిచిన మార్గదర్శకాలను ఉల్లంఘిస్తుందని తెలిపారు. లామినేటెడ్ కార్డ్ లేదా స్మార్ట్ కార్డుల రూపంలో మాత్రమే డ్రైవింగ్ లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌లు ఇవ్వాలన్నారు. 1989లో రూపొందించిన చట్టాన్ని అమలు చేయాల్సిన అవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. 2023 జూలై 18, ఈ ఏడాది ఫిబ్రవరి 9 తేదీల్లో డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహన రిజిస్ట్రేషన్‌లు గురించి జారీ చేసిన వివరణల మేరకు అమలు చేయాలన్నారు. 2023 జూలై 9న విడుదల అయిన చట్టప రమైన ఆదేశాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వానికి తాను ఇప్పటికే లేఖ రాసినట్లు తెలిపారు. వాహనదారులకు డాక్యుమెంట్లను ఆధునిక పద్ధతు లకు అనుగుణంగా జారీ చేయాల్సిన అవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.



మాట్లాడుతున్న డీఈవో సుబ్బారావు

ముగిసిన స్కౌట్స్, గైడ్స్ శిక్షణ

పటమట, మార్చి 5 : పటమట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు రోజుల నుంచి జరుగుతున్న భారత స్కౌట్స్ గైడ్స్ జిల్లా బిగినర్స్ కోర్సు ట్రైనింగ్ కార్యక్రమం మంగళవారం ముగిసింది. కోర్సు డైరెక్టర్, జిల్లా ఇన్‌చార్జి పి.దాసు ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించి, ప్రతి పాఠశాలలోను స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు స్థాపించే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈవో సుబ్బారావు మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో పిల్లలకు క్రమశిక్షణ అలవాటు అవుతుం దన్నారు. డీవైఈవో కుమార్, భారత్ స్కౌట్స్‌గైడ్స్ ఆర్గనైజేషన్ నుంచి డి.భాస్కర్, రజియా సుల్తానా, పి.లలిత మోహన్ బ్రహ్మాణ్యం పాల్గొన్నారు.



పెళ్ళి... అత్తింటి వేధింపులు... భర్తతో తెగతెంపులు... ఇరవయ్యేళ్ళకే ఒక జీవితానికి సరిపడే అనుభవాలను ఎదుర్కొన్న మంజరీ జరుహార్ తన బతుకును తానే దిద్దుకోవాలనుకున్నారు. సివిల్స్ రాశారు. దేశంలోనే అయిదో, బిహార్‌లో తొలి మహిళా ఐపిఎస్‌గా కొత్త అధ్యాయం ఆరంభించారు. సమర్థతకు, నిజాయితీకి మారుపేరుగా నిలిచారు. 'మేడమ్ సర్' పేరుతో తన కథను అక్షర బద్ధం చేసిన మంజరి స్ఫూర్తిమంతమైన ప్రయాణం ఇది.

మేడమ్ సర్..!

"పురుషులు పనిచేసే చోట తమను తాను నిరూపించుకుంటే చాలు. అదే మహిళైతే... ఇంటా, బయటా నిరూపించుకోవాల్సిందే. మాది బిహార్ రాష్ట్రంలోని పట్నా. మా కుటుంబంలో అందరూ ఉన్నత విద్యావంతులే. ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు చాలామంది ఉన్నారు. కానీ మహిళల విషయానికొచ్చేసరికి... మంచి గృహిణిగా ఉంటే చాలనేది వాళ్ళ అభిప్రాయం. అందుకే నా చదువుకు వాళ్ళు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వలేదు. పంతొమ్మిదేళ్ళ వయసొచ్చేసరికి నాకు వివాహం చేశారు. నా భర్త ఐఎఫ్ఎస్ అధికారి. నాతో గడపడానికి, నన్ను పట్టించుకోడానికి అతనికి సమయం ఉండేది కాదు. మరోవైపు అత్తవారింట్లో తీవ్రమైన వేధింపులు. వాటిని తట్టుకోలేక కొద్దికాలానికే అతనితో విడిపోయాను. నాకు మళ్ళీ పెళ్ళి చెయ్యడానికి మా ఇంట్లోవాళ్ళు చాలా ప్రయత్నం చేశారు. "ఇప్పటివరకూ మీరు చెప్పినట్టు చేశాను. ఇకమీదట నా బతుకును నేనే నిర్ణయించుకుంటాను" అని గట్టిగా వాదించి, వారిని ఒప్పించాను. నేను తీసుకున్న అత్యుత్తమమైన నిర్ణయాల్లో అదొకటి.

> **"నీకిక్కడ పోస్టింగ్ ఇచ్చారు సరే! కానీ నీకు ఏ పని చెప్పాలో నాకు తెలీడం లేదు. ఒక పని చేస్తాను. కిరణ్ బేడీ (దేశంలో తొలి మహిళా ఐపిఎస్) కొత్తగా చేరినప్పుడు ఏం చేశారో తెలుసుకొని... ఆ తరువాత ఆలోచిస్తాను" అన్నారు ఐజీ. చివరకు ఆఫీసులో కూర్చొని చేసే పని ఇచ్చారు. ఫీల్డ్‌లో పని చెయ్యాలనేది నా కోరిక అనీ, అందుకు అనుమతించాలనీ ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసుకున్నాను.**

'ఏ పని చెప్పాలో తెలీడం లేద'న్నారు...

భర్త నుంచి విడిపోయిన తరువాత... పాట్నా ఉమెన్స్ కాలేజీలో ఇంగ్లీష్‌లో (ఆనర్స్), ఢిల్లీ యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాను. అనంతరం సివిల్స్ ప్రిపేరవడం ప్రారంభించాను. ఐపిఎస్ అవ్వాలనే నా లక్ష్యానికి కారణం... నా కుటుంబంలోని ఉన్నతాధికారులుగా పనిచేసినవారు వారు పొందిన గౌరవం. వారి నుంచే నేను స్ఫూర్తి పొందాను. నా గురించి విన్నవారందరూ విడ్డూరంగా చూశారు. ఎందుకంటే... అప్పట్లో మహిళలు సివిల్స్‌కు ప్రిపేర్ కావడం చాలా అరుదు. అయితే... శ్రమిస్తే ఫలితం ఉంటుందనేది నా నమ్మకం. కష్టపడి చదివాను. 1976లో యుపిఎస్‌సి పరీక్ష పాసయ్యాను. బిహార్‌లో తొలి మహిళా ఐపిఎస్‌ని నేనే. అంతేకాదు... దేశంలోనే అయిదోదాన్ని. సివిల్ సర్వెంట్‌గా నా ప్రయాణం అలా ప్రారంభమైంది. సిఐడి ఎఎస్‌పిగా నా తొలి పోస్టింగ్. ఉద్యోగంలో చేరిన మొదటి రోజు నాకింకా గుర్తుంది. ఐజి ఆఫీసులో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వడానికి వెళ్ళినప్పుడు... ప్రతి ఒక్కరూ విచిత్రంగా చూశారు. "నీకిక్కడ పోస్టింగ్ ఇచ్చారు సరే! కానీ నీకు ఏ పని చెప్పాలో నాకు తెలీడం లేదు. ఒక పని చేస్తాను. కిరణ్ బేడీ (దేశంలో తొలి మహిళా ఐపిఎస్) కొత్తగా చేరినప్పుడు ఏం చేశారో తెలుసుకొని... ఆ తరువాత ఆలోచిస్తాను" అన్నారు ఐజీ. చివరకు ఆఫీసులో కూర్చొని చేసే పని ఇచ్చారు. ఫీల్డ్‌లో పని చెయ్యాలనేది నా కోరిక అనీ, అందుకు అనుమతించాలనీ ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసుకున్నాను. చివరకు మా నాన్న స్నేహితుడి సిఫార్సుతో... ఆ అవకాశం వచ్చింది. దాంతో నా జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని చెప్పాలి.



కొన్నాళ్ళు బిహార్‌లో, తరువాత జార్ఖండ్ నేషనల్ పోలీస్ అకాడమీలో, సిఐఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్‌లో విధులు నిర్వర్తించాను. నా కెరీర్లో సంచలనాత్మకమైన, సున్నితమైన అనేక కేసుల్లో పని చేశాను. బిహార్‌లో మొదట బస్సు దోపిడీ కేసు, భాగల్పూర్ బ్లైండింగ్స్ కేసు, 1984లో సిక్కులపై దాడుల కేసు... ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. ప్రధానంగా... మహిళల సమస్యలు నా దృష్టికి వచ్చినప్పుడు... వాటిని పరిష్కరించడం ధ్యేయంగా పనిచేశాను. నేను చేసిన సేవలకు గుర్తింపుగా 'ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్'తో సహా పలు గౌరవాలు అందుకున్నాను. 2010లో సిఐఎస్ఎఫ్ స్పెషల్ డైరెక్టర్ జనరల్‌గా రిటైర్ అయ్యాను. ఆ తరువాత కూడా భారతీయ సంగీత పరిశ్రమ యాంటీ పైరసీ వింగ్‌కు అధిపతిగా ఉన్నాను. ప్రస్తుతం టిసిఎస్‌కు సెక్యూరిటీ కన్సల్టెంట్‌గా, ఫిక్కీ ప్రైవేట్ సెక్యూరిటీ ఇండస్ట్రీ కమిటీ సలహాదారుగా వ్యవహరిస్తున్నాను.



అందుకే రాశాను...

వ్యక్తిగత విషయాలకొస్తే... నా బ్యాచ్ ఐపిఎస్ అధికారి రాకేశ్ జరుహార్‌ను వివాహం చేసుకున్నాను. వృత్తిపరంగా నా ఎదుగుదలలో ఆయన పాత్ర ఎంతో ఉంది. కొత్త కొత్త వంటలు చేయడానికి ప్రయత్నించడం, పర్యటనలు నా అభిరుచులు. ఇప్పుడు నా మనుమలతో ఆడుకోవడం నాకు మంచి కాలక్షేపం. మూడేళ్ళ క్రితం నా ఆత్మకథను రాయాలనే ఆలోచన కలిగింది. అందుకు కారణం... నా వృత్తి జీవితం గురించి వివరించడం మాత్రమే కాదు... మహిళలు సమాజం నుంచి ఎదుర్కొనే వివక్ష గురించి చెప్పడానికి కూడా. నా జీవితమంతా మహిళల దుస్థితిని చూస్తూనే ఉన్నాను. పురుషులు, మహిళలు సమానం కాదనే భావనను మన సమాజం చిన్నవయసునుంచే బాల బాలికల్లో నాటుతూ ఉంటుంది. సమాజంలో మహిళలపట్ల జరుగుతున్న ఎన్నో నేరాలకు కారణం ఇదే. విద్యాపరంగా మహిళలు ఎంత విజయం సాధించినా... ఇంటి పనుల్లో నైపుణ్యాలు కూడా తప్పనిసరి అనేది చాలామంది భావన. ఆడపిల్లలు హైస్కూల్ స్థాయి వరకూ చదువుకొని, కుట్లు, అల్లికలు నేర్చుకుంటే చాలనే మనస్తత్వం కలిగిన కుటుంబంలో పుట్టాను. చిన్న వయసులోనే వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టి, అత్తవారింట్లో వేధింపులు ఎదుర్కొని, భర్తనుంచి వేరుపడ్డాను. అప్పటికి మహిళల సంఖ్య వేళ్ళమీద లెక్కట్టేంత తక్కువగా ఉన్న రంగంలో ప్రవేశించాను. అడుగడుగునా సవాల్ విసిరే వృత్తిలో నన్ను నేను నిరూపించుకోవడానికి తీవ్రంగా శ్రమించాను. ఇవన్నీ అక్షరబద్ధం చేస్తే... కొందరికైనా ప్రేరణ కలుగుతుందని, బాలికలకు, మహిళా ఉద్యోగులకు తమ జీవితాలను తాము మలచుకొనే ధైర్యాన్ని అందిస్తుందనీ అనుకున్నాను. నేను చెప్పగలిగే కథలు నా జీవితంలో, కెరీర్లో ఎన్నో ఉన్నాయి. కానీ నాలో భావోద్వేగాలకు కారణమైన వాటినే ప్రధానంగా నా పుస్తకంలో ప్రస్తావించాను.

వాళ్ళ విజయాలు సంతృప్తి కలిగిస్తున్నాయి...


ఫీల్డ్‌లో నన్ను 'మేడమ్ సర్' అని పిలుస్తూ ఉండేవారు. నా కథకు ఆ పేరు సరిగ్గా సరిపోతుందనిపించింది. అలా నా ఆత్మకథ రెండేళ్ళ కిందట విడుదలైంది. ఈ ఏడాది కొత్తగా ఐపీఎస్ పూర్తి చేసిన యువతీ యువకులను ఉద్దేశించి మాట్లాడే అవకాశం కలిగినప్పుడు మళ్ళీ నా కథ చెప్పాను. వాళ్ళ నుంచి అనూహ్యమైన ప్రతిస్పందన వచ్చింది. నేను ఐపీఎస్ అయినప్పటి కాలంతో పోలిస్తే పరిస్థితులు చాలా మారాయి. ఇప్పుడు అమ్మాయిలు పెద్ద సంఖ్యలో పోలీస్ వృత్తిలోకి వస్తున్నారు. వాళ్ళు సాధించే విజయాలను వింటున్నప్పుడు ఎంతో సంతృప్తి కలుగుతూ ఉంటుంది. భవిష్యత్తులో మరింతమందికి స్ఫూర్తిగా నిలిచేది వాళ్ళ గెలుపు గాథలే. 'మీ ప్రవర్తనతో, సమర్థతతో మీ వృత్తి గౌరవాన్ని పెంచాలి. సమాజంలో సానుకూలమైన మార్పు కోసం మీకు వీలైనంతగా దోహదం చెయ్యాలి. ధైర్యం, పట్టుదల, కోరుకొనేది సాధించాలనే దృఢసంకల్పం... ఇవి ఉంటే మీ విజయాన్ని ఆపేదేమీ ఉండదు" ... నేను మహిళలకు చెప్పగలిగే విషయాలు ఇవే. ఎందుకంటే ఇవన్నీ నేను నేర్చుకున్న పాఠాలు. నా జీవితానుభవాలు."



ప్రపంచ కుబేరులు... రిహానా పాప్ గీతాలు... సల్మాన్... షారుక్ నృత్యాలు... మహామహుల రాకతో జామ్ అయిపోయింది జామ్‌నగర్. వీరందరినీ ఒకే వేదికపైకి తెచ్చింది... అనంత్ అంబానీ... రాధికా మర్చంట్ ప్రీవెడ్డింగ్ ఈవెంట్. ముఖేష్ అంబానీ చిన్న కొడుకుగా అనంత్ అందరికీ తెలిసినవాడే. మరి అతడిని పెళ్లాడనున్న ఈ రాధిక మర్చంట్ ఎవరు? వీ[ళ్ల] మనసులు కలిసింది ఎప్పుడు?

అతడు ఆకాశమంత

రాధికా మర్చంట్... ముఖేష్ అంబానీకి కాబోయే కోడలుగానే కాకుండా ఆమెకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రసిద్ధ ఫార్మాసుటికల్ కంపెనీ 'ఎన్‌కోర్ హెల్త్‌కేర్' సీఈఓ వీరెన్ మర్చంట్, శైలా మర్చంట్ చిన్న కుమార్తె అయిన రాధిక... విద్యావంతురాలు. పారిశ్రామికవేత్త. భరతనాట్య కళాకారిణి. సామాజిక కార్యకర్త. ముంబయిలోని కేథడ్రాల్ అండ్ జాన్ కానన్ స్కూల్, 'ఎకోల్ మాండియల్ వరల్డ్ స్కూల్'లలో ప్రాథమిక విద్య అభ్యసించిన 29 ఏళ్ల రాధిక... 'బీడీ సోమని ఇంటర్నేషనల్ స్కూల్'లో బాకలారియెట్ డిప్లమో పూర్తి చేశారు. అనంతరం అమెరికా వెళ్లిన ఆమె 'న్యూయార్క్ యూనివర్సిటీ'లో పొలిటికల్ సైన్స్ అండ్ ఎకనావిక్స్ చదివారు. 2017లో పట్టభద్రులయ్యారు. అక్కడ చదివే సమయంలోనే పలు సంస్థల్లో బిజినెస్ స్ట్రేటజీ కన్సల్టెంట్‌గా ఇంటర్న్‌షిప్ చేశారు. ముంబయికి తిరిగి వచ్చాక లగ్జరీ రియల్‌ఎస్టేట్ కంపెనీ 'ఇస్ప్రావా'లో జూనియర్ సేల్స్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం తమ 'ఎన్‌కోర్ హెల్త్‌కేర్'కు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న రాధిక... కాబోయే అత్తగారు నీతా అంబానీలా భరతనాట్య కళాకారిణి. ముంబయిలోని 'శ్రీ నిభా ఆర్ట్స్ అకాడమీ'లో భావనా థాకర్ వద్ద భరతనాట్యం నేర్చుకున్నారు. రెండేళ్ల కిందట అరంగేట్రం చేసిన రాధిక... ప్రముఖ వేదికలపై పలు ప్రదర్శనలు కూడా ఇచ్చారు.



సమాజం కోసం...

వ్యాపార కార్యకలాపాల్లో క్షణం తీరిక లేకపోయినా సామాజిక సేవకు కూడా కొంత సమయాన్ని కేటాయిస్తున్నారు రాధిక. ఆమె జంతు ప్రేమికురాలు. జంతు సంరక్షణతో పాటు అట్టడుగు వర్గాలవారికి విద్య అందించేందుకు కృషి చేస్తున్నారు. మానవహక్కుల పరిరక్షణ కోసం తన గళం వినిపిస్తున్నారు. మహిళల ఆర్థిక సాధికారత, స్వావలంబన కోసం కృషి చేస్తున్నారు. రాధిక కుటుంబంలో అందరూ వ్యాపార రంగంలో రాణిస్తున్నవారే. రాధిక తండ్రి వీరెన్ బిలియనీర్. 'ఎన్‌కోర్ హెల్త్‌కేర్'తో పాటు 'ఏపీఎల్ అపోలో ట్యూబ్స్' స్టీల్ కంపెనీ బోర్డ్ మెంబర్‌గా కూడా ఉన్నారు. తల్లి శైల 'ఎన్‌కోర్ హెల్త్‌కేర్' డైరెక్టర్లలో ఒకరు. రాధిక అక్క అంజలి మర్చంట్ భర్త ఆకాష్ మెహతా వ్యాపారవేత్త. వీరెన్ కుటుంబ నికర ఆస్తుల విలువ ఏడొందల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా.

చిన్ననాటి స్నేహం...

'రిలయన్స్' అధినేత ముఖేష్ అంబానీ చిన్న కుమారుడైన అనంత్ అంబానీ, రాధికలది చిన్ననాటి స్నేహం. అంబానీ కుటుంబంలో ఏ వేడుక జరిగినా ఆమె హాజరవుతూ వస్తున్నారు. ముఖేష్ అంబానీ కుమార్తె ఇషా, పెద్ద కుమారుడు ఆకాష్ వివాహ మహోత్సవాల్లో కూడా రాధిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న అనంత్, రాధికల బంధాన్ని మూడు ముళ్ల బంధంగా మార్చాలని ఇరువైపుల పెద్దలు నిశ్చయించారు. దీంతో గత ఏడాది జనవరిలో వీరి నిశ్చితార్థం జరిగింది. ఇటీవలే మూడు రోజులపాటు వారి ప్రీవెడ్డింగ్ వేడుక అంగరంగ వైభవంగా జరిపారు ముఖేష్ అంబానీ. దీంతో రాధిక ఎవరనే ఉత్సుకత జనంలో మరింత పెరిగింది. ప్రపంచంలోని సంపన్నులు, రాజకీయ, సినీ, క్రీడారంగ ప్రముఖులు గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో జరిగిన వేడుకకు క్యూ కట్టారు. స్వర్గం భూతలం మీదకు దిగివచ్చిందా అన్నంత ఆర్భాటంగా జరిగిన ఈ మెగా వేడుకలో అనంత్, రాధిక అతిథులందరినీ ఆప్యాయంగా పలుకరించారు. భోజనాలు వడ్డించారు.

'మా హృదయం ఇక్కడే ఉంది'...

ప్రపంచ ప్రముఖులు హాజరైన వేడుకలో రాధిక తన మనసు విప్పి మాట్లాడారు. కాబోయే అత్తగారు నీతా అంబానీ తనకు స్ఫూర్తి అని, మామగారు ముఖేష్ అంబానీ తనకు తండ్రి సమానులని చెప్పుకొచ్చారు. అలాగే అనంత్‌తో తన అనుబంధం ఎక్కడ ఎలా మొదలైందో అందరితో పంచుకున్నారు. 'మా ఇద్దరి హృదయం... జామ్‌నగర్. ఇక్కడే మేం పెరిగాం. ఇక్కడే స్నేహితులం అయ్యాం. ఇక్కడే ప్రేమలో పడ్డాం. ఇక్కడే మా అనుబంధాన్ని నిర్మించుకున్నాం. భవిష్యత్తులో కలిసి జీవించాలని నిర్ణయించుకున్న మా తొలి అడుగు కూడా ఇక్కడి నుంచే పడింది. ఈ ప్రదేశం మా మధుర జ్ఞాపకాలకు, మా లోతైన రహస్యాలకు, మా మధ్య విరబూసిన నవ్వులకు, మా సంతోషాలు నిండిన సంబరాలకు నిలయం. మేం కలిసి నడిచిన ప్రతి ఘట్టంలో భాగం. మేము ఎదుర్కొన్న ఎత్తుపల్లాలకు సాక్ష్యంగా నిలిచింది ఈ నగరం' అంటూ ఎంతో భావోద్వేగంతో చెప్పుకొచ్చారు రాధిక.

అలా 'లాక్' అయ్యారు...

అనంత్, రాధిక ప్రేమకు బలమైన పునాది పడింది కరోనా లాక్‌డౌన్‌లోనట. '2020 మార్చి... కరోనా విజృంభిస్తున్న సమయం. అప్పుడు లాక్‌డౌన్‌తో నేను, అనంత్ జామ్‌నగర్‌లో లాక్ అయిపోయాం. ఎంత ప్రయత్నించినా కొన్ని నెలల పాటు మా ప్రాంతాలకు తిరిగి వెళ్లలేకపోయాం. ఒక్కసారిగా కుటుంబానికి దూరంగా ఉండటం ఎంత కష్టమో తెలుసు. కానీ మేమిద్దరం చిన్న చిన్న ఆనందాలను పంచుకొంటూ ఆస్వాదించాం. అవే ఇప్పుడు మాకు జీవితకాల జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. మానవత్వం ఉన్న మనిషిగా అనంత్‌ను అప్పుడే చూశాను. తన కలల ప్రాజెక్ట్ అయిన 'వంతారా'ను ఒక స్థాయికి తీసుకురావడానికి అతడు పడిన శ్రమను చూశాను. అతనితో ఈ ప్రయాణం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. అతడి నుంచి ఎన్నో నేర్చుకున్నాను. అనంత్‌ను చూసినప్పుడు నేను ఎంత గర్వంగా భావిస్తానో మాటల్లో చెప్పలేను. మంచిని, చెడును, అందాన్ని, ఆనందాన్ని, బాధను, లౌక్యాన్ని... అన్నిటినీ పంచుకొని, ప్రేమించే వ్యక్తి జీవిత భాగస్వామిగా కావాలనే ఎవరైనా కోరుకొనేది. ఆ అర్హతలన్నీ అతడిలో ఉన్నాయి' అంటూ కాబోయే భర్తను ఆకాశమంత ఎత్తులో నిలిపారు రాధిక. జూలై 12న వీరి వివాహానికి పెద్దలు ముహూర్తం ఖరారు చేశారు.

నొప్పులు తగ్గించే తర్బూజ

- తర్బూజ పండులో పోషకాలు అనేకం. ఇందులో పీచుపదార్థం ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల కడుపు త్వరగా నిండినట్లు అనిపిస్తుంది. ఇది తిన్నాక ఆకలి వేయదు. నీటిశాతం ఎక్కువే. ముఖ్యంగా ఈ పండులోని పొటాషియం కొవ్వును తగ్గిస్తుంది. జీర్ణక్రియను సాఫీగా ఉంచుతుంది.
- తర్బూజ పండు తినటం వల్ల మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. తద్వారా టెన్షన్ తగ్గి నిద్ర పడుతుంది.
- ఈ జ్యూస్ తాగటం వల్ల చక్కెరశాతం పెరగదు. పైగా కిడ్నీలోని రాళ్ల కరిగిపోతాయి.
- విటమిన్ సి,ఎ ఉండటం వల్ల ఇదో అద్భుతమైన ఇమ్యూనిటి బూస్టర్‌లా పని చేస్తుంది. జలుబు, దగ్గులాంటివి దరి చేరవు.
- కంటికి ఎంతో మేలు చేసే పండు తర్బూజ.
- బరువు ఎక్కువగా ఉండే వాళ్ల తర్బూను డైట్‌లో ఉంచుకుంటే బరువు తగ్గుతారు. అంతెందుకూ వీటి విత్తనాలు కూడా ఫైబర్‌ను కలిగి ఉండటం వల్ల డీహైడ్రేషన్ సమస్యనుంచి కాపాడుతుంది.
- సాయంత్రం స్నాక్స్‌గా ఎండాకాలం తినొచ్చు. ఈ పండును తింటే రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. రక్తపోటు లాంటివి కనపడవు. దీనివల్ల గుండె ఆరోగ్యానికి మంచి జరుగుతుంది.
- తర్బూజ పండు తినటం వల్ల కొల్లాజిన్ ఉత్పత్తి జరుగుతుంది. జుట్టు పెరుగుతుంది. ముఖ్యంగా ఈ పండ్లతో ఫేస్‌ప్యాక్ వేసుకుంటే చర్మం మృదువుగా ఉంటుంది.
- యాంటీ ఇన్ఫ్లమేషన్ గుణాలు ఇందులో ఉండటం వల్ల కీళ్ళ, మోకాళ్ల, చేతి మెడిమలు దగ్గర నొప్పులు వచ్చే అవకాశం తక్కువ.
- పండు తినని వాళ్ల రసం, సలాడ్స్‌తో తినొచ్చు. ఈ పండు తినటం వల్ల దంతాల నొప్పులు తగ్గిపోతాయి. 2016 అధ్యయనం ప్రకారం పంటి నొప్పిని తగ్గించే శక్తి ఈ పండుకు ఉందని పరిశోధకులు తేల్చారు.
- ఫోలిక్ యాసిడ్ ఉండటం వల్ల గర్భిణిలు కూడా తినొచ్చు. దీనివల్ల బిడ్డ ఎదగటానికి ఉపయోగపడుతుంది.



వేసవి వేగంగా వచ్చేస్తోంది. రోజు రోజుకు వేడి పెరిగిపోతోంది. ఇలాంటి సమయంలో ఎలాంటి బట్టలు వేసుకోవాలనేది చాలా మందికి ఎదురయ్యే ప్రశ్న. సరైన బట్టలు వేసుకోపోతే- రోజంతా ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. అందుకే వేసవిలో ఎలాంటి బట్టలు ధరించాలో తెలుసుకుందాం.

వేసవిలో ఇవి బెస్ట్

పొడవు చేతులు వద్దు..

పొడవు చేతులు ఉన్న డ్రస్సులు.. మోకాళ్ల దాకా ఉండే చూడిదార్లు వేసవిలో ధరించకుండా ఉంటే మంచిది. పొడవు చేతులు ఉన్న డ్రస్సుల వల్ల వంటి నుంచి వచ్చే వేడి బయటకు వెళ్లదు. దీని వల్ల చెమట ఎక్కువ పడుతుంది. ఒక వేళ పొడవు చేతులు వేసుకోవటం తప్పనిసరి అయితే- కాటన్ డ్రస్సులనే ధరించండి.

బిగుతు బట్టలు వద్దు...

చాలా మంది ఫ్యాషన్ కోసం బిగుతు బట్టలు వేసుకుంటారు. బిగుతుగా ఉన్న బట్టలు వేసుకుంటే- చెమట ఆరదు. దీని వల్ల అసౌకర్యంగా అనిపిస్తుంది. వీలైనంత వరకు కొద్దిగా లూజుగా ఉండే బట్టలు వేసుకుంటే మంచిది. కాటన్ బట్టలు వేసుకోవటం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి.

సాక్స్ వద్దు

చాలా మంది బట్టలకు మ్యాచింగ్ అయ్యే సాక్సులు వేసుకుంటారు. సాక్సులు వేసుకోవటం వల్ల శరీరం వేడి ఎక్కుతుంది. ఇబ్బంది మరింత పెరుగుతుంది. అందువల్ల సాక్స్ వేసుకోకపోవటం మంచిది. వేసవిలో శాండిల్స్ ధరించటమే ఉత్తమం.

జీన్స్ వద్దు

వేసవి కాలంలో జీన్స్ వేసుకోకపోవటం మంచిది. ఒక వేళ తప్పని సరిగా వేసుకోవాలంటే- తేలికపాటి జీన్స్ వేసుకుంటే మంచిది.



లేత రంగులే ముద్దు..

లేత రంగులు వేసుకోవటం వల్ల సూర్యకిరణాలు చొచ్చుకుపోవు. చెదిరిపోతాయి. దీని వల్ల శరీరం వేడి ఎక్కదు. ముదురు రంగులు వేసుకోవటం వల్ల సూర్యకిరణాలు చొచ్చుకుపోతాయి. శరీరం వేడెక్కిపోతుంది.

తరచు కదలండి...

ఎక్కువ సేపు ఒకే చోట కూర్చుంటే- వేడి పెరిగిపోతుంది. చెమట పట్టి ఇబ్బందిగా ఉంటుంది. అందువల్ల వేసవిలో తరచూ అటూ ఇటూ కదులుతూ ఉండాలి. అప్పుడు గాలి బట్టలలో ఉన్న ఖాళీల ద్వారా చర్మంపైకి వెళ్తుంది.

షూలు కూడా

చాలా మంది వేసవిలో బరువైన లెదర్ షూలు లేదా.. స్పోర్ట్స్ షూలు ధరిస్తూ ఉంటారు. బయట వాతావరణంలో వేడి ఎక్కువగా ఉండటం వల్ల కాళ్లకు చెమట పడుతుంది. అంతే కాకుండా బరువైన షూస్‌ను ధరించటం వల్ల బయట నుంచి గాలి కూడా ఎక్కువ ప్రసరించదు. దీని వల్ల పాదాలకు ఇబ్బంది ఏర్పడుతుంది.



కాటన్స్ వంటివి..

కాటన్ బట్టలు.. తక్కువ బరువు ఉండే బట్టలు వేసుఉంటే మంచిది. బరువు ఎక్కువగా ఉన్న బట్టలు వేసుకోవటం వల్ల వేసవిలో ఇబ్బందిగా అనిపిస్తుంది.



ఏ పాము కరిచినా ఒకే ఇంజెక్షన్




న్యూయార్క్, మార్చి 5: ఎవరికైనా పాము కాటేస్తే.. వారికి యాంటీ వెనమ్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు. కానీ, ఇక్కడో చిక్కుంది. పాముల్లో చాలా రకాలుంటాయి. కరిచిన పామును బట్టి యాంటీవెనమ్ ఇంజెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే.. ఏ ప్రాంతంలో ఏ రకం పాములు ఎక్కువగా ఉంటే.. వాటి విషానికి విరుగుడుగా పనిచేసే ఇంజెక్షన్లను ఎక్కువగా ఉంచుతారు. పాము విషాన్ని స్వల్ప మోతాదుల్లో గుర్రాలు, గొర్రెల వంటివాటికి ఇచ్చి వాటి శరీరాల్లో ఆ విషానికి తయారైన యాంటీబాడీలను సేకరించి, వాటిని శుద్ధి చేసి తయారు చేసే ఇంజెక్షన్లు అవి. ఇంత ప్రయాస లేకుండా.. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో కనిపించే పలు రకాల 'ఎలాపిడ్' పాముల్లో ఏ జాతి సర్పం కరిచినా కాపాడే సింథటిక్ యాంటీబాడీతో తయారైన ఇంజెక్షన్ అందుబాటులోకి వస్తే? '95మ్యాట్5' అనే యాంటీబాడీతో అలాంటి సూదిమందునే తయారుచేశామని స్క్రిప్స్ రిసెర్చ్ శాస్త్రవేత్తలు అంటున్నారు. సాధారణంగా పాముల విషాలు.. న్యూరోటాక్సిక్, హీమోటాక్సిక్ అని రెండు రకాలుగా ఉంటాయి. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో కనిపించే కింగ్ కోబ్రా, బ్లాక్ మాంబా, సముద్రపాములు, కోరల్ స్నేక్స్, క్రెయిట్స్ వంటి 200 రకాల పాములు న్యూరోటాక్సిన్లను విడుదల చేస్తాయి. ఇవన్నీ ఎలాపిడ్ కుటుంబానికి చెందిన పాములు. వీటి విషం మన నాడీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుంది. ఫలితంగా మరణం సంభవిస్తుంది. ఇక హీమోటాక్సిక్ అంటే.. రక్తాన్ని గడ్డకట్టించే రకం విషం. ఈ తరహా విషాన్ని విడుదల చేసేవి వైపర్లు. ర్యాటిల్ స్నేక్స్, కాపర్‌హెడ్స్, కాటన్‌మౌత్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. స్క్రిప్స్ రిసెర్చ్ శాస్త్రవేత్తలు.. ఎలాపిడ్ పాముల విషంలో ఉండే లాంగ్‌చైన్ త్రీ ఫింగర్ ఆల్ఫా న్యూరోటాక్సిన్లను నిర్వీర్యం చేసే యాంటీబాడీని గుర్తించడం కోసం 10 వేల కోట్ల యాంటీబాడీలను జల్లెడ పట్టారు. వాటిలో.. 95మ్యాట్5 అనే యాంటీబాడీకి ఒక్క కింగ్‌కోబ్రా తప్ప బ్లాక్‌మాంబా సహా అన్ని రకాల పాముల విషాన్నీ విరిచే గుణం ఉన్నట్టు వెల్లడైంది. ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో అది రుజువైంది. కింగ్ కోబ్రా విషాన్ని ఎక్కించిన ఎలుకల్లో మాత్రం ఈ యాంటీబాడీ పనిచేయలేదు. విషప్రభావంతో అవి చనిపోయాయి. కానీ.. వాటి మరణాన్ని కొంత ఆలస్యం చేయగలిగిందీ యాంటీబాడీ!! కాగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ఏటా ప్రపంచవ్యాప్తంగా 81 వేల మంది నుంచి 1.38 లక్షల మంది పాముకాటుకు బలవుతున్నారు.

రీసైకిల్ ప్లాస్టిక్‌లో విష రసాయనాలు

న్యూఢిల్లీ, మార్చి 5: రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ ఉత్పత్తుల్లో విషపూరితమైన రసాయనాలు అధికంగా ఉన్నాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఢిల్లీలోని 'టాక్సిక్ లింక్స్' ఈ అధ్యయనాన్ని నిర్వహించింది. 'ఎలాంటి నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ వాడకం ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్లాస్టిక్‌లో విషపూరితమైన రసాయనాలు ఉంటున్నాయి' అని మంగళవారం విడుదలైన తాజా అధ్యయనం పేర్కొంది. అధ్యయనంలో భాగంగా మార్కెట్‌లో విరివిగా లభించే 15 రకాల ప్లాస్టిక్ వస్తువుల నమూనాలను పరిశీలించిన పరిశోధకులు.. వాటిలో 60 శాతానికిపైగా విష రసాయనాలు ఉన్నాయని గుర్తించినట్టు వెల్లడించారు.

లోకం తీరు



ధర్మాసనం నుంచి కమల దళంలోకి..

- బీజేపీలో చేరనున్న కలకత్తా హైకోర్టు మాజీ జడ్జి అభిజిత్
- రాజీనామా చేసిన గంటల్లోనే ప్రకటన



కోల్‌కతా, మార్చి 5: కలకత్తా హైకోర్టు జడ్జి పదవికి రాజీనామా చేసిన జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ బీజేపీలో చేరనున్నారు. పదవికి రాజీనామా చేసిన కొద్ది గంటల్లోనే ఆయన ఈ మేరకు ప్రకటించారు. ఆయన తన రాజీనామా పత్రాన్ని మంగళవారం ఉదయమే రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిలకు పంపించారు. పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకున్న ఉపాధ్యాయుల భర్తీ కుంభకోణం, తదితర అంశాలపై ఆయన గతంలో తీర్పులు ఇవ్వడం గమనార్హం. రాజీనామా అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తృణమూల్ అవినీతికి మారుపేరుగా మారిందని ఆరోపించారు. బీజేపీ జాతీయ పార్టీ కావడం, తృణమూల్ అవినీతిపై పోరాడుతున్నందువల్లనే ఆ పార్టీలో చేరనున్నట్టు తెలిపారు. బహుశా గురువారం ఆ పార్టీలో చేరే అవకాశం ఉందని వెల్లడించారు. బీజేపీ నాయకత్వం తనతో సంప్రదింపులు జరిపిందని తెలిపారు. ఉపాధ్యాయ భర్తీ కుంభకోణంపై తాను తీర్పు ఇచ్చిన తరువాత తృణమూల్ నాయకులు తనను దుర్భాషలాడారని, అందుకే రాజకీయాల్లో చేరి తృణమూల్‌పై పోరాడాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ఆ పార్టీకి రోజులు దగ్గర పడ్డాయని, మరో రెండు అరెస్టులు జరిగితే ఆ పార్టీ ఉనికే ఉండదని అన్నారు. ప్రధాని మోదీ కష్టజీవి అని, మతాన్ని, దేవుడ్ని నమ్ముకొని దేశం కోసం ఎంతో చేస్తున్నారని ప్రశంసించారు. అభిజిత్ గ న్యాయమూర్తిగా ఉన్నప్పుడు పలు అసాధారణ నిర్ణయాలు తీసుకొని వివాదాస్పదునిగా మారారు. విచారణ జరుపుతున్న కేసుపై ఇంటర్వ్యూ ఇవ్వడం, దీనిపై ఏకంగా సుప్రీం కోర్టుకే నోటీసులు ఇవ్వడం, సహచర జడ్జిపై విమర్శలు చేయడం, లాయర్లతో ఘర్షణకు దిగి విమర్శలకు గురయ్యారు.

తృణమూల్‌కు తపస్ రాయ్ రాజీనామా

కోల్‌కతా, మార్చి 5: తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తపస్ రాయ్ సోమవారం పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఆయన 1996 నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడం గమనార్హం. మున్సిపాలిటీ ఉద్యోగాల భర్తీలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఈడీ తన నివాసంలో సోదాలు చేసినా సీఎం మమత మాటమాత్రంగా ఖండించలేదంటూ కినుక వహించి ఈ నిర్ణయం తీసుకున్నారు. తాను ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నా ఏనాడూ మెడికల్ బిల్లులు పెట్టుకోలేదని, అలాంటిది తనపై ఈడీ దాడులు జరిగాయని వాపోయారు. ఆయన బీజేపీలో చేరే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

బీజేపీలో చేరిన వారాణసీ మాజీ ఎంపీ రాజేశ్

న్యూఢిల్లీ, మార్చి 5: ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సీనియర్ నాయకుడు, వారాణసీ మాజీ ఎంపీ రాజేష్ మిశ్రా బీజేపీలో చేరారు. కాంగ్రెస్‌లో మొదలైన తన రాజకీయ జీవితం ఇక నుంచి బీజేపీకే అంకితమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షానికి వారాణసీ నియోజకవర్గంలో బూత్ కార్యకర్త దొరకడం కూడా గగనమేనని ఆరోపించారు. కాగా, మోదీ వరుసగా మూడోసారి వారాణసీ నుంచి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే.

12 నుంచి రైలు ప్రయాణికులకూ స్విగ్గీ సేవలు

న్యూఢిల్లీ, మార్చి 5: ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ రైలు ప్రయాణికులకు కూడా తమ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 12వ తేదీ నుంచి దక్షిణాదిలో తమ సేవలు అందించేందుకు సిద్ధమైంది. తొలివిడతలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నంతో పాటు కర్ణాటకలోని బెంగళూరు, ఒడిసాలోని భువనేశ్వర్ రైల్వేస్టేషన్లలో ఈ సేవలు ప్రారంభంకానున్నాయి. రాబోయే రోజుల్లో మరో 59 స్టేషన్లకు ఈ సేవలు విస్తరించనున్నట్టు స్విగ్గీ తెలిపింది. ఫుడ్ డెలివరీకి స్విగ్గీ, ఐఆర్‌సీటీసీ మధ్య మంగళవారం ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ప్రయాణికులు స్విగ్గీలో ఫుడ్ ఆర్డర్ చేయాలంటే ఐఆర్‌సీటీసీ యాప్‌ను వినియోగించాల్సి ఉంటుంది. అందులో పీఎన్‌ఆర్ నంబర్‌ను ఎంటర్ చేసి.. తాము కోరుకున్న ఆహారాన్ని, కావాల్సిన స్టేషన్‌లో డెలివరీ తీసుకోవచ్చు.

ఫేస్‌బుక్, ఇన్‌స్టా సేవల్లో తీవ్ర అంతరాయం!

న్యూఢిల్లీ, మార్చి 5: ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సేవలు మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఫలితంగా యూజర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు తమ ఖాతాలు హ్యాక్ అయ్యాయేమోనని కంగారుపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా 90వేలకు పైగా ఫేస్‌బుక్ ఖాతాలు, 16వేలకుపైగా ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు స్తంభించిపోయాయంటూ రిపోర్టులు వచ్చాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టా సేవలు నిలిచిపోవడానికి కారణం తెలియరాలేదు. అయితే ఖాతాదారులు మాత్రం ఎక్స్ (ట్విటర్) వేదికగా తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. రాత్రి 10:30 ప్రాంతంలో సేవలు అందుబాటులోకొచ్చాయి.

ప్రపంచ కుబేరుడుగా మళ్లీ అమెజాన్ అధినేత

సెంట్రల్ డెస్క్, మార్చి 5: ప్రపంచంలో అత్యంత ధనికుడుగా అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ నిలిచారు. ఎలాన్ మస్క్ నుంచి ఆయన ఈ స్థానాన్ని మళ్లీ దక్కించుకున్నారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం ఆయన ఆస్తి విలువ 200 బిలియన్ డాలర్లు. మస్క్ ఆస్తి విలువ 198 బిలియన్ డాలర్లకు తగ్గిపోయింది. మంగళవారం ప్రచురించిన బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం టెస్లా సీఈవో మస్క్ గత ఏడాది 31 బిలియన్ డాలర్ల సంపద కోల్పోయారు. ఇదే కాలంలో బెజోస్ సంపద 23 బిలియన్ డాలర్లు పెరిగింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేష్ అంబానీ, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ ఈ జాబితాలో 11, 12 స్థానాల్లో నిలిచారు. వారి సంపద 115, 104 బిలియన్ డాలర్లుగా ఉంది.

ఫ్రాన్స్‌లో అబార్షన్ ఇక రాజ్యాంగ హక్కు

న్యూఢిల్లీ, మార్చి 5: ఫ్రాన్స్ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అబార్షన్‌ను మహిళల రాజ్యాంగ హక్కుగా నిర్ణయిస్తూ తీసుకొచ్చిన బిల్లును ఫ్రాన్స్ పార్లమెంట్ ఆమోదించింది. సోమవారం జరిగిన ఉభయసభల (జాతీయ అసెంబ్లీ, సెనేట్) ప్రత్యేక ఉమ్మడి సమావేశంలో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. ఎంపీలు, సెనేటర్లు ఓటింగ్‌లో పాల్గొనగా ఈ బిల్లుకు మద్దతుగా 780 ఓట్లు, వ్యతిరేకంగా 72 ఓట్లు వచ్చాయి. ఆమోదం అనంతరం సభ్యులంతా లేచి నిలబడి కరతాళ ధ్వనులతో సంఘీభావం తెలిపారు. దీంతో.. అబార్షన్‌ను రాజ్యాంగ హక్కుగా గుర్తించిన తొలి దేశంగా ఫ్రాన్స్ చరిత్ర సృష్టించింది. బిల్లు ఆమోదం సందర్భంగా ఫ్రాన్స్ ప్రధాని గాబ్రియెల్ అటల్ మాట్లాడుతూ.. ఇకపై అబార్షన్ విషయంలో మహిళలు సొంతంగా నిర్ణయం తీసుకోవచ్చన్నారు.

మాల్దీవులకు చైనా ఉచిత సైనిక సాయం

మాలే, మార్చి 5: భారత్‌తో దౌత్యపరమైన వివాదాలను పెంచుకుంటున్న మాల్దీవుల్లో పాగాకు చైనా సిద్ధమైంది. ఈ క్రమంలో ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా.. మాల్దీవులకు సైనిక సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. దీనిపై ఇరు దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మాల్దీవుల రక్షణ శాఖ మంగళవారం వెల్లడించింది. సోమవారం మాల్దీవుల రక్షణ మంత్రి మహమ్మద్ ఘసన్, చైనా మేజర్ జనరల్ జాంగ్ బావోకున్ ఈ ఒప్పందంపై సంతకాలు చేసినట్లు చెబుతూ.. చైనా ఉచితంగా సైనిక సహకారం అందజేస్తున్నట్లు వివరించింది. హిందూ మహాసముద్రంలో పాగాకు చైనా చేస్తున్న యత్నాలను అడ్డుకుంటున్న భారత్‌కు ఇది ఒకింత ఇబ్బందికరమైన పరిణామమే..! ఇప్పటికే శ్రీలంకకు చైనా దగ్గరైంది.

సుప్రీం తీర్పు నిర్వీర్యానికి ఎత్తు!

ఎలక్టోరల్ బాండ్ల వివరాలిస్తే గుట్టు రట్టవుతుందని బీజేపీకి భయం.. అందుకే ఎస్‌బీఐపై ఒత్తిడి: ఖర్గే



న్యూఢిల్లీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎలక్టొరల్ బాండ్లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)ని వాడుకుంటోందని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. రాజ్యాంగవిరుద్ధమైన ఈ బాండ్ల స్కీంలో ప్రధాన లబ్ధిదారు బీజేపీయేనని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు నగదు చేసుకున్న ఎలక్టొరల్ బాండ్ల సమగ్ర వివరాలు ఈ నెల 6వ తేదీలోగా సమర్పించాలని సుప్రీంకోర్టు ఎస్‌బీఐని ఆదేశించగా.. జూన్ 30 వరకు గడువివ్వాలని బ్యాంకు సోమవారం కోర్టును ఆశ్రయించడంపై ఖర్గే మంగళవారం 'ఎక్స్'లో తీవ్రంగా స్పందించారు. సందేహాస్పద లావాదేవీలను కప్పిపుచ్చుకోవడానికి మోదీ సర్కారు ఎస్‌బీఐని కవచంలా వాడుకుంటోందని విమర్శించారు. 'జూన్ 15లోపు లోక్‌సభ ఎన్నికలు ముగుస్తాయి. ఆ తర్వాతే ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఎస్బీఐ కోర్టుకు అందించాలని బీజేపీ కోరుకుంటోంది. అందుకే జూన్ 30 వరకు ఎస్‌బీఐ గడువు కోరింది. హైవేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పవర్ ప్లాంట్లు తదితర కాంట్రాక్టులను మోదీ అనుకూల పెట్టుబడిదారులకు కట్టబెట్టినందుకు బాండ్ల రూపంలో బీజేపీ సాగించిన అక్రమ లావాదేవీలను ప్రభుత్వం దాచిపెడుతోంది. బాండ్ల డోనర్లకు సంబంధించి 44,434 ఆటోమేటిక్ డేటా ఎంట్రీలను క్రోడీకరించి 24గంటల్లో వివరాలు ఇవ్వొచ్చని నిపుణులు చెబుతున్నారు. మరి ఎస్‌బీఐ 4నెలలు ఎందుకు అడుగుతోంది? మోదీ సర్కారు సుప్రీం తీర్పును కాలరాయడానికి ఎస్‌బీఐని పావుగా వాడుకుంటోంది' అని ఖర్గే విరుచుకుపడ్డారు.

బీజేపీకి రూ.6,566 కోట్ల లబ్ధి: కాంగ్రెస్

2017 నుంచి గత ఆర్థిక సంవత్సరం వరకు అన్ని పార్టీలూ మొత్తం రూ.12 వేల కోట్ల విలువ చేసే ఎలక్టొరల్ బాండ్లు అందుకోగా.. అందులో సగానికి పైగా.. రూ.6,566.11 కోట్ల విలువ చేసే బాండ్లు ఒక్క బీజేపీకే వచ్చాయని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనతే ఢిల్లీలో తెలిపారు. "2018-23 నడుమ కేంద్ర ఏజెన్సీల చర్యలు ఎదుర్కొన్న 30 కంపెనీలు ఆ పార్టీకి రూ.335 కోట్లు విరాళంగా ఇచ్చాయని మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ సమాచారం ఎవరితోనూ పంచుకోవద్దని ఎస్‌బీఐపై మోదీ సర్కారు, బీజేపీ ఒత్తిడి తెస్తున్నాయి" అని ఆరోపించారు. ఒక్క క్లిక్‌తో ఐదు నిమిషాల్లో చేతుల్లోకి వచ్చే సమాచారాన్ని కోర్టుకు ఇవ్వడానికి అతిపెద్ద కంప్యూటరైజ్డ్ బ్యాంకుకు 4 నెలల సమయం ఎందుకని నిలదీశారు. 23 వేల బ్రాంచ్‌లు, 48 కోట్ల బ్యాంకు ఖాతాలు, 66 వేల ఏటీఎంలు కలిగి ఉన్న ఎస్‌బీఐకి కేవలం 22,217 ఎలక్టొరల్ బాండ్ల సమాచారం ఇవ్వడానికి నాలుగు నెలలు ఎందుకని ప్రశ్నించారు.

కేంద్రానికి మేలు చేసేందుకే: ప్రశాంత్

ఎన్నికల బాండ్ల వివరాల వెల్లడితో కేంద్ర ప్రభుత్వానికి ఇబ్బంది లేకుండా.. దానికి ఎన్నికలయ్యేదాకా సమయం దక్కేందుకే ఎస్‌బీఐ గడువు కోరుతోందని ప్రముఖ లాయర్ ప్రశాంత్ భూషణ్ 'ఎక్స్'లో మంగళవారం ఆరోపించారు. తద్వారా బీజేపీకి అందిన రూ.10వేల కోట్ల విలువైన ఎన్నికల బాండ్ల వివరాలు వెంటనే బయటకు రాకుండా చూస్తుందన్నారు. ఎన్నికల బాండ్లు కొన్నవారు, వాటిని తీసుకున్న రాజకీయ పార్టీలకు సంబంధించి ఎస్‌బీఐ ఒక రహస్య సంఖ్యను నిర్వహిస్తుందని తెలిపారు.

జై శ్రీరామ్ అనాలి.. ఆకలితో చావాలి

నిరుద్యోగ యువతకు మోదీ పిలుపు ఇదే: రాహుల్

న్యూఢిల్లీ, మార్చి 5: నిరుద్యోగం, ఆకలి సమస్యలతో చనిపోయే ప్రజలను ఆదుకోవాల్సిన ప్రధాని మోదీ, వారు జై శ్రీరామ్ అని అనాలని పిలుపునిస్తున్నారని రాహుల్‌గాంధీ విమర్శించారు. నిరుద్యోగ యువత రోజంతా ఫోన్లలో రీల్స్ చూడాలనీ, ఆ తర్వాత జై శ్రీరామ్ అంటూ ఆకలితో చనిపోవాలని మోదీ కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లోని సారంగపూర్‌లో మంగళవారం భారత్ జోడో న్యాయ యాత్ర కొనసాగింది. సారంగపూర్‌లో పాదయాత్ర చేస్తున్న రాహుల్‌ను ఉద్దేశించి కొందరు బీజేపీ యువ కార్యకర్తలు.. 'జై శ్రీరామ్.. జై శ్రీరామ్..', 'మోదీ.. మోదీ..' అంటూ నినాదాలు చేశారు. వారిని ఉద్దేశించి ఆయన కొద్దిసేపు మాట్లాడారు. అగ్నిపథ్ పథకం యువత అవకాశాలను హరించిందన్నారు. "సైన్యంలో యువతకు రెండు రకాల హామీలు ఉండేవి. గతంలో వారికి పెన్షన్ ఇచ్చేవారు. సర్వీసులో చనిపోతే తగిన గౌరవం లభించేది. మోదీ ప్రభుత్వంలో ఈ రెండింటికీ యువత దూరమైంది. అగ్నిపథ్ పథకానికి నాలుగు ఎంపికైతే, నాలుగేళ్ల తర్వాత వారిలో ముగ్గురిని సైన్యం నుంచి పంపించివేస్తారు. ఆ ముగ్గురూ ఎస్సీలు, ఎస్టీలు, బీసీలే అయి ఉంటారు" అని రాహుల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 'తమిళనాడు ప్రజలు జైశ్రీరామ్ నినాదాన్ని గానీ, 'భారత్‌మాత' నినాదాన్ని గానీ అంగీకరించరు' అని వ్యాఖ్యానించి డీఎంకే ఎంపీ రాజా మరో వివాదంలో చిక్కుకున్నారు. రాజా వ్యాఖ్యలపై కేంద్ర బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు.

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కర్నూలు	39.2	25.1
నంద్యాల	38.0	24.0
ఏలూరు	37.0	22.0
ఒంగోలు	33.8	24.0
బాపట్ల	33.8	22.7

'ఎల్‌నినో' తగ్గినా... వేసవిలో సెగలే!

ఈసారి రికార్డు ఉష్ణోగ్రతలు: డబ్ల్యూఎంవో

న్యూఢిల్లీ, మార్చి 5: ఎల్‌నినో బలహీనపడినప్పటికీ పసిఫిక్ మహాసముద్రం ఉపరితలం నుంచి వచ్చే వేడిగాలులతో దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ మార్చి నుంచి మే నెల వరకూ సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంవో) హెచ్చరించింది. మార్చి-మే నెలల్లో ఎల్‌నినో కొనసాగడానికి 60% అవకాశం ఉండగా, ఏప్రిల్ నుంచి జూన్ వరకూ తటస్థ పరిస్థితులు నెలకొనడానికి 80% అవకాశం ఉందని డబ్ల్యూఎంవో అంచనా వేసింది. 2023 జూన్ నుంచి ప్రతి నెలా సరికొత్త ఉష్ణోగ్రత రికార్డును నెలకొల్పింది. దీనికి ఎల్‌నినో కూడా కొంతవరకూ దోహదం చేసింది. 'ప్రపంచవ్యాప్తంగా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు గత 10 నెలలుగా అసాధారణంగా పెరగడం ఆందోళనకరం' అని డబ్ల్యూఎంవో సెక్రటరీ జనరల్ సెలస్టే సౌలో పేర్కొన్నారు. కాగా, జూన్ నుంచి తటస్థ పరిస్థితులు ప్రారంభమై ఆగస్టు నాటికి లానినా మొదలవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

మనీలాండరింగ్ కేసులో డీకే శివకుమార్‌కు ఊరట

కేసును కొట్టేసిన సుప్రీంకోర్టు



బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు ముందు కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు అతిపెద్ద ఊరట లభించింది. ఆయనపై ఈడీ దాఖలు చేసిన మనీల్యాండరింగ్ కేసును సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని ధర్మాసనం ఈ కీలకతీర్పునిచ్చింది. 2017 ఆగస్టు 2న ఆదాయ పన్నుశాఖ అధికారులు బెంగళూరు, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో ఏకకాలంలో డీకే శివకుమార్ ఇళ్లు, కార్యాలయాలపై దాడులు నిర్వహించారు. ఆ సందర్భంలో ఆయన ముఖ్య అనుచరుడి వద్ద లభించిన భారీ నగదును డీకే శివకుమార్ బినామీ ఆస్తిగా పరిగణించిన ఈడీ, మనీల్యాండరింగ్ కేసుగా మార్చి.. ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆ కేసును రద్దు చేయాలని కోరుతూ డీకే శివకుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసుకున్నా తీర్పు సానుకూలంగా రాలేదు. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు 120-బి పరిధిలోకి రాదని, ఈడీ వాదన చెల్లదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసు నుంచి విముక్తి పొందిన తర్వాత శివకుమార్ బెంగళూరులో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ...ఎట్టకేలకు న్యాయమే గెలిచిందని అన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా నిర్దోషి

- ఆయనపై ఆరోపణలను ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయింది
- బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ తీర్పు
- సుప్రీంకోర్టులో సవాల్ చేసిన మహారాష్ట్ర



నాగ్‌పూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై గత పదేళ్లుగా జైలులో ఉన్న ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాను బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ నిర్దోషిగా ప్రకటించింది. సాయిబాబాపై ఉన్న ఆరోపణలను నిరూపించటంలో ప్రాసిక్యూషన్ పూర్తిగా విఫలమైందని ధర్మాసనం పేర్కొంది. 54 ఏళ్ల సాయిబాబాపై ఉన్న యావజ్జీవ కారాగార శిక్షను కోర్టు కొట్టివేసింది. ఆయనతోపాటు ఇదే కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న హేమ్ మిశ్రా, మహేష్ టిర్కీ, నారాయణ్ సాంగ్లీకర్, ప్రశాంత్ రాహి, పాండు నరోటెలు కూడా నిర్దోషులేనని తీర్పు చెప్పింది. ఈ ఆరుగురిలో పాండు నరోటె ఇప్పటికే మరణించారు. జస్టిస్ వినయ్ జోషి, జస్టిస్ వాల్మీకి ఎస్ఏ మెంజెస్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ తీర్పు ఇచ్చింది. నిందితులపై ఉగ్రవాద కార్యకలాపాల వ్యతిరేక చట్టం ఉపా కింద అభియోగాలు నమోదు చేయటానికి గతంలో ప్రాసిక్యూషన్‌కు లభించిన అనుమతి చెల్లదని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసులో గతంలో విచారణ కోర్టు ఇచ్చిన తీర్పు న్యాయసూత్రాల మేరకు లేదని, కాబట్టే దానిని పక్కనపెట్టి నిందితులందరినీ విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నామని తెలిపింది. కాగా, తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేయటానికి వీలుగా తీర్పు అమలును ఆరు వారాలపాటు నిలిపివేయాలని ప్రాసిక్యూషన్ న్యాయవాది మౌఖికంగా కోర్టును కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. స్టే కోరుతూ విజ్ఞాపనను దాఖలు చేయమని ఆదేశించింది. ఈ నేపథ్యంలో, మహారాష్ట్ర ప్రభుత్వం బాంబే హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

ఇంటికి తిరిగొచ్చే వరకూ ఆందోళనే!

ప్రొఫెసర్ సాయిబాబాను హైకోర్టు విడుదల చేస్తూ తీర్పు ఇవ్వటంపై ఆయన భార్య వసంత కుమారి హర్షం వ్యక్తం చేశారు. చాలా సంతోషంగా ఉందని, అయితే, 2022లో కూడా ఇలాగే తీర్పు వచ్చినప్పటికీ.. ఆ తీర్పును ప్రభుత్వం సవాల్ చేసిందని, కాబట్టి, ఈసారి సాయిబాబా ఇంటికి వచ్చే వరకూ కుటుంబమంతా ఆదుర్దాగానే ఎదురు చూస్తుంటామని తెలిపారు. తన భర్త జైలులో ఉన్న పదేళ్లు తమకు మానసికంగానేగాక ఆర్థికంగానూ సవాళ్లతో కూడుకున్న కష్ట కాలమని ఆవేదన వ్యక్తం చేశారు. సాయిబాబా తరఫు న్యాయవాది ఇందిరా జైసింగ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'సాయిబాబాను పదేళ్ల తర్వాత నిర్దోషిగా తేల్చారు. ఆ నష్టానికి బాధ్యులెవరు' అని ప్రశ్నించారు.

మావోయిస్టులతో భేటీకి ఏర్పాటు చేశారని..

ఐదేళ్ల వయసులోనే పోలియో సోకడంతో సాయిబాబాకు 90 శాతానికిపైగా వైకల్యం ఏర్పడింది. చిన్ననాటి నుంచే ఆయన వీల్‌చైర్‌కు పరిమితమయ్యారు. ఢిల్లీ యూనివర్సిటీకి అనుబంధంగా ఉండే రామ్‌లాల్ ఆనంద్ కాలేజీలో సాయిబాబా ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పని చేసేవారు. ఆయనకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని పోలీసులు పలుమార్లు ఆరోపించారు. మావోయిస్టులతో భేటీ కానున్నారనే ఆరోపణలపై హేమ్ మిశ్రా, ప్రశాంత్ రాహీలను పోలీసులు 2013లో అరెస్టు చేశారు. వారు మావోయిస్టులను కలిసేందుకు ప్రొఫెసర్ సాయిబాబా ఏర్పాటు చేశారని 2014లో మహారాష్ట్ర పోలీసులు సాయిబాబాను ఢిల్లీలోని ఆయన ఇంటిలోనే అరెస్టు చేశారు. అప్పటి నుంచి నాగ్‌పూర్ సెంట్రల్ జైలులో ఉన్నారు.

సందేశ్‌ఖాలీ అల్లర్ల కేసులు సీబీఐకి

- ఈడీ అధికారులపై దాడి చేయించిన షాజహాన్ కూడా సీబీఐ కస్టడీకే
- సీబీఐ, రాష్ట్ర పోలీసుల ఉమ్మడి సిట్ రద్దు
- కలకత్తా హైకోర్టు ఆదేశం



కోల్‌కతా/న్యూఢిల్లీ, మార్చి 5: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో జరిగిన అల్లర్లపై దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ మంగళవారం కలకత్తా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈడీ అధికారులపై టీఎంసీ నేత షాజహాన్ మద్దతుదారుల దాడి, దీనిపై నమోదైన కేసులను కూడా సీబీఐకి అప్పగించాలని ఆదేశించింది. అంతకుముందు ఈ సంఘటనలపై విచారణకు సీబీఐ, రాష్ట్ర పోలీసులతో సిట్‌ను ఏర్పాటు చేయాలని జనవరి 17న ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను తాజాగా హైకోర్టు రద్దు చేసింది. అయితే, గతంలో ఏకసభ్య ధర్మాసనం ఆదేశాలను సవాలు చేస్తూ అటు ఈడీతో పాటు రాష్ట్ర పోలీసులు కూడా హైకోర్టు డివిజన్ బెంచ్ ముందు అప్పీలు చేశారు. దర్యాప్తును కేవలం తమకే అప్పగించాలని రాష్ట్ర పోలీసులు, కేవలం సీబీఐ చేతనే దర్యాప్తు జరిపించాలని ఈడీ అధికారులు కోరారు. దాంతో సిట్ బదులు సీబీఐ దర్యాప్తు చేస్తుందని డివిజన్ బెంచ్ తెలిపింది. నిందితుడు షాజహాన్‌ను వెంటనే సాయంత్రం 4.30 గంటలకల్లా సీబీఐ కస్టడీకి అప్పగించాలని ఆదేశించింది. ఆయనను కస్టడీలోకి తీసుకోవడానికి పారామిలటరీ దళాల సాయంతో సీబీఐ బృందం కోల్‌కతాలోని సీఐడీ కార్యాలయానికి వెళ్లింది. ఈ సందర్భంగా రాష్ట్ర పోలీసుల తీరుపై హైకోర్టు తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. వారు పూర్తిగా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించింది. నిందితుడ్ని రక్షించడానికి దర్యాప్తులో ప్రతిసారీ ఆలస్యం చేస్తున్నారని పేర్కొంది. అయితే, హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పుపై బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఇదిలా ఉండగా, షాజహాన్‌కు కోల్‌కతా, సందేశ్‌ఖాలీలో ఉన్న రూ.12.78 కోట్ల ఆస్తులను అటాచ్ చేసినట్టు ఈడీ తెలిపింది.

రాష్ట్రపతి పాలన విధించండి

సందేశ్‌ఖాలీ అలర్లపై క్షేత్రస్థాయిలో దర్యాప్తు జరిపిన జాతీయ మహిళా కమిషన్ మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి నివేదిక సమర్పించింది. పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని సిఫార్సు చేసింది. పోలీసులు, టీఎంసీ కార్యకర్తలు తమను వేధిస్తున్నారని పలువురు మహిళలు చెప్పినట్లు పేర్కొంది. సందేశ్‌ఖాలీలోనే కాకుండా రాష్ట్రంలో పలుచోట్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. అంతకు ముందు జాతీయ ఎస్సీ కమిషన్ కూడా రాష్ట్రపతి పాలన విధించాలని సిఫార్సు చేయడం గమనార్హం.

జైలు నుంచే బెంగళూరు పేలుళ్ల కుట్ర!

- ఏడు రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు
- ఐదుగురు అనుమానితులు అదుపులోకి


బెంగళూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో శుక్రవారం పేలుళ్లకు పాల్పడిన ఘటనలో ఐదుగురు అనుమానితులను ఎన్ఐఏ మంగళవారం తమిళనాడులో అదుపులోకి తీసుకుంది. తమిళనాడు, కర్ణాటక, కేరళ సహా 7 రాష్ట్రాల్లోని మొత్తం 17 ప్రదేశాలలో ఎన్ఐఏ సోదాలు జరిపింది. హార్డ్ డిస్కులు, పెన్‌డ్రైవ్‌లతోపాటు కొన్ని పత్రాలను కూడా స్వాధీనం చేసుకుంది. 16 మందికి నోటీసులు జారీ చేసింది. బెంగళూరులోని పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న అనుమానిత ఉగ్రవాదులు జైలు నుంచే విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నారని ఎన్ఐఏ గుర్తించింది. రామేశ్వరం కేఫ్‌లో పేలుడు కూడా అందులో భాగమేనని భావిస్తోంది. కీలకసూత్రధారులుగా భావిస్తున్న లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన టి.నాసిర్, జునైద్ అహ్మద్‌ల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా, కర్ణాటక సీఎం సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లకు ఉగ్రవాదుల నుంచి బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి. రామేశ్వరం ఘటన ట్రయల్ మాత్రమేనని, 2.5 మిలియన్ డాలర్లు చెల్లించకపోతే మరిన్ని విధ్వంసాలు సృష్టిస్తామని ఆ మెయిల్స్‌లో హెచ్చరించినట్టు సిద్దరామయ్య తెలిపారు. మరోవైపు, ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగిని చంపేస్తామన్న మహ్మద్ రసూల్ అనే వ్యక్తిపై కర్ణాటకలోని యాదగిరి జిల్లా సురపుర పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. యాదగిరి జిల్లాకు చెందిన మహ్మద్ రసూల్ తెలంగాణలోని హైదరాబాద్‌కు వెళ్లి స్థిరపడ్డాడు. అతడి కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు సురపుర పోలీసులు మంగళవారం మీడియాకు తెలిపారు.

ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడి.. భారతీయుడి మృతి

జెరూసలేం, మార్చి 5: ఇజ్రాయెల్‌పై హిజ్బుల్లా మిలిటెంట్లు చేసిన క్షిపణి దాడిలో ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరు భారతీయులు సహా ఏడుగురు విదేశీయులు గాయపడ్డారు. ఈ దుర్ఘటన ఉత్తర ఇజ్రాయెల్‌లో సోమవారం జరిగింది. బాధిత భారతీయులు ముగ్గురిని కేరళ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో హిజ్బుల్లా మిలిటెంట్లు లెబనాన్ నుంచి ఉత్తర ఇజ్రాయెల్ సరిహద్దు సమీపంలోని ఓ వ్యవసాయక్షేత్రంపై యాంటీ- ట్యాంక్ క్షిపణిని ప్రయోగించారని ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. ఈ దాడిలో చనిపోయిన వ్యక్తిని కేరళలోని కొల్లామ్‌కు చెందిన పట్నిబిన్ మాక్స్‌వెల్(31)గా గుర్తించారు. గాయపడిన భారతీయులు బుష్ జోసెఫ్ జార్జ్(31), పాల్ మెల్విన్(28) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో జోసెఫ్ జార్జ్ భారత్‌లోని తన కుటుంబసభ్యులతో మాట్లాడారని అధికారులు తెలిపారు.



'జయహో బీసీ' సభా వేదికపై టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బొమ్మిడి నాయకర్, కొణతాల రామకృష్ణ, అచ్చెన్న, లోకేశ్, రామ్మోహన్, పితాని సత్యనారాయణ, గుమ్మనూరు జయరాం, బోండా ఉమ తదితరులు



సభలో అభివాదం చేస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

బీసీలకు జగన్ వెన్నుపోటు

టీడీపీ ఆర్థికంగా ఆదుకుంటే
వైసీపీ అన్నింటా అణగదొక్కింది: లోకేశ్



అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ వర్గాలకు తాము వెన్నుదన్నుగా నిలిస్తే సీఎం జగన్ వారికి వెన్నుపోటు పొడిచారని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. మంగళగిరి సమీపంలోని నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న మైదానంలో మంగళవారం జరిగిన 'జయహో బీసీ' సభలో ఆయన ప్రసంగించారు. "స్థానిక సంస్థల్లో బీసీలకు 24శాతం రిజర్వేషన్లు ఉన్నాయంటే దానికి కారణం టీడీపీ. బీసీ వర్గాలకు ప్రత్యేకంగా సబ్‌ప్లాన్ పెట్టి దానికింద రూ.36 వేల కోట్లు వారి అభివృద్ధికి వ్యయంచేశాం. బీసీ కార్పొరేషన్ పెట్టి రూ.3వేల కోట్లతో 4లక్షల మంది స్వయం ఉపాధికి చేయూతనిచ్చాం. ఆదరణ పథకం కింద రూ.వెయ్యి కోట్లతో వృత్తి పరికరాలు అందచేశాం. మాకంటే బాగా చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్ బీసీ వర్గాలను వెన్నుపోటు పొడిచారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లలో 10శాతం కోతపెట్టి, బీసీ వర్గాలవారు 16వేల పదవులు కోల్పోవడానికి కారణమయ్యారు. 350మంది బీసీ నేతలను దారుణంగా హత్య చేశారు. 26వేల మందిపై అక్రమ కేసులు పెట్టారు. జగన్ పెట్టే కేసులకు ఇక్కడ భయపడేవారు ఎవరూ లేరు. మీ ఎఫ్ఐఆర్‌లు మడిచి ఎక్కడ పెట్టుకొంటారో పెట్టుకోండి. తప్పుడు పనులు చేసి రెడ్ బుక్‌లో ఎక్కినవారి సంగతి సరిగ్గా 2నెలల తర్వాత ఏంచేయాలో అది చేసి చూపిస్తాం" అని లోకేశ్ ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో మంగళగిరిలో 53వేల మెజారిటీతో గెలిచి ఆ సీటును చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు కానుకగా ఇస్తానని లోకేశ్ ప్రకటించారు.

బీసీలే బలం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన 'జయహో బీసీ సభలో ఆయన ప్రసంగించారు. జగన్ ఐదేళ్ల పాలనలో బీసీలు ఎంతో నష్టపోయారని, వారికి మళ్లీ ఊపిరి ఇవ్వడానికి ప్రత్యేకంగా బీసీ డిక్లరేషన్ రూపొందించామని తెలిపారు. '40 ఏళ్లుగా ఆదరించిన మీ రుణం తీర్చుకోవడానికి బీసీ డిక్లరేషన్ విడుదల చేస్తున్నాం. బీసీల్లో 153 కులాలు ఉన్నాయి. మీ దశ దిశ మార్చడానికి దీనినో అవకాశంగా ఎంచుకున్నాం. బీసీ వర్గాలు లేకపోతే నాగరికత లేదు. మన సంస్కృతికి బీసీ కులాల వారు ఒక చిహ్నం. రజకులు లేకపోతే మనం రోజూ ఇంత మంచి బట్టలు వేసుకుని తిరగలేం. మన జీవనంలోని అనేక కోణాల్లో బీసీ కులాల వారి కుల వృత్తుల పాత్ర ఉంది. ఈ అన్ని కులాలకు న్యాయం చేయాలి. చిన్నా పెద్దా అన్ని కులాలకు తగిన నిధులు ఇచ్చి వారిని ఆదుకుంటాం. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా పైకి తెస్తాం. టీడీపీ రాక ముందు బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు లేవు. ఎన్టీఆర్ ఆ రిజర్వేషన్లు పెట్టిన తర్వాత ఆ వర్గాల్లో రాజకీయ నాయకత్వం పెరిగింది. నేను ఆ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచాను. జగన్ వచ్చి 24 శాతానికి కుదించాడు. బీసీలు ఆర్థికంగా పైకి రావడానికి మేం ఆదరణ పథకం పెట్టాం. జగన్ వచ్చి రద్దు చేశాడు' అని మండిపడ్డారు. మళ్లీ ఈ రాష్ట్రాన్ని నిలబెట్టడానికే టీడీపీ, జనసేన కలిశాయన్నారు. తమ కలయిక పదవుల కోసం కాదని.. ఈ రాష్ట్ర ప్రజలకు, వారి పిల్లలకు మంచి భవిష్యత్ కల్పించడానికే కలిశామని చెప్పారు. 'రాష్ట్రం నిలబడితే అన్ని వర్గాలు నిలబడతాయి. భవిష్యత్‌లో అన్ని వర్గాలనూ ఆదుకుంటాం. ప్రతి వర్గానికీ ప్రణాళిక రూపొందిస్తాం. మా కలయికను నిండు మనసుతో ఆశీర్వదించండి' అని ప్రజలకు విజ్ఞప్తిచేశారు.



బీసీ డిక్లరేషన్‌ను విడుదల చేస్తున్న చంద్రబాబు, పవన్

పెద్దిరెడ్డి జోలికి వెళ్లగలరా?

రాష్ట్రంలో అనేక మంది బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు జగన్ టికెట్లు ఎగ్గొట్టారని, వారి మాదిరిగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జోలికి వెళ్లగలరా అని చంద్రబాబు ప్రశ్నించారు. 'ప్రజల్లో వ్యతిరేకత ఉందని చెప్పి జగన్ అనేక మంది బీసీ నేతల గొంతు కోశారు. కొంత మందికి టికెట్లు ఇవ్వలేదు. ఇంకొంత మందిని ఎటెటో మార్చేశాడు. పెద్దిరెడ్డిని ఎందుకు మార్చలేదు? ఆయనకు అంత మంచి పేరుందా? గనులు, భూములు, ఇసుక రేవులు మొత్తం ఆయన తన గుప్పిట పట్టి పిండుకోవడం లేదా? వేల కోట్లు దోచుకోలేదా? ఆయన్ను మార్చే శక్తి జగన్‌కు ఉందా? ఎమ్మెల్యే అవినీతిని ప్రశ్నించినందుకు బీసీ నేత నందం సుబ్బయ్యను పట్టపగలే చంపారు. ఆ ఎమ్మెల్యేకు టికెట్ ఆపారా? వీరప్పన్ మాదిరిగా భాస్కరన్ పేరుతో తయారైన ఒక నేత తిరుపతిని అడ్డగోలుగా లూటీచేశాడు. వేల కోట్లు గడించాడు. ఆయన్ను తెచ్చి ఒంగోలులో పెట్టారు. వీళ్లకు టికెట్లు ఎలా వచ్చాయి? తన వారు నలుగురికి రాష్ట్రాన్ని పంచి ఇచ్చి జగన్ సామాజిక న్యాయం కబుర్లు చెబుతున్నాడు. బీసీలు బ్యాక్ బోన్ అంటూ ఉపన్యాసాలు చెప్పి వారి వెన్నెముక విరగ్గొడుతున్నాడు. జై జగన్ అనలేదని పల్నాడులో చంద్రయ్య అనే బీసీ నేతను గొంతు కోసి చంపారు. వైసీపీ సంస్కృతి అదీ' అని ధ్వజమెత్తారు. బీసీల్లోని అన్ని కులాల వారికీ టికెట్లు ఇవ్వలేమని, వారికి ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్ల వంటి ఇతర పదవుల ద్వారా రాజకీయ న్యాయం చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. జయహో బీసీ అందరి నినాదం, విధానం కావాలని పిలుపిచ్చారు.

మంగళగిరికి వరాలు!

జయహో బీసీ సభ నిర్వహించిన మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు చంద్రబాబు ప్రత్యేకంగా హామీలు ఇచ్చారు. 'ఈ నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల్లో తరతరాలుగా నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇస్తాం. టిడ్కో కింద 20 వేల ఇళ్లు మంజూరు చేస్తాం. తాడేపల్లి ప్రాంతంలో వ్యవసాయ భూములను ఆంక్షల్లేకుండా స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం కల్పిస్తాం. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ పెడతాం. నేత కార్మికుల ఆదాయం పెరగడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం' అని ప్రకటించారు.

బీసీలది శాసించే స్థాయి

- వైసీపీ పాలనలో వారి పొట్టగొట్టారు
- బీసీ డిక్లరేషన్‌కు మా పూర్తి మద్దతు
- జయహో బీసీ సభలో జనసేనాని పవన్

అమరావతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): 'బీసీలే దేశానికి వెన్నెముక. వారికి సాధికారత ఉండాలి. బీసీలు శాసించే స్థాయిలో ఉండాలి' అని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తొలి మూడు నెలల్లోనే బీసీల పొట్టకొట్టారని ఆయన ఆరోపించారు. టీడీపీ-జనసేన ఉమ్మడిగా మంగళగిరిలో నిర్వహించిన జయహో బీసీ సభలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నిలబెట్టుకోలేదని విమర్శించారు. జగన్ మాటలు నమ్మి చాలామంది బీసీ నాయకులు వైసీపీలోకి వెళ్లారని, కానీ.. వారిని కూడా జగన్ మోసం చేశారని వ్యాఖ్యానించారు. "సీఎం జగన్ బీసీలకు ఏటా 15 వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఐదేళ్లల్లో బీసీ సంక్షేమానికి రూ.75 వేల కోట్లు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. బీసీ కేటగిరీల్లో 153 కులాలను గుర్తించి, 139 కార్పొరేషన్లు పెడతామన్నారు. కేవలం 56 కార్పొరేషన్లు పెట్టి.. వాటికి బడ్జెట్ కేటాయించకుండా, కనీసం కుర్చీలు కూడా లేకుండా చేశారు. చేయూత కింద 45 ఏళ్ల దాటి మహిళలకు రూ.75 వేలు ఇస్తామని లబ్ధిదారుల సంఖ్యలో కోత విధించారు. శాశ్వత బీసీ కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు కానీ, ఇప్పటి వరకూ ఆ ఊసే ఎత్తేలేదు. బడ్జెట్‌లో మూడో వంతు బీసీలకు కేటాయిస్తామని చెప్పి విస్మరించారు. వైసీపీ పాలనలో 23 వేల మంది బీసీలపై కేసులు పెట్టారు. 300 మంది బీసీలను చంపేశారు. అచ్చెన్నాయుడు వంటి వారిపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారు. వైసీపీలో ఒక్క బీసీ నాయకుడు కూడా ఈ అరాచకాలపై మాట్లాడలేదు. వైసీపీ అడ్డగోలు తనానికి ఆ పార్టీలోని బీసీ నేతలు అండగా నిలిస్తే తమ కులానికి ద్రోహం చేసిన వారవుతారు. ఈ సంఘటనలు చూసిన తర్వాత వైసీపీ పాలనలో బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం కావాలని అర్థమవుతోంది. దీనికి నేను మనస్ఫూర్తిగా మద్ధతు తెలుపుతున్నాను" అని అన్నారు.

బీసీలకు సాధికారత కావాలి..

"బీసీలకు సాధికారత ఉండాలి. దీంతో పాటు బీసీ కులాల మధ్య ఐక్యత కూడా ఉండాలి. సంఖ్యాబలం ఉన్న కులాలే కాదు. అల్పసంఖ్యలో ఉన్న కులాలు కూడా ఎక్కువ అభివృద్ధి చెందాలి. బీసీలు శాసించే స్థాయిలో ఉండాలి. బీసీ కులాలను దేవాలయాలకు అనుసంధానం చేయాలి. అప్పుడు వారికి ఆర్థికపరిపుష్టి కలుగుతుంది. ఈ విషయాన్ని కూడా టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తాం. వడ్డెర కులస్థులు పని ప్రదేశాల్లో గాయాలపాలవుతున్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థల్లో నలిగిపోతున్నారు. కర్నూలు పర్యటనలో నేను వారి పరిస్థితి చూశాను. అలాంటి వారికి ఆర్థిక పరిపుష్టి తీసుకొచ్చేందుకు కృషిచేయాలి. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చినవి కాకుండా.. యువత, మహిళలు, పెద్దలు ఆర్థికంగా ఎదిగేలా టీడీపీ-జనసేన కలిసి మంచి పథకాలను రూపొందిస్తాయి. 900 కిలోమీటర్లకుపైగా సముద్రతీరం ఉన్నా ఉపాధి లేకుండా మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ-జనసేనలు మత్స్యకారులకు అండగా ఉంటాయి. వారి కోసం ప్రతి 30 కిలోమీటర్లకు ఒక జెట్టీని ఏర్పాటు చేయాలి. ఈ విషయాన్ని కూడా చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి, టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటు కాగానే దానిపై దృష్టిపెడతాం. మత్స్యకారుల పిల్లల కోసం ఆశ్రమ పాఠశాలలు స్థాపించాలి. స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం రాగానే.. బీసీలకు తిరిగి 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం. బీసీలపై దాడులు జరిగితే మా ప్రాణాల అడ్డేసి కాపాడుకుంటాం. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదన్న నిర్ణయం కూడా బీసీల కోసమే తీసుకున్నాం. టీడీపీ బీసీలకు అత్యంత అండగా ఉన్న పార్టీ. వెనుకబడిన కులాలకు అండగా ఉన్నందుకు ఎన్టీ రామారావును స్మరించుకోవాలి. బీసీ డిక్లరేషన్‌కు జనసేన మద్దతు ఉంటుంది. బీసీల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తాం. బీసీలు రాజ్యాధికారం సాధించాలని ఆకాంక్షిస్తున్నా" అని పవన్‌కల్యాణ్ చెప్పారు.



జగన్ ప్రభుత్వానికి పాడె కట్టేది బీసీలే

రాష్ట్రం నుంచి తరిమికొట్టేది వారే

- 'జయహో బీసీ'లో గర్జించిన బీసీ నేతలు

గుంటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): 'బీసీలను అనేక రకాలుగా వేధించి, దాడులు చేసి, హత్యలు చేయించిన జగన్ ప్రభుత్వానికి బీసీలే పాడె కడతారు. మేదరివాళ్లు పాడె కడతారు. చేనేతలు పాడెపై కప్పే గుడ్డ నేసిస్తారు. కుమ్మరివారు పాడె కుండ చేసిస్తారు.. ఇలా ఒక్కో బీసీ వర్గం ఒక్కో రూపంలో జగన్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో పాడె కడుతుంది. జగన్‌కు రాజకీయ సమాధి కట్టే బాధ్యత బీసీలదే. రాష్ట్రంనుంచి తరిమికొట్టేది బీసీలే!' అంటూ బీసీ నేతలు విరుచుకుపడ్డారు. మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న బైబిల్ గ్రౌండ్స్‌లో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్రస్థాయి 'జయహో బీసీ' సభకు లక్షలాదిమంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ సీనియర్ నేతలు ప్రసంగించారు.

జగన్ పార్టీని బంగాళాఖాతంలో కలపాలి



టీడీపీ ఆవిర్భావంతోనే బీసీలకు రాజకీయ అవకాశాలు లభించాయి. టీడీపీ వెంటే వారు ఉన్నారనే అక్కసుతో జగన్ కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. ఏ తప్పూ చేయకపోయినా నన్ను అక్రమంగా అరెస్టు చేసి 80రోజులు జైల్లో పెట్టారు. విధ్వంసకర పాలనతో రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశాడు.

- అచ్చెన్నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు

డబ్బుల్లేని బీసీలకు రాజకీయావకాశాలు దక్కాలి



టీడీపీ వచ్చిన తర్వాతనే బీసీలకు సంక్షేమ ఫలాలు దక్కాయి. దృఢ సంకల్పంతోనే అన్న ఎన్టీఆర్ బీసీలకు సామాజిక న్యాయం చేశారు. వారు రాజకీయంగా, సామాజికంగా, అభివృద్ధిపరంగా పైకి వచ్చారంటే ఆయనే కారణం. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బీసీవర్గాలకు చేయాల్సింది చాలా ఉంది.

- యనమల రామకృష్ణుడు, మాజీ మంత్రి

బీసీల రాజకీయ భవిష్యత్‌కు దిశానిర్దేశం



బీసీలు రాజకీయ భవిష్యత్‌ను నిర్ణయించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. జగన్ మోసపూరిత వాగ్దానాలతో బీసీలను వంచించారు. కుర్చీలు లేని కార్పొరేషన్లు ఇచ్చి మోసం చేశారు. జగన్, బీసీ మంత్రులు, సజ్జల నా సవాల్‌ను స్వీకరించి ఒక్క కార్పొరేషన్‌కైనా ఒక్క రూపాయి కేటాయించారేమో చెప్పాలి. **- పితాని సత్యనారాయణ, మాజీ మంత్రి**

రాష్ట్రం నుంచి తన్ని తరిమేయాలి



జగన్‌ను రాష్ట్రం నుంచి తన్ని తరిమేయాల్సిన పరిస్థితి వచ్చింది. లెక్కలేనన్ని అరాచకాలు, అక్రమాలు చేసిన వైసీపీ పాలనకు పాడెకట్టాలి.

- కాల్వ శ్రీనివాసులు, మాజీ మంత్రి

చేనేతను ఆదుకున్నది చంద్రబాబే



సంక్షోభంలో ఉన్న చేనేతను ఆదుకున్నది చంద్రబాబు ప్రభుత్వమే. టీడీపీ ప్రభుత్వం చేనేత సంరక్షణకు నూలు, రంగులపై సబ్సిడీ ఇచ్చింది. చేనేత సహాయ నిధి, పొదుపు నిధి, రంగుల కోసం రూ.25కోట్లు, మూల ధనం కింద రూ.30 కోట్లు, మరమగ్గాలకు రాయితీ కింద రూ.80కోట్లు కేటాయించి ఖర్చు చేసింది. **- ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ**

బీసీలను పల్లకీ ఎక్కేలా చేసింది ఎన్టీఆర్



బీసీలు పల్లకీ మోయడం కాదు.. వారిని పల్లకి ఎక్కేలా చేసిన ఘనత ఎన్టీఆర్‌ది. బీసీ రాజకీయాలకు ఎన్టీఆర్ పునాదులు వేయబట్టే ఎర్రన్నాయుడు, ఆయన వారసుడిగా నేను రాష్ట్ర, దేశ రాజకీయాల్లో గళంవినిపించగలిగాం. నమ్మితే ప్రాణమిచ్చే బీసీలు.. తేడావస్తే తాట తీస్తారని జగన్‌కు తెలిసేలా చేయాలి. **- ఎంపీ రామ్మోహన్‌నాయుడు**

బీసీలంతా ప్రమాణం చేయాలి..



సభలో బీసీలంతా ప్రమాణం తీసుకోవాలి. ఇక్కడి నుంచి వెళ్లేలోపు బీసీ ద్రోహి జగన్ ఓడించడానికి కంకణబద్ధులవ్వాలి. జనాభాలో 60శాతంగా ఉన్న బీసీలు చేయలేనిదంటూ ఏమీ లేదు. పదవులు బీసీలకు ఇచ్చి, అధికారాలన్నీ వారి సామాజిక వర్గానికి చెందిన రెడ్లకు ఇచ్చుకున్నాడు. ఆ ఆరుగురు రెడ్లదే రాష్ట్రంలోని అధికారమంతా. **- గౌతు శిరీష**

పాడె కట్టాలంటే బీసీలే కావాలి



జగన్ ప్రభుత్వానికి పాడె కట్టడం బీసీల వల్లే అవుతుంది. మేదరివాళ్లు పాడె కడితే, దాని మీదకు గుడ్డ నేసేది.. బట్టకంటిన మైలను శుభ్రం చేసేది.. పాడె వెంట తీసుకెళ్లే కుండ చేసేది.. అన్నీ బీసీలే. వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి బీసీలే పాడె కడతారు.

- బొనబోయిన శ్రీనివాస్‌యాదవ్, జనసేన

బీసీల ఆత్మగౌరవానికి అండ పవన్



బీసీల ఆత్మగౌరవానికి అండగా ఉండడానికి జనసేన అధినేత ముందుకొచ్చారు. జగన్ పాలనలో ఉత్తుత్తి కార్పొరేషన్లు, ఉత్తుత్తి పదవులతో బీసీలను వంచించారు. దీనికి బీసీలు తగిన సమాధానం చెప్పి తీరుతారు.

- చిల్లపల్లి శ్రీనివాసరావు, జనసేన

నాపై ఉన్న కేసుల వివరాలివ్వండి

డీజీపీకి చంద్రబాబు లేఖ

అన్ని జిల్లాల ఎస్పీలు, సీఐడీ, ఏసీబీలకూ...

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): 'కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి తమపై నమోదైన కేసుల వివరాలు నామినేషన్ సమయంలో అధికారులకు తెలియజేయాల్సి ఉంది. కావున గత ఐదేళ్లలో నాపై ఉన్న కేసుల వివరాలను మీ కార్యాలయం ద్వారా అందించండి' అని టీడీపీ అధినేత చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన రాష్ట్ర డీజీపీతోపాటు అన్ని జిల్లాల ఎస్పీలకు, ఏసీబీ, సీఐడీ విభాగాలకూ లేఖ రాశారు. 'గత ఐదేళ్ల కాలంలో ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాపై పలు అక్రమ కేసులు బనాయించారు. సంబంధిత ఏజెన్సీలు, అధికారులు పెట్టిన కేసుల సమాచారం నాకు అందలేదు. ఎమ్మెల్యేగా, ప్రతిపక్షనేతగా పనిచేస్తున్న నాపై 2019 నుంచి నమోదైన కేసుల వివరాలు తెలియజేయండి. ఏ క్షణంలో అయినా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున ముందుగా వివరాలు తెలియజేయగలరు. వ్యక్తిగతంగా నేను ప్రతి పోలీసు స్టేషన్ నుంచి సమాచారం పొందడం అన్నది ఆచరణ సాధ్యం కాదు. కాబట్టి డీజీపీ కార్యాలయం ద్వారా సమాచారం ఇవ్వగలరు' అని చంద్రబాబు కోరారు. రహస్యంగా ఉంచిన అక్రమ కేసులతో ప్రభుత్వం కుట్రలు చేసే అవకాశం ఉందనే అనుమానంతో ముందుగానే చంద్రబాబు లేఖ రాసి వివరాలు కోరారు. సమాచారం లేని కేసుల విషయంలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా చంద్రబాబు ఆ మేరకు చర్యలు తీసుకున్నారు.

కడప ఎంపీ సీటుకు వివేకా సతీమణి!

సౌభాగ్యమ్మ పేరు పరిశీలిస్తున్న టీడీపీ అధిష్ఠానం?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య ఘటన ఈసారి కడప జిల్లాలో ఎన్నికల అంశంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. వివేకా సతీమణి వైఎస్ సౌభాగ్యమ్మను కడప ఎంపీ సీటుకు అభ్యర్థిగా నిలిపే అంశం పరిశీలించాలని ఆ జిల్లా టీడీపీ నేతలు కొందరు అధిష్ఠానం ముందు ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనను టీడీపీ అధిష్ఠానం పరిశీలనలోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. సరిగ్గా ఐదేళ్ల కిందట అసెంబ్లీ ఎన్నికల ముందు వివేకా పులివెందులలోని తన ఇంట్లోనే హత్యకు గురైన విషయం తెలిసిందే. తన తండ్రిని కిరాతకంగా హత్య చేసిన వారిని శిక్షించి, న్యాయం చేయాలని కోరుతూ ఆయన కుమార్తె డాక్టర్ సునీత అప్పటినుంచి పోరాడుతున్నారు. దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోర్టులో పిటిషన్ వేసిన జగన్, తర్వాత దానిని ఉపసంహరించుకోవడం, కోర్టు ఆదేశంతో దర్యాప్తు చేపట్టిన సీబీఐ వేగంగా అడుగులు ముందుకు వేయలేకపోవడం చర్చనీయాంశాలయ్యాయి. జగన్‌కు సోదరుడి వరుసయ్యే ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయన తండ్రి వైఎస్ భాస్కర రెడ్డిని సీబీఐ అధికారులు అరెస్టు చేసి జైలుకు పంపారు. కడప ఎంపీ సీటుకు పోటీ వస్తున్న వివేకాను అడ్డు తొలగించుకోవడానికే ఆయనను హత్య చేశారని అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఆరోపించారు. ఈ కేసు ఎటూ తేలకుండా జీడిపాకంలా సాగుతుండటంతో వివేకా కుమార్తె సునీత ఇటీవల నోరు విప్పారు. తన తండ్రి హత్యకు కారకులైన వారికి శిక్షపడాలంటే ఈసారి ఎన్నికల్లో జగన్‌కు ఓటు వేయవద్దని ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తద్వారా తన తండ్రి హంతకులకు జగన్ నుంచి రక్షణ లభిస్తోందని తేటతెల్లం చేశారు. ఈ నేపథ్యంలో వివేకా సతీమణి సౌభాగ్యమ్మను అవినాశ్ రెడ్డిపై పోటీకి నిలిపితే మంచి ఫలితం ఉంటుందని ఆ జిల్లా టీడీపీ నేతలు ఇటీవల చంద్రబాబు వద్ద ప్రతిపాదించారు. సౌభాగ్యమ్మను నిలపాలన్న ప్రతిపాదనను కొంత కాలం క్రితం వరకూ టీడీపీ నాయకత్వం అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఆ కుటుంబాల మధ్య వివాదంలో తాము జోక్యం చేసుకోరాదని అనుకొంది. కానీ, వివేకా హంతకులకు ప్రజాకోర్టులో అయినా శిక్ష పడాలని సునీత బహిరంగంగా విజ్ఞప్తి చేసిన తర్వాత వాతావరణం మారినట్లు కనిపిస్తోంది. ఈ ప్రతిపాదనపై సునీత కుటుంబం స్పందన ఏమిటో తెలియరాలేదు. టీడీపీ అధినాయకత్వం కూడా ఇంకా తన స్పందనను బయటికి వ్యక్తం చేయలేదు. ఈ ప్రతిపాదనపై పరిశీలన జరుపుతున్నట్లు మాత్రం ప్రచారం జరుగుతోంది.

వేటు తప్పదా?!

- పొత్తులు, సీట్ల కేటాయింపుపై వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై చర్యలు
- తణుకు, జగ్గంపేట ఇన్‌చార్జిలపై సస్పెన్షన్ వేటు?
- రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్న పవన్

అమరావతి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ తొలిసారి క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమిస్తోంది. పొత్తులు, సీట్ల అంశాలపై బహిరంగంగా మాట్లాడ వద్దని, వ్యతిరేక వ్యాఖ్యలు చేయవద్దని నాయకులకు తొలి నుంచీ ఆ పార్టీ స్పష్టంగా చెబుతోంది. ఏవైనా అభ్యంతరాలుంటే అధిష్ఠానానికి తెలియజేయాలని పీఏసీ సభ్యులు క్లారిటీ ఇస్తున్నారు. అధినేత పవన్ కల్యాణ్ కూడా ఇదే విషయాన్ని ప్రతి సమావేశంలో పదేపదే నాయకులకు సూచిస్తూ వస్తున్నారు. కానీ కొన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో నాయకులు పార్టీ నిర్ణయాలను కాదని సొంత అజెండాతో పని చేస్తున్నారు. ఇటీవల జనసేన-టీడీపీ దాదాపు 99 నియోజకవర్గాల్లో అభ్యర్థుల పేర్లు ఖరారు చేశాయి. సీట్లు ప్రకటించే సమయంలో జనసేన నుంచి సీటు ఆశించిన కొంత మందికి నిరాశ ఎదురవ్వడంతో పార్టీ ఆదేశాలను కాదని జిల్లాల్లో నిరసనలు తెలిపారు. పార్టీ నిర్ణయాలను ధిక్కరిస్తూ మాట్లాడే నాయకులు, నిరసనలు తెలిపే నాయకులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని పార్టీ నిర్ణయించింది. అలాంటి వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేసే ఆలోచనలో పవన్ ఉన్నట్లు తెలుస్తోంది. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నిరాహార దీక్ష చేస్తూ హడావుడి చేశారు. తణుకు ఇన్‌చార్జి విడివాడ రామచంద్ర కూడా పార్టీ నిర్ణయాన్ని కాదని ఆందోళనలు చేశారు. తాడేపల్లిగూడెం సభ ఏర్పాట్లు జరుగుతుండగా ఆయన అనుచరులు అక్కడికి చేరుకుని కాస్త రభస చేశారు. ఈ రెండు ఘటనలను పార్టీ అధినాయకత్వం సీరియస్‌గా పరిగణిస్తోంది. వీరిద్దరిని పార్టీ నుంచి సస్పెండ్ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రెండురోజుల్లో అధినేత తుదినిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది ఎన్నికల్లో పోటీకి సిద్ధమైన చాలామందికి సీటు దక్కలేదు. దీంతో కొంతమంది నిరాశగా ఉన్నారు. అలాంటివారిని పవన్ తన కార్యాలయానికి పిలుపించుకుంటున్నారు. రెండు రోజుల నుంచి ఇద్దరు ముగ్గురు నాయకులతో స్వయంగా మాట్లాడారు. మచిలీపట్నం సీటు ఆశించిన రామకృష్ణతో పవన్ మాట్లాడారు. పొత్తుల్లో అభ్యర్థి కోసం పని చేయాలని, పార్టీలో సముచిత స్థానం ఇస్తామని భరోసా ఇచ్చారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా నాయకులతో ఆయన చర్చించారు. మిగిలిన జిల్లాల నాయకులను నేరుగా కలిసి, వారికి భరోసా ఇవ్వాలని పవన్ నిర్ణయించారు.

పరీక్షలున్నాయి... బయటికి రావొద్దు మామా..!



సీఎం పర్యటనలతో ఇంటర్ విద్యార్థులకు చుక్కలు

- పరీక్షల కాలంలో సీఎం కోసం ట్రాఫిక్ ఆంక్షలు
- సమయానికి చేరుకోలేక విద్యార్థుల పాట్లు
- నిమిషం దాటినా పరీక్షకు అనుమతించని అధికారులు
- ఈనెల 18 నుంచి టెన్త్ పరీక్షలు

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి నివాసాన్ని వదలి బయటకు వస్తున్నారంటే ట్రాఫిక్ ఆంక్షలతో ప్రజలు అల్లాడిపోవడం సర్వసాధారణం. అయితే ఇది పరీక్షల సీజన్. ఏడాది పొడవునా విద్యార్థులు కష్టపడి చదివేది ఈ పరీక్షల కోసమే. ఆ సమయంలో ఎదురయ్యే ఎలాంటి ఇబ్బందులైనా వారి భవిష్యత్తును తలకిందులు చేస్తాయి. ఇప్పుడు రాష్ట్రంలో ఇంటర్, 10వ తరగతి విద్యార్థుల పరిస్థితి అలానే ఉంది. మంగళవారం సీఎం విశాఖపట్నం పర్యటనకు బయలుదేరారు. ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఆయన విజయవాడమీదుగా గన్నవరం వెళ్లారు. సీఎం భద్రత పేరుతో పోలీసులు చాలా ముందుగానే రహదారులను ఆంక్షలతో నింపేశారు. దీంతో ఇంటర్ పరీక్షలకు వెళ్తున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయి. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. సీఎం పర్యటనల గురించి తెలియని విద్యార్థులు రోజూలాగే బయలుదేరారు. సీఎం పర్యటన ఆంక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి చాలా ఇబ్బందులు పడ్డారు. అందులోనూ విజయవాడ నుంచి గన్నవరం వెళ్లే జాతీయ రహదారిపై ఎక్కువ ఇంటర్ కాలేజీలున్నాయి. అలాగే నగరంలోనూ ప్రధాన రహదారి వెంట ఉన్న కాలేజీలకు పరీక్షలు రాసేందుకు వెళ్లే విద్యార్థులు ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బందులకు గురయ్యారు. కాగా, బుధవారం సీఎం జగన్ ప్రకాశం జిల్లా వెలిగొండ ప్రాజెక్టు రెండో టన్నెల్‌ను జాతికి అంకితం చేసేందుకు వెళ్తున్నారు. దీనికి కూడా ఉదయం 9.30 గంటలకే ఆయన బయలుదేరుతారని ప్రభుత్వం తెలిపింది. బుధవారం ఫస్టియర్ విద్యార్థులకు మ్యాథ్స్ 1-ఎ, బోటనీ, సివిక్స్ పరీక్షలున్నాయి. మళ్లీ 7న సీఎం ఇడుపులపాయలో వైఎస్ఆర్ స్మారక పార్కు ప్రారంభోత్సవానికి వెళ్తున్నారు. ఆ రోజున సెకెండియర్ విద్యార్థులకు గణితం, బోటనీ, సివిక్స్ పరీక్షలున్నాయి. ఇక ఈనెల 18 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయి. మరోవైపు టెట్ పరీక్షలు ఈనెల 9 వరకు ఉన్నాయి. దీంతో అటు ఇంటర్ విద్యార్థులు, ఇటు టెట్ అభ్యర్థులు అందరినీ సీఎం పర్యటనలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

బయటకు రావొద్దని వేడుకోలు

టెన్త్ పరీక్షలు ఈనెలాఖరుతో ముగుస్తాయి. అప్పటివరకూ సీఎం జగన్‌ను తాడేపల్లి ఇంటి నుంచి బయటకు రావొద్దంటూ విద్యార్థులు వేడుకునే పరిస్థితి వచ్చింది. రాజకీయ సభలను, ఎన్నికల ముందు హడావిడి ప్రారంభోత్సవాలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని కోరుతున్నారు. సీఎం పర్యటనల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల సమయంలో ట్రాఫిక్ ఆంక్షలేంటంటూ మండిపడుతున్నారు. అయితే సీఎం భద్రత విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గలేమని పోలీసులు తేల్చేస్తున్నారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సీఎం జగన్ ఏ రోజు ఏ జిల్లాకు వెళ్తున్నారనే విషయాన్ని కనుక్కొని జాగ్రత్తపడాల్సిన దుస్థితి.

'స్వాగతం'లో నరకం చూపారు!

- జగన్ వచ్చేదారిలో మండుటెండలో డ్వాక్రాలు
- 'రావాలి.. పూలు చల్లాలి' అంటూ ఆదేశాలు
- ఆటోలో తెచ్చి రోడ్డు పక్కన నిలబెట్టిన అధికారులు
- గంట, రెండు గంటల ముందే నిలువుకాళ్లపై...
- ఎప్పుడు సీఎం విశాఖ వచ్చినా మహిళలకు అవస్థలే



పూలు పట్టుకుని ఎండలో నిలబడి ఉన్న మహిళలు

విశాఖపట్నం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ విశాఖ వస్తున్నారంటేనే మహిళా సంఘాల సభ్యులు హడలిపోతున్నారు. ప్ల కార్డులు పట్టుకుని సీఎంకు దారిపొడవునా స్వాగతం పలికే బాధ్యతను మహిళా సంఘాల సభ్యులకే అధికారులు అప్పగిస్తున్నారు. 'రావాలి.. పూలు చల్లాలి' అంటూ ఒత్తిడి చేసి మరీ డ్వాక్రాలను మండుటెండలో రోడ్డు పక్క నిలబెట్టేస్తున్నారు. మంగళవారం జగన్ విశాఖ పర్యటనలో ఆయనకు స్వాగతం చెప్పడానికి నిలబెట్టినవారికి శోష వచ్చినంత పనైంది. రుషికొండ ఐటీ పార్కులోని హిల్ నంబర్ 3పై హెలికాప్టర్ దిగిన జగన్, అక్కడ నుంచి రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకున్నారు. 'విజన్ విశాఖ' పేరుతో పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న అనంతరం తిరిగి పీఎం పాలెంలోని 'వి' కన్వెన్షన్‌కు వెళ్లి అక్కడ 'భవిత' పేరుతో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయా మార్గాల్లో దారిపొడవునా సీఎంకు ప్లకార్డులతో స్వాగతం పలికేందుకు భీమిలి నియోజక వర్గానికి చెందిన మహిళలను తరలించారు. ప్రతి రీసోర్స్ పర్సన్ తమ పరిధిలోని మహిళా సంఘాల సభ్యులను నిర్దేశించిన ప్రాంతానికి తీసుకువెళ్లాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ప్రతి ఆర్పీ తమ పరిధిలోని మహిళా సంఘాల్లోని సభ్యులను ఆటోల్లో తీసుకొని వెళ్లారు. వారికి నిర్దేశించిన ప్రాంతానికి సభ్యులంతా వచ్చిన తర్వాత గ్రూపు ఫొటో తీసి అధికారులకు పంపించారు. అనంతరం వారిని సీఎం వచ్చే మార్గంలో ఫుట్‌పాత్‌పై నిలబెట్టి, వారి చేతికి ప్లకార్డులను అందజేశారు. అలాగే మరికొందరు మహిళలకు బంతి పూలు ఇచ్చి..సీఎం వచ్చినప్పుడు కారుపై విసరాలని ఆదేశించారు. సీఎం రావడానికి గంట, రెండు గంటల ముందే రోడ్డుపై నిలబెట్టడంతో ఎండ తీవ్రతకు మహిళలంతా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సీఎం నగరానికి వచ్చిన ప్రతీసారి తమకు ఇదేం శిక్ష అంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తంచేయడం విశేషం.

అప్పుడూ ఇదే నరకం

సీఎం రావడానికి రెండు, మూడు గంటల ముందే తీసుకొచ్చి మండుటెండలో నిలబెట్టేస్తుండడంతో నరకయాతన అనుభవించాల్సి వస్తోందని మహిళలు గగ్గోలు పెడుతున్నారు. కొద్దిరోజుల కిందట ముఖ్యమంత్రి శారదా పీఠానికి వచ్చినప్పుడు ఎయిర్‌పోర్ట్ నుంచి చినముషిడివాడ వరకూ మహిళలను రోడ్డు పొడవునా నిలబెట్టి ప్లకార్డులతో స్వాగతం పలికించిన విషయాన్ని డ్వాక్రాలు గుర్తు చేసుకున్నారు.

విశాఖకు 'ఫినిషింగ్' టచ్!

(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలతో సదస్సు నిర్వహించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలతో సమానంగా పోటీ పడాలంటే.. రాజధాని మార్పు అనివార్యం అని జగన్ పేర్కొన్నారు. అదే సమయంలో రాజధానిగా అమరావతిని వ్యతిరేకించడం లేదని, అది శాసన రాజధానిగా ఉంటుందని పాతపాటే పాడారు. "అక్కడ 50 వేల ఎకరాలను అభివృద్ధి చేయాలంటే ఏడాదికి రూ.5 వేల కోట్లు కావాలి. అంత డబ్బు పెట్టలేం. పైగా అక్కడ చుట్టుపక్కల భూములన్నీ ప్రతిపక్ష నాయకుల చేతుల్లో ఉన్నాయి. బినామీలు ఉన్నారు" అని అలవోకగా అవే అబద్ధాలు చెప్పారు. పారిశ్రామికవేత్తల సాక్షిగా జగన్ వల్లెవేసిన కబుర్లు, అసలు వాస్తవాలు ఏమిటో చూద్దాం...

జగన్ మాట: అమరావతిలో టీడీపీ నేతలు, బినామీల భూములు ఉన్నాయి.

మరి విశాఖలో: అమరావతిలో భూముల స్కామ్, ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచే రచ్చ చేస్తున్నారు. కానీ... 'ఇన్‌సైడర్' లేనేలేదని హైకోర్టు తేల్చిచెప్పింది. అదే సమయంలో... విశాఖలో వైసీపీ నేతలు భారీగా భూములను దున్నే పని మొదలుపెట్టారు. వారికి కొమ్ముకాస్తున్న ఐఏఎస్ అధికారులు కూడా వందల ఎకరాలను పోగేసుకున్నారు. బలవంతంగా లాక్కున్నారు. విశాఖ-భోగాపురం బీచ్ కారిడార్ అంతా ఇదే బాగోతం. ఈ భూముల రేట్లు పెంచుకోవడానికే.. విశాఖను 'పరిపాలనా రాజధాని'గా ప్రకటించారనే అనుమానాలున్నాయి.

జగన్ మాట: సీఎంగా ఇక్కడికి వచ్చి ఉంటే విశాఖ అభివృద్ధి చెందుతుంది. అది ప్రతిపక్షాలకు ఇష్టం లేదు. ఏదేమైనా సరే... ఎన్నికల తర్వాత విశాఖలోనే ఉంటాను. ఇక్కడే ప్రమాణ స్వీకారం కూడా చేస్తా!

అసలు వాస్తవం: బిడ్డ విశాఖలోనే కాపురం పెడతాడు' అని జగన్ అనేకసార్లు చెప్పారు. దసరా, దీపావళి, సంక్రాంతి అంటు వాయిదాలు వేస్తూనే ఉన్నారు. ఇప్పుడు... 'ఎన్నికల తర్వాత' అని మరో కొత్త మాట చెప్పారు. విశాఖకు రాకుండా ఆయనను ఎవరూ అడ్డుకోలేదు. తమ భూములు తీసుకొని, రోడ్డున పడేస్తున్నారనే అమరావతి రైతులు కోర్టులను ఆశ్రయించారు.

జగన్ మాట: విశాఖ పరిపాలనా రాజధాని కావాలని బలంగా కోరుకున్నది, దాని కోసం స్థిరంగా నిలబడింది నేనొక్కడినే!

ఔను నిజమే: ఇది మాత్రం నూరు శాతం కరెక్ట్. రకరకాల తప్పుడు ఉద్దేశాలు, అజెండాతో అమరావతిని అటకెక్కించి... విశాఖను వ్యూహాత్మకంగా తెరపైకి తెచ్చారు. అంతేతప్ప విశాఖపై ఆయనకు ఎలాంటి ప్రేమా లేదు. పరిపాలనా రాజధాని కావాలని ఈ ప్రాంత ప్రజలు ఏనాడూ కోరుకోలేదు. నగరం ప్రశాంతంగా ఉండాలనే కోరుకున్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే విశాఖలో భూములపై పడి, ఇళ్లకు వెళ్లి తుపాకులతో బెదిరించిన ముఠాలను చూశాక... 'మాకు రాజధాని వద్దు బాబోయ్' అంటూ అంతా వ్యతిరేకిస్తున్నారు. సీఎంగా ఒక్క పూట విశాఖ పర్యటనకు వస్తేనే సామాన్యులను నానారకాలుగా ఇబ్బంది పెడుతున్నారు. ఇక జగన్ ఇక్కడే ఉంటే ఏమైనా ఉందా... అని విశాఖ వాసులు వణికిపోతున్నారు.

జగన్ మాట: విశాఖకు 'ఫినిషింగ్ టచ్' చేస్తే చాలు.

ఇన్నేళ్లు ఏం చేశారో: 'ఫినిషింగ్ టచ్' ఎన్నికల ముందే గుర్తుకొచ్చిందా? విశాఖలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గాజువాక నుంచి మధురవాడ వరకు 12 ఫ్లైఓవర్లు నిర్మిస్తామని ఐదేళ్లుగా చెబుతూనే ఉన్నారు. దీనికి ఎవరు అడ్డం పడ్డారు?

జగన్ మాట: విశాఖలో ఐకానిక్ సెక్రటేరియట్ కడతాం!

నమ్మేదెవరు: అమరావతిలో పదివేల కోట్ల రూపాయలకు పైగా విలువైన పనులు జరిగినా 'అన్నీ గ్రాఫిక్స్. ఒక్క ఇటుక కూడా పడలేదు. అది శ్మశానం. ఎడారి' అని అబద్ధాలు ప్రచారం చేశారు. సచివాలయంతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి చేపట్టిన 'ఐకానిక్ టవర్స్' నిర్మాణ పనులు అప్పటికే మొదలయ్యాయి. వాటితోపాటు మొత్తం రాజధాని పనులను జగన్ ఆపివేయించారు. ఇప్పుడు... ప్రపంచం, దేశమంతా గర్వంగా విశాఖ వైపు చూసేలా ఐకానిక్ నిర్మాణాలు చేపడతామని కబుర్లు చెబుతున్నారు. ఐకానిక్ సెక్రటేరియట్, ఐకానిక్ కన్వెన్షన్ సెంటర్, ఐకానిక్ స్టేడియం నిర్మిస్తారట! 'ఫినిషింగ్ టచ్'లు చాలంటున్న ఆయన... ఇన్ని 'ఐకానిక్' నిర్మాణాలకు డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారు?

జగన్ మాట: యువతకు ఎమర్జింగ్ టెక్నాలజీస్ బోధించేందుకు చక్కటి విద్యా సంస్థ ఏర్పాటు చేస్తాం.

పాత పాటే: ఈ మాట మూడేళ్ల క్రితమే చెప్పారు. ఐటీకి సంబంధించిన అన్ని అంశాలు ఉండేలా ఓ యూనివర్సిటీ పెడతామన్నారు. ఏపీఐఐసీతో ప్రకటన కూడా చేయించారు. రుషికొండ ఐటీ హిల్స్‌లో పెడతామన్నారు. ఆ దిశగా ఎటువంటి ప్రయత్నాలూ చేయలేదు.

జగన్ మాట: భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం శరవేగంతో నిర్మితమవుతోంది. ఇంకో 18 నెలల్లో అక్కడి నుంచి విమానం ఎగురుతుంది.

కట్టారా.. అడ్డుకున్నారా: ఈ విమానాశ్రయం నిర్మాణానికి టీడీపీ హయాంలోనే శంకుస్థాపన చేశారు. వైసీపీ వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి ఉంటే ఈపాటికే నిర్మాణం పూర్తయ్యేది. కానీ.. స్వప్రయోజనాలు చూసుకున్నారు. విమానాశ్రయ నిర్మాణానికి కేటాయించిన భూముల్లో అనువుగా ఉన్న 500 ఎకరాలను భవిష్యత్తు అవసరాలకు పక్కన పెట్టుకున్నారు. ఆ పరిసరాల్లో భూములు వైసీపీ నేతలు కొనుక్కున్నారు. నాలుగేళ్ల తరువాత మరోసారి శంకుస్థాపన చేశారు.

ఉద్యోగ కల్పన దిశగా చదువులు

- స్కిల్ హబ్, కాలేజీ, వర్సిటీల ఏర్పాటు
- 'భవిత' ప్రారంభోత్సవంలో జగన్ వెల్లడి

విశాఖపట్నం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలో అనేక మార్పులను తీసుకు వస్తున్నామని, చదివే చదువుకు అనుగుణంగా ఉద్యోగాలు పొందేలా సంస్కరణలు చేపడుతున్నామని సీఎం జగన్ అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ ఆధ్వర్యంలో యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు చేపట్టిన 'ద కాస్కేడింగ్ స్కిల్స్-భవిత' కార్యక్రమాన్ని మంగళవారం ఆయన విశాఖలో ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. పైలట్ ప్రాజెక్టుగా 158 పారిశ్రామిక సంస్థలు ఏకంగా 208 ఐ.టి.ఐ., పాలిటెక్నిక్ కాలేజీలతో కలిసి పనిచేస్తున్నాయని, విద్యార్థులకు శిక్షణ ఇప్పించడంతోపాటు ఉద్యోగాలను అందించే బాధ్యతను తీసుకున్నాయన్నారు. ఇకపై దీన్ని రాష్ట్రవ్యాప్తంగా తీసుకువెళతామని తెలిపారు.నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ హబ్‌లు ఏర్పాటుచేస్తామన్నారు.

హై స్పీడ్ రైలు కారిడార్

హైదరాబాద్-విశాఖ, విజయవాడ-కర్నూలు ప్రాంతాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్ ఏర్పాటుచేస్తామని సీఎం జగన్ ప్రకటించారు. అయితే, ఏపీకి కేంద్రం 12 రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేసింది. వాటికి రాష్ట్ర వాటా రూ.3 వేల కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఆ మొత్తం కట్టకపోవడం వల్ల ఆ పనులన్నీ ఆగిపోయాయి. ఇవికాకుండా కేంద్రం మరో ప్రాజెక్టుకు సంబంధించి రూ.400 కోట్లు మంజూరు చేసింది. దానికి అవసరమైన భూములు కేటాయించక పనులు ఆగిపోయాయని బీజేపీ నేతలు అంటున్నారు.

తప్పతాగి.. కొంగుపట్టి లాగి...

దళిత మహిళపై దాడి

- ఆదోనిలో వైసీపీ నాయకుడి వీరంగం
- రాడ్‌తో కొట్టడంతో తలకు బలమైన గాయం

ఆదోని రూరల్, మార్చి 5: రాష్ట్రంలో ఎక్కడ చూసినా వైసీపీ నాయకుల దౌర్జన్యాలు, దాడులకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో తప్పతాగి కొంగులాగి ఓ దళిత మహిళపై వైసీపీ నాయకుడు రెచ్చిపోయాడు. 'మా అమ్మను కొట్టొద్దు...' అంటూ బతిమిలాడిన కొడుకులపై కూడా చేయి చేసుకున్నాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగింది. బాధితుల కథనం మేరకు...నాగనాథన హళ్లి గ్రామంలో మాదిగ జయమ్మ, శివప్ప, వారి కుమారులు నరసింహులు, విజయ భార్గవ్ కలిసి ఉంటున్నారు.

2018లో స్థిరాస్తి వ్యాపారి గుండమ్మ నుంచి ఒకటిన్నర సెంటు స్థలాన్ని జయమ్మ కొనుగోలు చేశారు. వీరిద్దరి నివాసాలు పక్క పక్కనే ఉన్నాయి. జయమ్మకు అమ్మిన స్థలంలో నాలుగు అడుగుల స్థలాన్ని గుండమ్మ కబ్జా చేసింది. దీనిపై కొన్ని రోజులుగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి 9గంటల సమయంలో మరోసారి గొడవ పడ్డారు. గుండమ్మకు మద్దతుగా ఆదోని కల్లుబావికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, రియల్ వ్యాపారి పురుషోత్తం రెడ్డి అక్కడకు వచ్చాడు. అప్పటికే పూర్తి మద్యం మత్తులో ఉన్న అతడు... జయమ్మను కులం పేరుతో దూషిస్తూ, ఆమె కొంగు పట్టి లాగి, పక్కనే ఉన్న ఇనుప రాడ్‌తో తలపై బాదాడు. రక్తపుమడుగులో ఉన్న భార్యను, కుమారులను శివప్ప ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. కాగా, పురుషోత్తంరెడ్డిపై బాధితురాలు ఫిర్యాదు చేశారనీ, విచారించి తగు చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

'కొల్లే' గొట్టేస్తున్నాడు



(మొదటి పేజీ తరువాయి)

కొట్టి మరీ అక్రమ తవ్వకాలను ప్రారంభించిన ఘటికుడు ఆయన ఇదొక్కటే కాదు, చట్టం కంట్లో 'దూలమే' పెట్టేసి నియోజకవర్గంలో ఆ ఎమ్మెల్యే చక్రం తిప్పుతున్నారు. నియోజకవర్గంలో ఏ పనికయినా ముందే రేటు ఫిక్స్ అయ్యుంటుంది. ఎమ్మెల్యే ఆయన కుమారుడు దీనికోసం ప్రత్యేక శాసనమే చేసి అమల్లో పెట్టారు. అడిగితే అరదండాలు, ప్రశ్నిస్తే పోలీసుల వేధింపులు అంటూ ప్రశాంతంగా బతికే స్వేచ్ఛను తండ్రీకొడుకులు హరిస్తున్నారు. ఉదాహరణకు కైకలూరులో అట్టహాసంగా ప్రారంభించిన జగనన్న కాలనీల కోసం సుమారు వంద ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం అప్పట్లో నిర్ణయించింది. ఆ ఎమ్మెల్యే తన తెలివితేటలను ఉపయోగించి, పట్టణంలో చేపల చెరువు గల స్థలాన్ని గుర్తించారు. ఇక్కడ ఎకరం రూ. 10 లక్షలు ఉంది. అయితే అప్పటికే రికార్డుల్లో బి-ఫామ్ పట్టాగా అక్కడి భూములు నమోదయి ఉన్నాయి. ఆయా యజమానులు తమ తమ అవసరాల దృష్ట్యా అనధికారికంగా వాటిని విక్రయించుకునేవారు. ఆ భూమ స్థలు అయితే తక్కువ ధరకు తీసుకోవచ్చని ఆ నేత ఆలోచించారు. అవే భూముల్లో జగనన్న కాలనీ ఏర్పాటుచేసేలా అధికారుల ద్వారా పావులు కదిపారు.

ఆ భూమంతా చేపల చెరువులుగా ఉండటంతో పూడికల నిమిత్తం అధికారులు తర్వాతి రోజుల్లో రూ. కోట్లల్లో నిధులను కూడా కేటాయించారు. కాగా అప్పటికే బీఫారం పట్టా ఉన్న ఆ భూములను రైతుల నుంచి ఎకరా కేవలం రూ.25 లక్షల చొప్పున బెదిరించి కొనుగోలు చేశారు. అనంతరం అదే భూమ లను అసలు మార్కెట్ రేటు ప్రకారం రూ.40 లక్షలకు కొనుగోలు చేసినట్లుగా చిత్రీకరిస్తూ ప్రభుత్వం నుంచి ఆ డబ్బులు వసూలు చేసుకున్నారు. అక్కడితో తృప్తి పడలేదు. జగనన్న లే-అవుట్లు అనుకుని ఉన్న సుమారు మరో 60 ఎకరాల పైనా వారి కన్ను పడింది. అనుకున్నదే తడవుగా ఆ భూములను బినామీల పేర్లతో ముందస్తుగా కొనుగోలు చేశారు. అధికార బలంతో రైతులను బెదిరించి రూ. 40 లక్షలు పలుకుతున్న ఒక్కో ఎకరాను రూ.25 లక్షల చొప్పున ధర చెల్లించి కొనుగోలు చేశారని చెబుతారు.

తోలకం మామూలుగా లేదుగా!

చేపల చెరువుల్లో ఉండే బుసకను లేఅవుట్లు, రోడ్లు, ఇళ్ల నిర్మాణాల్లో మెరక వేసేందుకు ఉపయోగిస్తుంటారు. అయితే ఏ రైతు కూడా తన చెరువుల్లోని బుసకను అతనికి నచ్చినట్లుగా విక్రయించుకునే స్వేచ్ఛ ఆ ఎమ్మెల్యే నియోజకవర్గంలో లేదు. నియోజకవర్గ వ్యాప్తంగా భారీగా బుసక తవ్వకాలను తండ్రీకొడుకులే పర్యవేక్షిస్తున్నారు. ఈ పనులను వైసీపీలోని ముఖ్య అనుచరులకు అప్పగించి వారినుంచి కమీషన్లు పడుతున్నారని చెబుతున్నారు. ఉదాహరణకు జగనన్న లే-అవుట్ పూడిక పనుల కోసం రూ.40 లక్షలు కేటాయించాలంటూ అధికారులు అప్పట్లో ప్రతిపాదనలు చేశారు. దీనికి అవసరమైన బుసకను తోలే కాంట్రాక్టును వైసీపీకి చెందిన ఒక నాయకుడికి రూ.10 లక్షలకు ఎమ్మెల్యే కుమారుడు కాంట్రాక్ట్ ఇవ్వగా, అతడు, మరో బుసక తోలకం దారుడికి రూ.7 లక్షలకు సబ్ కాంట్రాక్టు ఇచ్చినట్టు సమాచారం. నిత్యం రోజుకి 200 టిప్పర్ల బుసకను పలు ప్రాంతాలకు అప్పట్లో తరలించారు. కాంట్రాక్టు డబ్బు కాకుండా ఒక్కో టిప్పరు నుంచి రూ.2వేలను తండ్రీకొడుకులు దండుకున్నారు. ఈ దందాలో ఏటా కోట్ల రూపాయలను ఈ ద్వయం మింగేస్తోంది. ముఖ్యంగా నవంబరు నుంచి ఆగస్టు వరకు బుసక తవ్వకాలు భారీగా సాగుతున్నాయి. పరిస్థితి ఎలా ఉందంటే ఏదేని ఒక రైతు తన చేపలచెరువును మరమ్మతు చేసుకోవాలన్నా అనుమతి తీసుకోవాల్సిందే. నియోజకవర్గం పరిధిలో 45 కిలో మీటర్ల మేర జరుగుతున్న 165వ జాతీయ రహదారి విస్తరణ పనులకు అవసరమైన బుసక కాంట్రాక్టు పనులు కూడా ఆ ఎమ్మెల్యే చెప్పిన వ్యక్తే చేపడుతున్నారు.

కొల్లేరుపై గునపం

కొల్లేరులో అక్రమ చేపలచెరువుల తవ్వకాలు అడ్డగోలుగా పెరిగిపోయాయి. కొల్లేరులో చేపల పెరుగుదల ఎక్కువగా ఉంటుందని భావించే రైతులు సాగు కోసం పోటీపడుతుంటారు. ఆ బలహీనతను దృష్టిలో పెట్టుకుని గ్రామ ప్రజల నుంచి భారీగా ముడుపులు అందుకొని ఈ చెరువులను ప్రభుత్వ పెద్దలే దగ్గరుండి తవ్విస్తున్నారు. వారి అండతో తండ్రీకొడుకులు చెలరేగిపోతున్నారు. కొల్లేరు అభయారణ్య పరిధిలోనూ అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. అందులో రెవెన్యూ, ఫారెస్ట్ అధికారుల హస్తం కూడా ఉందన్నది బహిరంగ రహస్యమే. వందలాది ఎకరాలను అక్రమంగా తవ్వకాలు చేయిస్తూ, తవ్విన చేపలచెరువులను అత్యంత సన్నిహితులైన వ్యక్తులకు అనధికారిక లీజులకు కేటాయిస్తున్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో జగన్ రాజకీయ ప్రసంగం

- ఇలా చేయడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధం
- హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం



అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమాల్లో సీఎం జగన్ రాజకీయ ప్రసంగం చేయడంతో పాటు విపక్ష పార్టీ అధ్యక్షుడిని పేరు పెట్టి విమర్శించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. బాపట్ల జిల్లా, పర్చూరు మండలం, అన్నంబొట్లవారిపాలెం ప్రాంతానికి చెందిన చెన్నుపాటి సింగయ్య ఈ పిల్ దాఖలు చేశారు. ఫిబ్రవరి 15న పల్నాడు జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన గ్రామ-వార్డు వలంటీర్లకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఎం జగన్ విపక్షపార్టీ అధ్యక్షుడిని పేరు పెట్టి విమర్శించడాన్ని చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరారు. సీఎం చేసిన రాజకీయ ప్రసంగాన్ని పరిగణనలోకి తీసుకుని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వార్డు-గ్రామ వలంటీర్లకు ఎలాంటి ఎన్నికల సంబంధమైన విధులు అప్పగించకుండా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరారు. పోలింగ్ బూత్‌ల పరిసరాల్లోకి వలంటీర్లు వెళ్లకుండా అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమం నిర్వహణకు చేసిన ఖర్చు, అధికారుల పాత్రపై విచారణ చేసేలా సీఎస్, ఆర్థిక, పురపాలక, పంచాయితీ రాజ్‌శాఖల ముఖ్యకార్యదర్శులను ఆదేశించాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమంలో సీఎం రాజకీయ ప్రసంగం చేయడంపై నివేదిక సమర్పించేలా పల్నాడు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించాలని అభ్యర్థించారు. సీఎస్, ఆర్థిక, పంచాయితీరాజ్, పురపాలకశాఖల ముఖ్యకార్యదర్శులు, గ్రామ-వార్డు వలంటీర్ల డైరెక్టర్, పంచాయితీరాజ్‌శాఖ కమిషనర్, సమాచారశాఖ కమిషనర్, పల్నాడు జిల్లా కలెక్టర్, కేంద్ర ఎన్నికల సంఘం, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, వైసీపీ ప్రధాన కార్యదర్శిని వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు. వ్యక్తిగత హోదాలో ముఖ్యమంత్రి జగన్‌నీ ప్రతివాదిగా పేర్కొన్నారు.

'కౌంటర్'కు ఇంకెంత టైం కావాలి?

- సీబీఐ ఎస్పీ, వివేకా కుమార్తె కేసులో కృష్ణారెడ్డి తరపు లాయర్‌కు హైకోర్టు ప్రశ్న

అమరావతి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పులివెందుల పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంలో కౌంటర్ వేసేందుకు ఇంకెంత సమయం తీసుకుంటారని మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదుదారు కృష్ణారెడ్డి తరపు న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. కౌంటర్ వేసేందుకు పలుమార్లు సమయం ఇచ్చినా ఎందుకు దాఖలు చేయలేదని నిలదీసింది. కౌంటర్ వేయాలని కృష్ణారెడ్డిని ఆదేశిస్తూ విచారణను మార్చి 13కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆదేశాలు ఇచ్చారు. వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు అధికారి ఎస్పీ రామ్‌సింగ్ కోరిన విధంగా సాక్ష్యం చెప్పాలని, లేకుంటే హత్య కేసులో ఇరికిస్తామని వివేకా కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఒత్తిడి చేస్తున్నారని ఆరోపిస్తూ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టును ఆశ్రయించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిని పరిశీలించిన కోర్టు కేసు నమోదు చేసి జనవరి 4లోగా తుది నివేదిక ఇవ్వాలని పోలీసులను ఆదేశించింది. దీంతో సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ సహా సునీత, రాజశేఖరరెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా చార్జ్‌షీట్ వేశారు. పులివెందుల ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు, దాని ఆధారంగా నమోదు చేసిన కేసును కొట్టివేయాలని వీరు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. మేజిస్ట్రేట్ యాంత్రికంగా ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఈ దశలో ఫిర్యాదుదారుడు కృష్ణారెడ్డి తరఫు న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి స్పందిస్తూ.. కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ వాదనలపై పిటిషనర్ల తరపు న్యాయవాది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌంటర్ దాఖలు చేయకుండా గత మూడునెలలుగా సమయం కోరుతున్నారన్నారు. పోలీసులు తరపు న్యాయవాది స్పందిస్తూ.. ట్రయల్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశామని చెప్పారు. పిటిషనర్ల తరపు న్యాయవాది మరోసారి స్పందిస్తూ.. పోలీసులు వేసిన చార్జిషీట్‌ను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదన్నారు.

వలంటీర్లకు జగన్ మరో బిస్కెట్

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తున్న ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు) వాహనాల వెంట ఉంటున్నందుకు అదనపు ప్రోత్సాహకంగా ప్రతి వలంటీర్‌కు నెలకు రూ.500 చొప్పున అదనంగా చెల్లించాలంటూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు ఒకేసారి రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ నిధుల నుంచి ఆ నిధులు విడుదల చేయాలని ఆదేశించింది. దీంతో ఇప్పటికే పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ఆ కార్పొరేషన్‌పై మరో రూ.12 కోట్లకు పైగా ఆర్థిక భారం పడనుంది.

ప్రభుత్వ సేవలను ఇంటింటికీ చేరవేసేందుకంటూ వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇందుకుగాను నెలకు రూ.5 వేలు గౌరవ వేతనాన్ని వారికి ఇస్తున్నారు. దీనికి ఖజానా నుంచి రూ.392 కోట్లు చెల్లిస్తున్నట్లు ప్రభుత్వమే ప్రకటించింది. ఇప్పుడు ఎన్నికల ముందు వలంటీర్లు అందిస్తున్న ప్రతి సేవకు ఒక రేటు కట్టి.. వారికి ప్రజాధనాన్ని అధికారికంగానే పంచుతున్నారు. జగన్ పత్రికను వలంటీర్లతో కొనుగోలు చేయిస్తూ ప్రభుత్వ ఖజానా నుంచి ప్రతినెలా అదనంగా రూ.200 వలంటీర్లకు చెల్లిస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఎండీయూ వాహనాల వెంట ఉంటున్నందుకు రూ.500 వలంటీర్లకు అందించాలని ఆదేశించింది. వాస్తవంగా ఎండీయూ వ్యవస్థను ప్రారంభించినప్పటి నుంచే వాటి ద్వారా రేషన్ సరుకులను ఇంటింటికీ సక్రమంగా అందించేలా చూసే బాధ్యతను ప్రభుత్వం వలంటీర్లకే అప్పగించింది. వలంటీర్ల మీద నిజంగా అంత ప్రేమే ఉంటే.. మొదటి నుంచే రూ.500 ప్రోత్సాహకం ఇవ్వాలి కదా! ఈ నాలుగేళ్లుగా లేనిది.. ఇప్పుడే ఎందుకు ఇస్తున్నట్టు? ఇక్కడే ఉంది ట్విస్ట్. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు కోసం వలంటీర్లతో కూడా పనిచేయించుకోవడానికి పాలకులు ఇలాంటి అడ్డమైన దారులు తొక్కుతున్నారు. ప్రజాధనాన్ని అధికారికంగానే వలంటీర్లకు పంచిపెడుతూ వారికి ఆయాచిత లబ్ధి చేకూరుస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా ఎన్నికల్లో వారంతా వైసీపీ కోసం పనిచేసేలా పథక రచన చేశారన్నమాట. వాస్తవానికి వలంటీర్లకు వచ్చే మూడు నెలల కాలానికి అదనంగా రూ.750 చొప్పున అందిస్తామని జగన్ గత డిసెంబరులోనే హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ అదనపు మొత్తాన్ని రూ. 500లకు కుదించారు.

గుదిబండలా మారిన ఎండీయూ వ్యవస్థ: రాష్ట్రంలోని 1.49 కోట్ల రేషన్‌కార్డుదారులకు రేషన్ సరకులను డోర్ డెలివరీ చేసేందుకు ప్రభుత్వం కొత్తగా 9,260 ఎండీయూ వ్యాన్లను ఆర్భాటంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా ఆయా వర్గాల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామంటూ 60 శాతం సబ్సిడీపై ఎండీయూ వాహనాలను లబ్ధిదారులకు అందించింది. సబ్సిడీ కింద మొత్తం రూ. 539 కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించింది. ఎండీయూ వాహనాల నిర్వాహకులకు నెలకు రూ.21 వేలు జీతాలు కూడా ప్రభుత్వం చెల్లిస్తోంది. ప్రతినెలా రూ.21 కోట్ల ప్రజాధానాన్ని ఖర్చు పెడుతోంది. గతంలో ముగ్గురు డీలర్లకు చెల్లించే కమీషన్ మొత్తాన్ని ఇప్పుడు ఒక ఎండీయూకే చెల్లిస్తున్నారన్నమాట.

ఇంటింటికీ వెళ్లని వలంటీర్లు

ఎండీయూలను ప్రారంభించిన మొదట్లో వలంటీర్లు కూడా ఇంటింటికీ వెళ్లినప్పటికీ.. ఆ తర్వాత మానేశారు. పింఛన్ల పంపిణీ, ఇతర ప్రభుత్వ సేవలలో వలంటీర్లు బిజీ అయిపోయారు. దాంతో ఎండీయూ ఆపరేటర్లు ఇంటింటికీ వెళ్లకుండా.. వీధి చివరన వాహనాన్ని నిలిపి.. సైరన్ మోగిస్తున్నారు. చుట్టుపక్కల రేషన్ కార్డుదారులంతా వాహనం వద్దకు వచ్చి గంటల తరబడి వరుసలో నిల్చుని సరకులు తీసుకోవాల్సివస్తోంది. వాహనం వచ్చిన సమయంలోనే కార్డుదారులు సరకులు తీసుకోవాలి. లేకపోతే ఇక ఆ నెలకు సరకులు దక్కనట్టే. ఎన్నికల నేపథ్యంలో తాజాగా వలంటీర్లకు అదనంగా రూ.500 చొప్పున చెల్లించాలంటూ ఉత్తర్వులు జారీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పార్టీ తరఫునా వలంటీర్లకు తాయిలాలు..

వచ్చే ఎన్నికల్లో వలంటీర్ల సేవలను వినియోగించుకునేందుకు ఒకవైపున ప్రభుత్వమే అధికారికంగా ప్రజాధానాన్ని పంచుతుంటే.. మరోవైపు వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఇప్పటి నుంచే గ్రామ, వార్డు వలంటీర్లకు భారీఎత్తున తాయిలాలు పంచుతున్నారు. తొలివిడతగా రూ.5 వేల నగదుతోపాటు దుస్తులు, కుక్కర్లు, హాట్‌బాక్సులు పంచుతూ వలంటీర్లను మచ్చిక చేసుకుంటున్నారు. దీంతో వలంటీర్లు రాజకీయకార్యక్రమాల్లో పాల్గొనడానికి వీల్లేదంటూ విపక్షాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. ఇదే అంశంపై పలువురు కోర్టులను కూడా ఆశ్రయిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● బుధవారం 6 మార్చి 2024
diksuchi@andhrajyothy.com

ఐఐఐటీఎంలో ఎంబీఏ

గ్వాలియర్‌లోని అటల్ బిహారీ వాజపేయి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఐఐఐటీఎం)- 'మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులోనే రీసెర్చ్ బేస్డ్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది.

విభాగాలు: మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, ఐటీ అండ్ సిస్టమ్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: అకడమిక్ మెరిట్, క్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు.

సందర్భానుసారం రైటింగ్ కాంప్రహెన్షన్ కూడా ఉండవచ్చు. సంస్థ నిర్ణయం మేరకు అర్హులైన వారికి అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** మార్చి 30
- **అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ:** ఏప్రిల్ 4, 5
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 8న
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఏప్రిల్ 12
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఏబీవీ-ఐఐఐటీఎం గ్వాలియర్ (ఎంపీ)-474015
- **వెబ్‌సైట్:** iiitm.ac.in

సమ్మర్ ఇంటర్న్‌షిప్



ఐఐటీ తిరుపతి

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. ఇది మే 15 నుంచి ప్రారంభమౌతుంది. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు.

విభాగాలు

- కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత

గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఈ/బీటెక్/బీఎస్సీ/ఎమ్మెస్సీ/బీఏ/ఎంఏ ప్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్టయిపెండ్

ప్రతి విభాగంలో మొదటి అయిదు స్థానాల్లో ఉన్న వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.5,000 స్టయిపెండ్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు లేదు
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31
- సమ్మర్ ఇంటర్న్‌షిప్ 2024: మే 15 నుంచి జూలై 14 వరకు
- ఈ-మెయిల్: research@iittp.ac.in
- వెబ్‌సైట్: www.iittp.ac.in

విశాఖ ఐఐపీఈ

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ)- సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ 2024లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఎనిమిది వారాలు. ఈ ప్రోగ్రామ్ మే 6 నుంచి ప్రారంభమౌతుంది. ఇందులో భాగంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమెటిక్స్ విభాగాల్లో రీసెర్చ్ వర్క్‌కు సంబంధించి అవగాహన కల్పిస్తారు. లైబ్రరీ, స్పోర్ట్స్, కంప్యూటర్ సెంటర్, ఇంటర్నెట్ తదితర సౌకర్యాలు కల్పిస్తారు. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తారు.

'ఫండింగ్ ఫ్రం ఎస్ఐపీ' కింద వర్క్ చేసినవారికి, సంస్థలో ప్రాజెక్ట్ వర్క్ చేసినవారికి ఇంటర్న్‌షిప్ పూర్తయ్యాక నిబంధనల ప్రకారం రూ.10,000ల స్టయిపెండ్ ఇస్తారు.

విభాగాలు

- బయోసైన్సెస్/బయోటెక్నాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎర్త్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్

అర్హత

ప్రస్తుతం బీఈ/బీటెక్ ఆరో సెమిస్టర్, ఎంఎస్/ఎమ్మెస్సీ/ఎంటెక్ రెండో సెమిస్టర్, ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ ఎనిమిదో సెమిస్టర్, ఎమ్మెస్సీ డ్యూయెల్ డిగ్రీ ఎనిమిదో సెమిస్టర్ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాక్‌లాగ్స్ ఉన్న అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. పదోతరగతి, ఇంటర్ స్థాయుల్లో కనీసం 65 శాతం మార్కులు ఉండాలి. ఐఐటీలు, ఐసర్‌లు, నైసర్, ఐఐఈఎస్‌టీ, ఐఐఎస్సీ, సీఎఫ్‌టీఐ, నిట్ సంస్థల అభ్యర్థులకు డిగ్రీ స్థాయిలో కనీసం 7.5 సీజీపీఏ ఉండాలి. ఇతర కళాశాలల్లో చదివే అభ్యర్థులకు కనీసం 8.5 సీజీపీఏ ఉండాలి.

ఎంపిక

అకడమిక్ మెరిట్, రీసెర్చ్ అనుభవం, అవార్డులు, ప్రపోజ్‌డ్ వర్క్, రికమండేషన్ లెటర్స్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు: రూ.500
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 25
- ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల: ఏప్రిల్ 8న
- వెబ్‌సైట్: www.iipe.ac.in

భోపాల్ 'స్పా'లో పీజీ

భోపాల్‌లోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా)- ఫుల్ టైం పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. సీడ్ వ్యాలిడ్ స్కోర్, సీసీఎంటీ(గేట్ స్కోర్), డైరెక్ట్ అడ్మిషన్ కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. నిర్దేశించిన ప్రకారం సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు ప్రోగ్రామ్‌లకు అప్లయ్ చేసుకోవచ్చు. సీడ్ 2024/గేట్ 2024 స్కోర్ ఉన్నవారికి ఇన్‌స్టిట్యూట్ పీజీ స్కాలర్‌షిప్ లభిస్తుంది.

పీజీ ప్రోగ్రామ్‌లు

- మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(కన్జర్వేషన్/ల్యాండ్‌స్కేప్/అర్బన్ డిజైన్)
- మాస్టర్ ఆఫ్ కన్జర్వేషన్
- మాస్టర్ ఆఫ్ ల్యాండ్‌స్కేప్ డిజైన్
- మాస్టర్ ఆఫ్ ప్లానింగ్(అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్/ ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్/ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్)
- మాస్టర్ ఆఫ్ డిజైన్

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు

- ఇందులో జనరల్ ఎంసీక్యూ, డిపార్ట్‌మెంటల్ ఎంసీక్యూ, ఇంటర్వ్యూ ఉంటాయి. మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్సులో ప్రవేశానికి స్పా డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ మిగిలిన కోర్సుల్లో ప్రవేశానికి డిపార్ట్‌మెంటల్ డిస్క్రిప్టివ్ టెస్ట్ (స్కెచింగ్/డ్రాయింగ్/కంప్యూటేషన్స్) కూడా ఉంటాయి. డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో డిజైన్ టాస్క్ ఉంటుంది. దీనిని ఇచ్చిన పోర్టల్‌లో అయిదు గంటల లోపు అప్‌లోడ్ చేయాలి. జనరల్ ఎంసీక్యూలో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాలనుంచి; డిపార్ట్‌మెంటల్ ఎంసీక్యూలో డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, విజువల్ కమ్యూనికేషన్ అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- సీడ్ 2024 స్కోర్ ఉన్నవారు స్పా డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రాసి ఇంటర్వ్యూలో అర్హత పొందాలి. డైరెక్ట్ అడ్మిషన్ కేటగిరీ కింద అప్లయ్ చేసేవారికి గేట్/సీడ్ స్కోర్ అవసరం లేదు. వీరు ఎంట్రెన్స్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

సీట్ల వివరాలు

- ఈ ప్రోగ్రామ్‌లన్నింటిలో కలిపి మొత్తం 188 సీట్లు ఉన్నాయి. వీటిలో 113 సీట్లను సీసీఎంటీ లేదా సీడ్ స్కోర్-స్పా డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్-ఇంటర్వ్యూ ఆధారంగా భర్తీ చేస్తారు. మిగిలిన 75 సీట్లను డైరెక్ట్ అడ్మిషన్ ప్రక్రియ ద్వారా నింపుతారు. డైరెక్ట్ అడ్మిషన్ కింద ఎంయుఆర్‌పి ప్రోగ్రామ్‌లో 15 సీట్లు; మిగిలిన ప్రతి కోర్సులో 10 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు

- బీఆర్క్/బీప్లాన్/(బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్) పూర్తిచేసినవారు అన్ని ప్రోగ్రామ్‌లకూ దరఖాస్తు చేసుకోవచ్చు. మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(ల్యాండ్‌స్కేప్), మాస్టర్ ఆఫ్ ల్యాండ్‌స్కేప్ డిజైన్ ప్రోగ్రామ్‌లకు (బీఎస్సీ+ఎమ్మెస్సీ)(హార్టికల్చర్/అగ్రికల్చర్/ఫారెస్ట్రీ/ఎకాలజీ/బోటనీ/జువాలజీ/జియాలజీ/జియోమార్ఫాలజీ); మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(కన్జర్వేషన్), మాస్టర్ ఆఫ్ కన్జర్వేషన్ ప్రోగ్రామ్‌లకు ఎంఏ(హిస్టరీ/కల్చరల్ స్టడీస్/హెరిటేజ్ స్టడీస్/ఆంత్రోపాలజీ)/(ఎంఏ/ఎమ్మెస్సీ/పీజీ డిప్లొమా)(మ్యూజియాలజీ/ఆర్కియాలజీ)/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ(లా-హెరిటేజ్ లా); మాస్టర్ ఆఫ్ ప్లానింగ్‌లో అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌కు (ఎంఏ/ ఎమ్మెస్సీ) (జాగ్రఫీ/ఎకనామిక్స్)/ఎంఏ సోషియాలజీ, ఎన్విరాన్‌మెంట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌కు (ఎంఏ/ఎమ్మెస్సీ) (జాగ్రఫీ/ఎకనామిక్స్/సోషియాలజీ)/ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ఇంటిగ్రేటెడ్ డిగ్రీ(లా-ఎన్విరాన్‌మెంటల్ లా/జనరల్ లా); ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు (ఎంఏ/ఎమ్మెస్సీ)(జాగ్రఫీ/ఎకనామిక్స్)/ఎమ్మెస్సీ(స్టాటిస్టిక్స్/ఆపరేషన్స్ రీసెర్చ్/ఎకనామెట్రిక్స్) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఎండిజైన్ ప్రోగ్రామ్‌నకు బీడిజైన్ పూర్తిచేసినవారు, బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (విజువల్ కమ్యూనికేషన్) ఉత్తీర్ణతతోపాటు ఏడాది అనుభవం ఉన్నవారు, మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(విజువల్ కమ్యూనికేషన్) ఉత్తీర్ణులు కూడా అర్హులే.

డిగ్రీ స్థాయిలో ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 1
- ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ: మే 15న
- ఇంటర్వ్యూలు: మే 16, 17
- వెబ్‌సైట్: www.spabhopal.ac.in



జాబ్ కార్నర్

ఏఎస్ఆర్‌బీలో అసిస్టెంట్ డైరెక్టర్లు

న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్...కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 21

పోస్టు: అసిస్టెంట్ డైరెక్టర్

అర్హత: ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలి. డిగ్రీ స్థాయిలో తప్పనిసరిగా హిందీ, ఇంగ్లిష్ చదివి ఉండాలి. పనిచేసిన అనుభవం కూడా ఉండాలి.

వయోపరిమితి: 35 సంవత్సరాలు మించకూడదు

దరఖాస్తు రుసుం: జనరల్ అభ్యర్థులకు రూ.1000. ఎస్సీ, ఎస్టీ,పీడబ్ల్యూ అభ్యర్థులు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు.

దరఖాస్తుకు చివరి తేదీ: మే 2

వెబ్‌సైట్: http://www.asrb.org.in/

ఎన్ఐఏబీలో ఇంజనీర్, క్లర్కులు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ(ఎన్ఐఏబీ)...డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. సర్వీస్ అండ్ మెయింటెనెన్స్ ఇంజనీర్: 1 పోస్టు

2. క్లర్కులు: 2 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిగ్రీ(సివిల్/ఎలక్ట్రికల్/మెకానికల్) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం, టైప్‌రైటింగ్ నైపుణ్యాలు ఉండాలి.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 22

వెబ్‌సైట్: https://www.niab.res.in/

'ఫిన్‌లాండ్' లోగో డిజైన్ విన్నర్ ఇండియన్ స్టూడెంట్

సోనిపట్‌లోని వరల్డ్ యూనివర్సిటీ ఆఫ్ డిజైన్‌లో రెండో ఏడాది కోర్సు చేస్తున్న విద్యార్థి అమన్ నారాయణ్ - లోగో డిజైన్ చాలంజ్‌లో విజయం సాధించాడు. ఇండియాతో దౌత్య సంబంధాలకు 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ పోటీని ఫిన్‌లాండ్ ఎంబసీ నిర్వహించింది. ఇదే వర్సిటీకి చెందిన 40 మంది విద్యార్థులు 70 డిజైన్లను సమర్పించారు. ఇండియా, ఫిన్‌లాండ్‌కు చెందిన వ్యక్తులు జడ్జీలుగా వ్యవహరించారు. ప్రత్యేకంగా నిర్వహించిన ఫంక్షన్‌లో అమన్ నారాయణ్‌కు ప్రైజ్‌మనీగా రూ.50,000 అందించారు.

SCHOLARSHIP ALERT

The Anant Fellowship 2024-25

Description: The Anant Fellowship 2024-25 is an opportunity offered by Anant National University (India's First DesignX University) for undergraduate degree holders in any discipline. This global, year-long postgraduate programme prepares and empowers individuals to become solutionaries who can design, build, and preserve equitable built environments.

Eligibility: Open for undergraduate degree holders in any discipline who demonstrate a commitment to improving the built environment. Applicants must possess a strong academic record and extracurricular achievements.

Prizes & Rewards: Up to 100% of the tuition fee and other benefits. **Last Date to Apply:** 31-07-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/TAFM1

British Council Scholarship for Women in STEM 2024

Description: British Council Scholarship for Women in STEM 2024 is an opportunity offered by the British Council in partnership with UK universities for females pursuing postgraduate degrees in Science, Technology, Engineering, and Mathematics (STEM) fields at selective universities in the UK.

Eligibility:
- Open for females from a specific country participating in the program.
- Applicants must hold a bachelor's degree in STEM subject and have secured admission to a pre-selected postgraduate program at a participating UK university.
- Applicants must demonstrate a need for financial support/socio-economic need.
- Applicants must meet the English language proficiency requirements for postgraduate study in the UK.

Prizes & Rewards: Full tuition fees, living stipend and other benefits

Last Date to Apply: 30-04-2024

Application mode: Online applications only

Short Url:www.b4s.in/aj/BCSM1

Teach for India Fellowship 2024



Description: Teach for India Fellowship 2024 is an opportunity offered by Teach For India (a non-profit organisation) to young graduates from universities and workplaces to serve as full-time teachers for children belonging to underserved communities. Under this fellowship, the selected fellows will explore the leadership knowledge, skills, and mindset required in the movement for educational equity.

Eligibility: Open for Indian citizens or Overseas Citizens of India (OCI) who have completed graduation by June/July 2024. Applicants must be applying for the first time for the 2024 Fellowship cohort (since July 2023).

Prizes & Rewards: A monthly stipend of ?23,040 and other benefits

Last Date to Apply: 17-03-2024

Application mode: Online applications only

Short Url:www.b4s.in/aj/TFIF2

buddy4study.com

చింటూ



నిజాయితీకి పట్టం


ఒక ఊరిలో కట్టెలు కొట్టుకుని బతికే వ్యక్తి ఉండేవాడు. అతనికి ముగ్గురు పిల్లలు. ఎన్ని కష్టాలున్నా నిజాయితీగా ఉండేవాడు. అతని పేరు రామయ్య. అతని పని అంతా అడవికి వెళ్లి కట్టెలు కొట్టడం.. వాటిని దగ్గర ఉండే దళారులకు ఇచ్చి డబ్బులు తీసుకుని.. తన కుటుంబాన్ని పోషించుకునేవాడు. దీంతో అతను ఎవ్వరితో పెద్దగా కలసిపోయేవాడు కాదు. తన పనిలో తాను ఉండేవాడు.

ఒక రోజు అడవికి వెళ్లాడు. విపరీతమైన వర్షం. దీంతో కట్టెలు కొట్టలేకపోయాడు. ఇంటికి వచ్చాడు. ఆ వర్షం తుఫానైంది. మూడు రోజుల తర్వాత వెలిసింది. మరుసటి రోజు ఎండ పడుతూనే ఇక రామయ్య తన గొడ్డలితో బయలుదేరాడు. చెట్లను కొడుతుండగా లోపల చావ ఉండటంతో ఆ గొడ్డలి వేగంగా వెనక్కి ఎగిరి పడిపోయింది. క్షణాల్లో గొడ్డలి ఎలా వెనక్కి వెళ్లిందో కూడా అర్థం కాలేదు రామయ్యకు. తన బతుకు తెరువుకు ఉపయోగపడే గొడ్డలి నదిలో పడింది. ఆ లోతైన నదిలో పడిన గొడ్డలి ఇక రాదని ఎంతో వేదన చెందాడు. బాధపడ్డాడు.



రామయ్య బాధపడుతోంటే ఓ దేవత ప్రత్యక్షమైంది. 'నీ ఏడుపు ఎందుకూ?' అని అడిగింది. విషయం చెప్పాడు రామయ్య. వెంటనే ఆ దేవత మాయమైంది. నదిలోపల నుంచి బంగారు గొడ్డలి తెచ్చింది. ఈ గొడ్డలి నీదేనా? అని అడిగింది. 'ఇది నాది కాదు. ఇంత మెరవలేదు' అన్నాడు. దీంతో దేవత మరోసారి అదృశ్యమైంది. రెండోసారి మళ్లీ ప్రత్యక్షమై వెండి గొడ్డలిని ఇచ్చింది. అది చూసిన రామయ్య.. 'ఇది నాది కానే కాదు' అంటూ బాధపడ్డాడు. దీంతో దేవత మళ్లీ మాయమైంది. ఇది నీ గొడ్డలే అని చేతికి ఇచ్చింది. కట్టె చివర్లో విరిగిపోయిన ఆ పాత గొడ్డలిని చూసి మురిసిపోయాడు రామయ్య. ఎంతో ఆనందంగా 'ఇదే నా గొడ్డలి' అన్నాడు. రామయ్య నిజాయితీకి మెచ్చి వెంటనే 'ఆ రెండు గొడ్డళ్లను ఇచ్చేస్తా' అన్నది. రామయ్య వద్దన్నాడు. దేవత తీసుకోమని ఇచ్చింది. అతని నిజాయితీకి మెచ్చిన దేవత మరిన్ని బంగారు నాణేలను ఇచ్చింది.

ఎన్ని చేపలు ఉన్నాయి



7 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 247

		4		6			8	
	3			8	2			
7		8						2
		1	8				6	5
				2				
6	7				9	4		
5						7		6
			6	1			9	
	1			3		5		

సుడోకు - 246 సమాధానం

7	3	1	4	8	9	2	5	6
4	2	8	5	6	3	1	7	9
9	5	6	2	7	1	3	8	4
1	6	2	8	9	4	5	3	7
3	8	9	7	5	2	6	4	1
5	4	7	3	1	6	8	9	2
8	1	5	6	4	7	9	2	3
6	7	3	9	2	8	4	1	5
2	9	4	1	3	5	7	6	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.